సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 28

గురువారం 20-4-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'




రాజస్తాన్ బోల్తా

లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో 10 పరుగులతో ఓడిపోయిన రాయల్స్. -12లో



దేశవ్యాప్తంగా డిజిటల్ హైవేలు

పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్–బెంగళూరు కారిడార్ ఎంపిక -13లో



క్వాంటమ్ మిషన్‌కు ఆమోదం

క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ అభివృద్ధి కోసం ఉద్దేశించిన నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

- వివరాలు 6లో



సూడాన్‌లో చిక్కిన భారతీయులు

సూడాన్ సైన్యం, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌కు మధ్య కొనసాగుతున్న దాడులు అక్కడి భారతీయులకు కష్టాలు తెచ్చిపెట్టాయి.

- వివరాలు 6లో



జోరందుకున్న నామినేషన్ల పర్వం

కర్ణాటకలోని శిగ్గావ్ నియోజకవర్గం నుంచి సీఎం బసవరాజ్ బొమ్మై, వరుణ స్థానం నుంచి మాజీ సీఎం సిద్ధరామయ్య నామినేషన్లు వేశారు.

- వివరాలు 6లో



కొత్తా ఓటరండీ..!

కర్ణాటకలో ఈసారి 11 లక్షల మంది కొత్త ఓటర్లు రిజిస్టర్ చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ: హరీశ్‌రావు



ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- వివరాలు 3లో

ఎంసెట్‌కు ఇంటర్ మార్కుల వెయిటేజ్ ఎత్తివేత



ఎంసెట్‌కు ఇంటర్ మార్కుల వెయిటేజ్‌ను ఎత్తివేశారు. ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఇక ఎంసెట్‌లో పొందే మార్కుల ఆధారంగానే ర్యాంకు ఇస్తారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

- వివరాలు 3లో

పంట నష్టపరిహారం రూ.151 కోట్లు



మార్చి 17 నుంచి 21 మధ్య కురిసిన వడగళ్ల వాన కారణంగా జరిగిన పంటల నష్టానికి గాను రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. రూ.151.64 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 5లో

డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు



టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో ఆదాయ పన్నుశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల విడుదలైన కొన్ని భారీ చిత్రాల నిర్మాణానికి విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు పెట్టుబడిగా తీసుకోవడం, పన్నుల చెల్లింపుల్లో అవకతవకలపై ఐటీ అధికారులు ఈ సోదాలు చేపట్టినట్టు తెలిసింది.

- వివరాలు 2లో

మన జనాభా 142.86 కోట్లు



చైనాను దాటేసిన భారత్..

డ్రాగన్ దేశం జనాభా 142.57 కోట్లు


ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం నివేదిక విడుదల

- 2050 నాటికి భారత్ జనాభా 166.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనా జనాభా 131.7 కోట్లకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

6లో

- భారత్‌లోని 142 కోట్ల జనాభాను 142 కోట్ల అవకాశాలుగా చూడాలని యూఎన్‌ఎఫ్‌పీఏ–ఇండియా ప్రతినిధి, భూటాన్ కంట్రీ డైరెక్టర్ ఆండ్రియా వోజ్‌నార్ చెప్పారు. దేశంలో యువ జనాభా అత్యధికంగా ఉండడం గొప్ప అవకాశమని అన్నారు. 15 నుంచి 24 ఏళ్లలోపు యువత 25.4 కోట్ల మంది ఉన్నారని, నవీన ఆలోచనలు, నవీన ఆవిష్కరణలు, నూతన పరిష్కార మార్గాలకు వీరంతా వనరులేనని ఉద్ఘాటించారు.

142 కోట్ల అవకాశాలు



68% జనాభాలో 15 నుంచి 64 ఏళ్ల వయసు వారు.

26% 10 నుంచి 24 ఏళ్లలోపు వయసు విభాగానికి చెందినవారు.

7% 65 ఏళ్లు దాటినవారు..

18% 10 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్నవారు..

25% 14 ఏళ్లలోపు బాలలు..

మంటలు కంటిన్యూ..

రాష్ట్రంలో మండుతున్న ఎండలు.. ఉష్ణోగ్రతలు ఇంకా పెరుగుతాయన్న వాతావరణ శాఖ

- గురు, శుక్రవారాల్లో పలుచోట్ల 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం
- చాలాచోట్ల వడగాడ్పులు వీయవచ్చని హెచ్చరిక
- గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రమంతా ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఈనెల 22 నుంచి నాలుగైదు రోజులు మాత్రం కాస్త ఉపశమనం
- ఆ తర్వాత మళ్లీ పెరుగుతాయని అంచనా.. పలుచోట్ల వానలు కూడా..
- వాతావరణంలో మార్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



వేరుశనగ మొక్కలే గుడిసెగా..

ఎండలు మండుతుండటంతో వేరుశనగ పంట తీసేందుకు వెళ్లిన కూలీలు.. ఆ మొక్కలనే గుడిసెగా మార్చుకుని పనిచేసుకుంటున్న దృశ్యమిది. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం వడ్డాడి గ్రామశివార్లలో ఈ దృశ్యం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలన్నా భయపడేలా వడగాడ్పులు వీస్తున్నాయి. గాలిలో తేమశాతం బాగా పెరగడంతో విపరీతంగా ఉక్కపోత ఉంటోంది. మరో రెండు రోజులు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని చాలాచోట్ల 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
ఆదిలాబాద్	42.3	మహబూబ్‌నగర్	41.1
నిజామాబాద్	41.9	హనుమకొండ	41.0
రామగుండం	41.6	ఖమ్మం	40.6
మెదక్	41.5	హైదరాబాద్	39.4
నల్లగొండ	41.5	హకీంపేట్	39.0
భద్రాచలం	41.4	దుండిగల్	39.0

దేశవ్యాప్తంగా భగభగలు

న్యూఢిల్లీ: భానుడి ప్రతాపంతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు అల్లాడిపోతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో, ఒడిశాలోని బారిపడలో 44.5 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఢిల్లీలో కొన్ని రోజులుగా 40 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లోనూ ఎండ ప్రచండంగా ఉంది. దాంతో త్రిపురలో 'స్టేట్ స్పెసిఫిక్ డిజాస్టర్' ప్రకటించారు. కేరళలోనూ ఎండలు మండుతున్నాయి. పశ్చిమ బెంగాల్, ఏపీ, బిహార్ తదితర రాష్ట్రాల్లో తీవ్ర వడగాడ్పులు రెండు రోజులుంటాయని ఏపీలో ఈ నెల 21, 22ల్లో వర్షం పడొచ్చని వాతావరణ శాఖ చెప్పింది.

పది లక్షల వీసాలు

- ఈ ఏడాది ఇస్తామన్న అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్
- విద్యార్థి వీసాలకు ప్రాధాన్యం
- వారు సకాలంలో కోర్సుల్లో చేరేందుకు వీలుగా చర్యలు
- హైదరాబాద్ కార్యాలయంలో సిబ్బంది పెంపు



కాన్సులేట్ అధికారులతో కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్

సాక్షి, హైదరాబాద్: అమెరికా వీసా కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు ఓ శుభవార్త. ఈ ఏడాది దేశంలోని అమెరికా దౌత్య కార్యాలయంతోపాటు 4 కాన్సుల్ జనరల్ ఆఫీసుల ద్వారా పది లక్షల కంటే ఎక్కువ వీసాలు జారీ చేయనున్నట్లు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ప్రకటించారు. అలాగే, హైదరాబాద్ కాన్సుల్ జనరల్ కార్యాలయంలోనూ తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో ఇటీవల ప్రారంభించిన అమెరికన్ కాన్సుల్ జనరల్ కొత్త కార్యాలయంలో జెన్నిఫర్ లార్సన్ ఇతర అధికారులతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోవిడ్ కారణంగా మందగించిన వీసాల జారీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు తీసుకున్న చర్యల గురించి వివరించారు. విద్యార్థి వీసాల జారీకి ప్రాధాన్యమిస్తున్నామని, సకాలంలో వారు కోర్సుల్లో చేరేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వీసాల జారీకి ఓవర్‌టైమ్: హైదరాబాద్ కార్యాలయంలో వీసా అధికారులను గణనీయంగా పెంచినట్లు కాన్సులర్ వ్యవహారాల చీఫ్ రెబెకా డ్రామే తెలిపారు. తాత్కాలిక కాన్సుల్ జనరల్ కార్యాలయం పైగా ప్యాలెస్‌లో ఉన్నప్పుడు ఒక్క రోజులో గరిష్టంగా 1,100 వీసాలు/ఇతర లావాదేవీలు ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉండగా, కొత్త కార్యాలయంలో ఈ సామర్థ్యం 3,500 వరకూ ఉంటుందన్నారు. పైగా ప్యాలెస్ కార్యాలయంలో 16 కాన్సులర్ విండోస్ ఉండగా, కొత్త కార్యాలయంలో 54 ఉన్నాయని తెలిపారు. వీసాల్లో మార్పులు చేసుకునేందుకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న డ్రాప్‌బాక్స్ సౌకర్యాన్ని కూడా మరింత విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి వీసాలపై మాట్లాడుతూ.. అమెరికాలో విద్యాభ్యాసానికి తొలిసారి దరఖాస్తు చేసుకున్న వారికి పాఠాలు మొదలయ్యే సమయానికి అక్కడ ఉండేలా చూసేందుకు ప్రయత్నిస్తామని

మిగతా 2వ పేజీలో ▶

బీజేపీని ఓడించగలిగితే కాంగ్రెస్‌తో సర్దుబాటు

- కానీ రాష్ట్రంలో పరిస్థితి ఆవిధంగా లేదు
- అందువల్ల బీఆర్‌ఎస్ వైపే ఉంటాం..
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని స్పష్టీకరణ
- ప్రజా సమస్యలపై సీఎం కేసీఆర్‌తో భేటీ కానున్నట్టు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కొన్ని రాష్ట్రాల్లో ఉన్నట్టుగా బీజేపీని ఓడించే స్థాయికి కాంగ్రెస్ చేరితే ఇక్కడ కూడా ఆ పార్టీతో సర్దుబాటు చేసుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కానీ రాష్ట్రంలో పరిస్థితి ఆవిధంగా లేదని, అందుకే బీఆర్‌ఎస్ వైపే ఉంటామని చెప్పారు. అయితే సీట్ల గురించి బీఆర్‌ఎస్‌తో ఇంకా చర్చ జరగలేదని, సమయం వచ్చినప్పుడు తమ బలానికి

మిగతా 3వ పేజీలో ▶

అసెంబ్లీ రన్.. '160' డేస్!

- రాష్ట్రంలో పట్టుకోసం 160 రోజుల కార్యక్రమాలకు బీజేపీ ప్రణాళిక
- తొమ్మిదేళ్ల మోదీ విజయాల ప్రచారం.. కేసీఆర్ వైఫల్యాలపై పోరాటం
- నేతలకు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్ సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. వచ్చే 160 రోజుల కార్యక్రమాలకు బీజేపీ జాతీయ నాయకత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసింది. పోలింగ్ బూత్ స్థాయి వరకు పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడం, ఎన్నికల సందర్భంగా ఎలాంటి సవాళ్లు ఎదురైనా ఎదుర్కొనేలా పార్టీ యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవడంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని నిర్ణయించింది. ఇప్పటినుంచి

మిగతా 5వ పేజీలో ▶

యువజన, విద్యార్థి సమ్మేళనాలపై ఫోకస్

- ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా ఏర్పాటు
- అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా వివిధ సామాజిక వర్గాలతో బీఆర్‌ఎస్ ప్రత్యేక భేటీలు
- లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్వపు హైదరాబాద్ స్టేట్ పరిధిపై దృష్టి



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పార్టీ కేడర్‌తో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్).. వాటిని మరింత విస్తృతం చేయాలని నిర్ణయించింది. ఉద్యమ సమయంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న యువజన, విద్యార్థి వర్గాలకు దగ్గరయ్యేందుకు ప్రత్యేక సమ్మేళనాలను నిర్వహించాలని భావిస్తోంది. విద్యార్థి, యువజన, ఉద్యోగ వర్గాలు తమకు అనుకూలంగా ఉన్నాయని

మిగతా 3వ పేజీలో ▶

ఎక్స్‌షోరూం ధరపైనే జీవిత పన్ను..

- డిస్కౌంట్‌తో సంబంధం లేదంటున్న మోటారు వాహన చట్ట సవరణ
- బిల్లుకు గవర్నర్ ఆమోదంతో గెజిట్ జారీ
- వాహనం ఎప్పుడు కొన్నా.. రిజిస్ట్రేషన్ ఇప్పుడు జరిగితే కొత్త విధానమే వర్తింపు



సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి వాహనాల ఎక్స్‌షోరూమ్ ధరల మీదనే జీవిత పన్ను విధిస్తారు. ఇంతకాలం వాహనం కొనుగోలుపై షోరూమ్ నిర్వాహకులు ఇచ్చే డిస్కౌంట్ పోను, మిగతా మొత్తం మీద మాత్రమే పన్ను విధించేవారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేసిన మోటారు వాహనాల చట్ట సవరణ ఇప్పుడు అమలులోకి వచ్చింది. చట్ట సవరణ బిల్లుకు గత నెల చివరలో గవర్నర్ ఆమోదం తెలిపిన

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీ మతిమరుపు వల్ల తృణమూల్ నుంచి బీజేపీలోకి.. బీజేపీ నుంచి తృణమూల్‌లోకి.. మళ్లీ ఇప్పుడు బీజేపీలోకి మారుతూనే ఉన్నార్సార్!

కట్నంగా కుక్కలు..

గంగిరెద్దుల కుటుంబాల్లో తరాలుగా ఆచారం

సిరిసిల్ల: శునకాలను కొందరు అభిరుచికొద్దీ, ఇంకొందరు ఇంటికి రక్షణ కోసం పెంచుకుంటారన్న విషయం తెలిసిందే. కానీ.. శునకరాజాలను ఆస్తిగా భావిస్తూ.. ఆడపిల్లలకు కట్నంగా కూడా ఇచ్చే కుటుంబాలు కూడా ఉన్నాయి. వాళ్లెవరూ, వారి జీవనశైలి ఏమిటి? తెలుసుకోవాలనుకుంటున్నారా..!

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు గ్రామాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించే గంగిరెద్దుల కుటుంబాలు ఉన్నాయి. కోనరావుపేట మండలం కొండాపూర్, బావుసాయిపేట, చందుర్తి మండలం రామారావుపల్లె గ్రామాల్లో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ మూడు పల్లెలకు చెందిన గంగిరెద్దుల కుటుంబాల వారు జిల్లావ్యాప్తంగా భిక్షాటన చేస్తారు. ఆహారాన్ని సేకరించి కుక్కలను పోషిస్తారు. ఈ కుక్కలను వేటకు, వారు నివాసం ఉండే గుడారాల రక్షణకు ఉపయోగిస్తారు. ఒక్కో కుటుంబంలో ఐదు నుంచి పది, పదిహేను, ఇరవై.. శునకాలను పెంచుతుంటారు. అయితే శునకాలనే ఆస్తిలా భావించే ఈ ఆచారం గంగిరెద్దుల కుటుంబాల్లో తరతరాలుగా కొనసాగుతోంది. ఎన్ని ఎక్కువ శునకాలను పెంచితే అంత ఆస్తిపరులన్న మాట. వారు పోషిస్తున్న శునకాల సంఖ్యను బట్టే ఆ కుటుంబ పెద్దకు వారి కులంలో గౌరవం లభిస్తుంది. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఆడ పిల్లలకు పెళ్లిలో కట్నంగా శునకాలను ఇచ్చే సంప్రదాయం ఈ కుటుంబాల్లో ఉంది. అయితే ఇప్పుడిప్పుడే ఆ కుటుంబాల్లో మార్పు వస్తోంది. వ్యవసాయం చేస్తూ కొందరు.. చిన్న చిన్న బుట్టల్లో ప్లాస్టిక్ సామగ్రి అమ్ముతూ, కొబ్బరి కుడుకలకు బదులు చక్కెర ఇస్తూ కొందరు జీవనం సాగిస్తున్నారు.

ఒకప్పుడు ఎక్కువగా ఉండేవి..

మాకు కుక్కలను పెంచడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటి ముందు ఎన్ని ఎక్కువ కుక్కలుంటే అంత విలువ ఉండేది. ఇప్పుడు కూడా ఉన్నాయి. కానీ తక్కువ. కాలం మారినా.. మాకు కుక్కలు ఉండాల్సిందే. మేం ఏం తింటే అదే వాటికి పెడతాం. మాతోనే ఉంటాయి. మేం ఏ ఊరికి వెళ్తే.. ఆ ఊరికి మా వెంట వస్తాయి. – టేకుమల్ల రాజయ్య, సంచార జీవి.



కుక్కలను తమ వెంట తీసుకెళ్తున్న ఓ కుటుంబం

శునకాలే మా ఆస్తి..

మునుపు ఎక్కువ కుక్కలను పెంచేటోళ్లం. శికారీ చేసేవాళ్లం. కానీ ఇప్పుడు మావోళ్లు సోకులకు వచ్చిండ్రు. కుక్కలను ఎక్కువ సాదుత లేరు. వ్యవసాయం చేస్తుండ్రు. కుడుకలకు చక్కెరి అమ్ముతూ.. బతుకుతుండ్రు. బిచ్చం ఎత్తడం లేదు. అయినా మాకు కుక్కలతోనే ధనం.

– గంట లచ్చయ్య, బావుసాయిపేట.



అనంతపురంలోని మార్గదర్శి కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

నల్ల 'మార్గం'లో!

- 'మార్గదర్శి'రశీదు డిపాజిట్ల ముసుగులో భారీగా బ్లాక్‌మనీ మార్పిడి
- ఆ నల్లధనాన్నే తమ సంస్థల్లో పెట్టుబడులుగా తరలించిన రామోజీ
- 7 బ్రాంచీల్లో సీఐడీ సోదాలు.. కీలక ఆధారాలు లభ్యం
- మరికొద్ది రోజులు కొనసాగనున్న సోదాలు

-10లో

క్లుప్తంగా...



నల్లమల అభయారణ్యంలో మంటలు

60 హెక్టార్లకు పైగా అడవి అగ్నికి ఆహుతి

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో భారీగా మంటలు చెలరేగాయి. దాదాపు 60 హెక్టార్ల (150 ఎకరాల) విస్తీర్ణానికి పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైనట్లు అమ్రాబాద్ ఎఫ్ఆర్వో ప్రభాకర్ తెలిపారు. మంగళవారం రాత్రి తాటిగుండాల వద్ద మొదలైన మంటలు బుధవారం ఈర్లపడేల్, లంబడోని ఉతార్, జీలుగాయి కుంట, శుద్దబొక్కలు అటవీ ప్రాంతం వరకు వ్యాపించినట్లు తెలిపారు. శాటిలైట్ ద్వారా అందిన సమాచారం మేరకు అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. దాదాపు 20 మంది ఫైర్ ప్రొటెక్షన్, వాచర్లు అత్యాధునిక యంత్రాలతో ఎనిమిది గంటల పాటు శ్రమించి.. బుధవారం రాత్రి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. 2018 తర్వాత ఈ స్థాయిలో ఒకేసారి నల్లమల అడవి తగులబడటం ఇది రెండోసారి. కాగా అడవిలో అరుదైన వృక్షాలు, పక్షులు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది.

30న బీసీ గురుకుల కాలేజీ ప్రవేశ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈనెల 30న అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి మల్లయ్య బట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 22,400 సీట్లు ఉండగా 58,113 దరఖాస్తులు వచ్చాయని, డిగ్రీలో 4,560 సీట్లు ఉండగా 8,429 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈనెల ఏప్రిల్ 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలతో సహా 277 సెంటర్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

పార్టీ కార్యాలయాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయండి

ఢిల్లీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ తుదిదశ పనులు పరిశీలించిన మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని వసంత్ విహార్‌లో నిర్మాణంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిర్మాణ సంస్థను ఆదేశించారు. బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయ తుది దశ నిర్మాణ పనులతో పాటు కార్యాలయ ఫర్నిచర్‌ను బుధవారం మంత్రి పరిశీలించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆలోచనల ప్రకారం పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణ తుదిదశ పనులపై ప్రశాంత్‌రెడ్డి నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట ఆర్కిటెక్ట్ ఆస్కార్, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు ఉన్నారు.

ఐఐటీల్లో క్రెడిట్ ఫ్రేం వర్క్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని 23 ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను ముందుకు తీసుకెళ్లనున్నారు. ఐఐటీ భువనేశ్వర్‌లో మంగళవారం జరిగిన ఐఐటీ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్ నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ పురోగతిని వివరించారు. దీని అమలుకు యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీవీఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ, స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వశాఖతో కలిపి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఎలిమెంటరీ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు వివిధ కేటగిరీలుగా విభజించి, ప్రతీ విభాగానికి కొన్ని క్రెడిట్స్ ఇవ్వడం దీని ఉద్దేశం. దీనివల్ల ఎవరైనా ఏ కోర్సు అయినా చేసే వెసులుబాటు వస్తుంది. దీనిపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఐఐటీలు వర్క్‌షాపులు నిర్వహించాయి.

కొత్తగా 50 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 6,389 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 50 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 292 మంది ఐసొలేషన్‌లో చికిత్స పొందుతుండగా.. 39 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.

జూన్1న డీఈఈ సెట్

సాక్షి, హైదరాబాద్: డీఈడీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈ సెట్ -2023ను జూన్ 1న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఒకటి, రెండు రోజుల్లో జారీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 22 నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్నారు.

"కస్టమర్.. అంటే మీకు ప్రయాణికులు.. వారే దేవుళ్లు, జీతాలిచ్చే దేవుళ్లు"
"అప్పట్లో బస్సుల కోసం ప్రయాణికులు వేచి చూసే వారు. ఇప్పుడు ప్రయాణికుల కోసం బస్సులు వేచి చూస్తున్నాయి.
మళ్లీ పాత పద్ధతి రావాలి.. బస్సుల కోసం ప్రయాణికులు పరుగున వచ్చేలా చేయాలి"
"టికెట్ ఇవ్వడంతో నా పని ముగిసిందన్న భావనను దరి చేరనీయొద్దు.
ప్రయాణికులకు ఆర్టీసీపరంగా ఇంకా ఏదైనా సమాచారం కావాలేమో గుర్తించి తెలియచెప్పాలి"

....ఇవన్నీ బస్సుల్లో రాసి ఉండే సూక్తులు/ సూచనలు కాదు.. ఇప్పుడు ఆర్టీసీ కండక్టర్లకు నరనరానా జీర్ణింపజేసేందుకు సిద్ధం చేసిన మాటలు. ఈ మాటలు అధికారులు చెప్తే అంతతొందరగా ఎక్కవని, నిరంతరం ఖాతాదారులతో తలమునకలై ఉండే బ్యాంకు మేనేజర్లు, పాలసీదారులను వెతికి పట్టుకుని పాలసీలు చేయించే ఎల్ఐసీ మేనేజర్లతో చెప్పించబోతున్నారు. వెరసి కండక్టర్ తీరే మారేలా శిక్షణకు సిద్ధం చేస్తున్నారు.

సర్ అనండి.. సర్రున అల్లుకుపొండి..

- ప్రయాణికులను ఆకట్టుకునేందుకు కండక్టర్లకు కార్పొరేట్ పాఠాలు
- బ్యాంకులు, ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్లతో శిక్షణ.. ఆర్టీసీ వినూత్న ప్రయోగం
- ఇటీవలే ప్రమాదాల నివారణకు కార్పొరేట్ సంస్థతో డ్రైవర్లకు శిక్షణ ప్రారంభం
- అదే తరహాలో రేపటి నుంచి కండక్టర్లకూ తర్ఫీదు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతుండటంతో డ్రైవర్లకు ఓ కార్పొరేట్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తున్న ఆర్టీసీ ఇప్పుడు కండక్టర్లపై దృష్టి సారించింది. కొంతకాలంగా క్రమంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) పడిపోతోంది. దీంతో ఇటీవలి వరకు రోజుకు రూ.14 కోట్ల ఆదాయం ఉండగా, ఇప్పుడది రూ.11 కోట్లకు పడిపోయింది. ఈ నేపథ్యంలో.. బస్సులు మళ్లీ ప్రయాణికులతో కళకళలాడాలంటే వారిని ఆకట్టుకునేలా కండక్టర్ల ప్రవర్తన ఉండాలని ఆర్టీసీ ఓ నిశ్చితాభిప్రాయానికి వచ్చింది. ఇందుకోసం వారికి కార్పొరేట్ తరహాలో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించింది. అది శుక్రవారం ప్రారంభం కాబోతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణాంశాలను రూపొందించిన ఆర్టీసీ, శిక్షణలో ప్రత్యేక తరగతులు తీసుకునేందుకు బ్యాంక్, ఎల్ఐసీ మేనేజర్లను గుర్తించింది. ఒక్కో అధికారికి ఒక్కో క్లాస్‌కు రూ.500 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది.

బ్యాంకు, ఎల్ఐసీ మేనేజర్లతో..

వీలైనన్ని సీట్లు నిండేలా చూడండి అంటూ ఇంతకాలం డిపో అధికారులు గేట్ మీటింగ్స్ పెట్టి కండక్టర్లకు చెప్పేవారు. ఈ క్రమంలోనే బస్టాపుల వద్ద కండక్టర్లు కిందకు దిగి ఊళ్లపేర్లు అరుస్తూ ప్రయాణికులు బస్సు ఎక్కేలా చూస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ తరహా మోటివేషన్ సరిపోదని ఆర్టీసీ ఎండీ భావిస్తున్నారు. దీంతో కండక్టర్లకు కూడా కార్పొరేట్ తరహా శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో.. డ్రైవింగ్ నైపుణ్యం పెంచడంలో మేలైన శిక్షణ ఇస్తుందన్న పేరున్న చోలమండలం రిస్క్ సర్వీసెస్ అన్న సంస్థతో డ్రైవర్లకు శిక్షణ ఇప్పిస్తున్న విషయం తెలిసిందే.

సొంత శిక్షణ కాదని...

ఖాతాదారులు, వినియోగదారులను ఆకట్టుకోవాలంటే బ్యాంకులు, ఎల్ఐసీ సిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారు, తొలుత అయిష్టత చూపిన వారిని కూడా తమవైపు ఎలా తిప్పుకోవాలి, ఇందుకు ఆయా సంస్థలు అనుసరిస్తున్న పద్ధతులేంటి.. తదితర వివరాలను అన్వయిస్తూ ప్రయాణికులను ఎలా ఆకట్టుకోవాలనే కోణంలో ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆయా డిపోల్లోనే నిత్యం 30 మంది కండక్టర్లకు ఈ శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఓఆర్‌ను 75 శాతానికి చేర్చేందుకు చాలాకాలంగా ఆర్టీసీ యత్నించి విఫలమవుతోంది. దీంతో సొంత శిక్షణ బదులు కార్పొరేట్ స్టైల్‌ను అనుసరించాలని ఆర్టీసీ నిర్ణయించింది.



టీఎస్ఆర్టీసీలోని మొత్తం కండక్టర్లు:	ప్రస్తుతమున్న ఆక్యుపెన్సీ రేషియో	ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో లక్ష్యం
14,000	59%	75%

ఏం చెబుతారంటే...

మనల్ని ఎదుటివారు 'సర్/ మేడమ్' అని అంటే క్షణకాలంపాటు ప్రత్యేక అనుభూతి కలుగుతుంది. అందుకే 'సర్/ మేడమ్' అన్న పదంలో ప్రత్యేక మహత్తు ఉందంటారు మానసిక విశ్లేషకులు. ఇప్పుడు కండక్టర్లు కూడా ప్రయాణికులను సర్/మేడమ్ అంటూ సంబోధించాలని ఇందులో చెప్పనున్నారు.

టికెట్ల జారీ పూర్తయ్యాక ప్రయాణికులకు ఆర్టీసీ పరిస్థితి వివరిస్తూ, బస్సులు ఎలా సురక్షితం, పెరిగిన ఇంధన ధరలతో వ్యక్తిగత వాహనాల వినియోగం జేబుకు భారం లాంటి విషయాలు చెప్పాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ప్రయాణికులు, వారి సంబంధీకులకు అవగాహన కల్పించాలి.

మహిళలు, వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు.. ఇలాంటి వారి వద్ద ఎక్కువ లగేజీ ఉంటే.. ఎక్కేప్పుడు, దిగేప్పుడు సహకరించాలి.

ప్రయాణికులు ఆర్టీసీకి సంబంధించి ఇతర వివరాలు అడిగినా, తదుపరి గమ్యానికి ఏ బస్సెక్కాలి, ఎక్కడ దిగాలి, బస్సు పాస్‌లు, ఒకరోజు పాస్ లాంటి వివరాలు చెప్పాలి. సమాచారం తెలియనప్పుడు ఎవరితో మాట్లాడితే తెలుస్తుందో వారి ఫోన్ నంబర్లు ఇవ్వాలి. లేదా కనుక్కుని చెప్తానని ప్రయాణికుడి ఫోన్ నంబర్ తీసుకుని తర్వాత సమాచారమివ్వాలి.

ఆ పూట డ్యూటీతో తన బాధ్యత ముగిసిందనే భావనలోంచి బయటికొచ్చి కండక్టర్ డ్యూటీ కూడా 24/7 అన్న భావనలోకి రావాలి.

నువ్వు ఆఫ్టరాల్ మెంబర్‌వి.. నీది క్రిమినల్ మెంటాలిటీ

టీయూ వీసీ రవీందర్‌గుప్తా, ఉన్నతవిద్యా మండలి కమిషనర్ మిట్టల్ మాటల యుద్ధం



నవీన్ మిట్టల్



రవీందర్‌గుప్తా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి సమావేశంలో ఉన్నతవిద్యా మండలి కమిషనర్ నవీన్ మిట్టల్, టీయూ వీసీ రవీందర్ గుప్తా మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్టు తెలిసింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశం ప్రారంభంలో రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ..మీ నియామకానికి ఈసీ అనుమతి లేదంటూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధినిని బయటికి పంపించేయడంతో వివాదం మొదలైంది. ఇందుకు వీసీ రవీందర్ స్పందిస్తూ విద్యావర్ధినిని తాను రిజిస్ట్రార్‌గా నియమించానని, ఆమెను బయటకు వెళ్లగొడితే తనను అవమానించినట్లవుతుందన్నారు. దీంతో ఉన్నతవిద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ వీసీపై సీరియస్ అయ్యారు. మీకు పని చేతకాదు, రిజైన్ చేయండి, లేదంటే సెలవులో వెళ్లండంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని సమావేశంలో పాల్గొన్న కొందరు పాలక మండలి సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో చోటు చేసుకున్న పరిణామాలు సభ్యులు తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. నవీన్ మిట్టల్ చేసిన వ్యాఖ్యలపై వీసీ రవీందర్ స్పందిస్తూ తాను పాలక మండలి చైర్మన్‌నని, మీరు ఆఫ్టరాల్ మెంబరని అనడంతో.. కరుణ ఒక్కసారిగా వీసీ రవీందర్‌పై ఫైరయ్యారు. మీరు చైర్మన్ అయితే ఈసీ అనుమతి తీసుకోకుండా కోట్ల రూపాయలు ఖర్చు ఎలా చేశారని ప్రశ్నించారు. తాను వర్సిటీ అభివృద్ధి కోసం ఖర్చు చేశానని, తన ఇంట్లో కొనుగోళ్లకు కాదని వీసీ బదులిచ్చారు స్పందించిన నవీన్ మిట్టల్, మీదంతా ఫ్రాడ్ దందా, క్రిమినల్ మెంటాలిటీ అంటూ రవీందర్‌పై మండిపడ్డారు. దీంతో వీసీ రవీందర్.. తాను సమావేశం నుంచి వెళ్లిపోతాననగా, సంతోషంగా వెళ్లొచ్చు, రిజైన్ చేసి వెళితే ఇంకా సంతోషమని మిట్టల్ అన్నారు.

మంటలు కంటిన్యూ..

▶ మొదటి పేజీ తరువాయి

వడగాడ్పులు సైతం వీస్తాయని వివరించింది.

22 నుంచి కొన్నిరోజులు ఉపశమనం

ఈ నెల 22 నుంచి ఎండలు కాస్త తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. వాతావరణంలో నెలకొంటున్న పలు మార్పులే దీనికి కారణమంది. నాలుగైదు రోజుల పాటు ఉష్ణోగ్రతలు తగ్గిన తర్వాత మళ్లీ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. గురువారం వాయవ్య తెలంగాణ, శుక్రవారం తూర్పు తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపు లు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

అప్రమత్తంగా ఉండాలి..

ఓవైపు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. బయటికి వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేసింది. వీలైనంత వరకు మధ్యాహ్న సమయంలో ఇంట్లోనే ఉండాలని పేర్కొంది. ఇక బుధవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీలుగా నమోదైనట్టు తెలిపింది.

సాధారణం కంటే అధికంగా..

రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. ఖమ్మంలో సాధారణం కంటే ఏకంగా 3.2 డిగ్రీలు అధికంగా నమోదవడం గమనార్హం. నల్లగొండలో 2.4 డిగ్రీలు.. భద్రాచలం, మెదక్‌లలో 1.9 డిగ్రీలు, హన్మకొండలో 1.7 డిగ్రీలు, నిజామాబాద్, రామగుండంలలో 1.6 డిగ్రీల మేర అధికంగా నమోదైనట్టు తెలిపింది.

● పగటి ఉష్ణోగ్రతలకు తగినట్టుగా రాత్రి ఉష్ణోగ్రతలూ సాధారణంకంటే ఒకటి, రెండు డిగ్రీలు అధికంగా ఉంటున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. చాలాచోట్ల అర్ధరాత్రి దాటే వరకు కూడా ఉక్కపోత కొనసాగుతోందని వివరించింది. ● ఇక జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 44.5 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో 44.5 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 44.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు రాష్ట్ర ప్రణాళికా విభాగం తమ వెబ్‌సైట్లో తెలిపింది.

సమ్మెకి దిగితే చర్యలు తప్పవు

కార్మిక శాఖ జేసీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో సమ్మెలు నిర్వహించడం ఇకపై చట్ట విరుద్ధమని రాష్ట్ర కార్మికశాఖ జాయింట్ కమిషనర్ శ్యాంసుందర్ రెడ్డి ప్రకటించారు. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు 7శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ అమలు, ఇతర సదుపాయాల కల్పన విషయంలో బుధవారం విద్యుత్ ఉద్యోగ సంఘాలు, విద్యుత్ సంస్థల యాజమాన్యల మధ్య కార్మికశాఖ సమక్షంలో ఒప్పందం జరిగిందని ఓ ప్రకటనలో వెల్లడించారు. పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టంలోని సెక్షన్ 12(3) కింద ఈ ఒప్పందం జరిగిందని, ఈ నేపథ్యంలో సమ్మెలు చేపట్టడం చట్ట విరుద్ధం అవుతుందని, ఎవరైనా/ఏ సంఘమైనా నిబంధనలను ఉల్లంఘించి సమ్మెకి దిగితే పైన పేర్కొన్న చట్టంతో పాటు అత్యవసర సేవల నిర్వహణ చట్టం(ఎస్మా) కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ఈ నెల 25 నుంచి సమ్మెకి దిగుతామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూ నియన్ ప్రకటించిన నేపథ్యంలో తాజాగా కార్మిక శాఖ చేసిన ప్రకటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు సమస్యల పరిష్కారానికి అంగీకరించినందుకు సీఎంకు, అధికారులకు టీఈఈ 1104 యూనియన్ కృతజ్ఞతలు తెలిపింది.

ఈ ఏడాది పది లక్షల వీసాలు

▶ మొదటి పేజీ తరువాయి

వివరించారు. వీలైనంత ఎక్కువ సంఖ్యలో వీసాల జారీకి అధికారులతో ఓవర్‌టైమ్ చేయించేందుకూ ప్రయత్నిస్తున్నామని, ఇందుకు సంబంధించిన అనుమతులు లభించాయన్నారు. అలాగే వచ్చే వారం రెండు రోజులపాటు అదనపు వీసాల జారీకి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్

అమెరికాలో విద్యనభ్యసించే విద్యార్థులు తగిన కోర్సు, విద్యాసంస్థలను ఎంచుకునేందుకు అమెరికన్ కాన్సుల్ జనరల్ కార్యాలయం సహాయ సహకారాలు అందిస్తోందని పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ డేవిడ్ మోయర్ తెలిపారు. యూఎస్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ద్వారా ఉచిత కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. జూబ్లీహిల్స్‌లోని వై-యాక్సిస్ ఫౌండేషన్ కార్యాలయంలో ఎడ్యుకేషన్ యూ ఎస్ఏ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని, ఆసక్తి, అర్హతల ఆధారంగా అమెరికాలోని మొత్తం 4,500 విద్యాసంస్థల్లో తగిన దాన్ని ఎంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సమావేశంలో మేనేజ్‌మెంట్ ఆఫీసర్ ఆడ్రీ మోయర్, పొలిటికల్ ఎకనమిక్ సెక్షన్ చీఫ్ సీన్ రూథ్ పాల్గొన్నారు.

యూఎస్ కాన్సులేట్ అపాయింట్‌మెంట్ ఇలా..

నాన్ ఇమిగ్రెంట్ వీసా రకం	అపాయింట్‌మెంట్ వెయిట్ టైమ్
ఇంటర్వ్యూ అవసరమైన విద్యార్థులు / ఎక్స్ఛేంజ్ విజిటర్స్ (ఎఫ్, ఎం,జే)	45 రోజులు
ఇంటర్వ్యూ అవసరమైన పిటిషన్- బేస్ట్ టెంపరరీ వర్కర్స్ (హెచ్,ఎల్,వో,పీ, క్యూ)	136 రోజులు
ఇంటర్వ్యూ రిక్వైర్డ్ క్రూ/ ట్రాన్సిట్ (సీ, డీ, సీ1/డీ)	అదే రోజు
ఇంటర్వ్యూ అవసరమైన సందర్శకులు (బీ1/బీ2)	332 రోజులు
ఇంటర్వ్యూ మినహాయింపున్న విద్యార్థులు/ఎక్స్ఛేంజ్ విజిటర్స్ (ఎఫ్,ఎం,జే)	16 రోజులు
ఇంటర్వ్యూ మినహాయింపు పిటిషన్-బేస్ట్ టెంపరరీ వర్కర్స్(హెచ్, ఎల్, వో, పీ, క్యూ)	149 రోజులు
ఇంటర్వ్యూ వైవర్ క్రూ/ ట్రాన్సిట్ (సీ,డీ, సీ1/డీ)	అదే రోజు
ఇంటర్వ్యూ మినహాయింపున్న సందర్శకులు (బీ1/బీ2)	15 రోజులు

సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మిగులు నిధులున్న సంస్థ అప్పుల్లోకి ఎందుకెళ్లింది?
- రాజకీయ అవసరాలకోసం సింగరేణిని బలి చేస్తున్నారు
- సీఎం కేసీఆర్‌పై మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఈ 9 ఏళ్లలో సింగరేణిలో వచ్చిన మార్పులపై ముఖ్యమంత్రి కేసీఆర్ శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మిగులు నిధులున్న సింగరేణిని.. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల్లోకి నెట్టిందని ఆయన ఆరోపించారు. సింగరేణి వ్యవస్థను అస్తవ్యస్తం చేసి, ఇప్పుడు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పెట్టుబడులు పెడతామంటూ ఏపీ ప్రజలను కూడా మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. సింగరేణి కార్మికుల శ్రమ, కష్టార్జితాన్ని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఎందుకు తాకట్టు పెట్టాలనుకుంటున్నారో తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ వివరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

టర్నోవర్ పెరిగినా లాభాలెందుకు లేవు?

ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుంట్ల కుటుంబం జోక్యంతో సింగరేణిలో అంతర్గత ప్రైవేటీకరణ, ఉద్యోగాల తగ్గింపు, ఆర్థిక పతనం, భద్రతాపరమైన లోపాలతో మొత్తం వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. తెలంగాణ ఏర్పడినపుడు రూ.3,500 కోట్ల మిగులు నిధులు ఉన్న సింగరేణి.. 2023 జనవరి వరకు రూ. 10 వేల కోట్ల అప్పుల్లోకి కూరుకుపోవడానికి కారణాలేంటని తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి టర్నోవర్ పెరుగుతున్నా లాభాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. అప్పులు చేయకుండా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి సింగరేణిని తెచ్చారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

రాజకీయ జోక్యం వల్లే సమస్యలు

సింగరేణి కన్నా 10 రెట్లు పెద్దదైన కోల్ ఇండియా లిమిటెడ్‌కు ప్రస్తుతం రూ.12వేల కోట్ల అప్పులుంటే.. సింగరేణికి రూ.10వేల కోట్లు అప్పులుండటమేంటని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. రాజకీయ జోక్యం పెరగడం వల్లే సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులకు ప్రొటోకాల్ కోసం ఏకంగా సర్క్యులర్ జారీ చేశారని మండిపడ్డారు. సింగరేణిని పతనావస్థకు తీసుకెళ్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఈ సంస్థను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందంటూ కేంద్రంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.

లాభాల్లో ఉన్న సింగరేణిపై తప్పుడు ప్రచారమా?

- రూ. 2వేల కోట్లకు పైగా నికర లాభాలు
- సింగరేణి డిపాజిట్లు రూ.11,665 కోట్లు
- వడ్డీల రూపంలో ప్రతి ఏటా రూ.750 కోట్ల రాబడి
- కేంద్ర మంత్రి ఆరోపణలపై యాజమాన్యం అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్/గోదావరిఖని: బొగ్గు, థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాల్లో గణనీయ వృద్ధి రేటుతో రూ.32వేల కోట్ల వార్షిక టర్నోవర్, బ్యాంకులు, ఎల్ఐసీ వద్ద డిపాజిట్లు, బాండ్ల రూపంలో రూ.11,665 కోట్లు, ఏటా రూ.750 కోట్లకు పైగా వడ్డీ రాబడులతో సింగరేణి బొగ్గు గనుల సంస్థ పూర్తి ఆర్థిక పరిపుష్టి కలిగి ఉందని సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. వినియోగదారుల నుంచి రావాల్సి ఉన్న రూ. 15,500 వేల కోట్ల బకాయిలు కలిపితే రూ.27వేల కోట్లకు పైగా ఆర్థిక పరిపుష్టిని సంస్థ కలిగి ఉంటుందని వెల్లడించింది. అలాంటి సంస్థ అప్పుల పాలైందని, రూ. 12 వేల కోట్లకు పైగా అప్పులు ఉన్నాయని దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమని పేర్కొంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం సింగరేణి సంస్థపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ ఆయన పేరును ప్రస్తావించకుండానే ఓ ప్రకటన విడుదల చేసింది. బొగ్గు ఉత్పత్తిలోనూ, సంక్షేమంలోనూ అత్యుత్తమ ప్రభుత్వ సంస్థల్లో ఒకటిగా వెలుగొందుతున్న సింగరేణి పేరు ప్రతిష్టలను కించపరుస్తూ కొందరు అవాస్తవ, నిరాధార నిందారోపణలు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేసింది. సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు చేసిన రూ.472 కోట్ల అప్పులను ఇప్పటికే తీర్చివేయగా, థర్మల్ విద్యుత్ కేంద్రం కోసం చేసిన రూ.5,300 కోట్ల అప్పులో ఇంకా రూ.2800 కోట్లు మాత్రమే చెల్లించవలసి ఉందని తెలిపింది. సింగరేణి కేవలం రూ.2800 కోట్ల అప్పులు మాత్రమే కలిగి ఉందని పేర్కొంది. రూ.12 వేల కోట్ల అప్పులున్నాయనడం అవాస్తవమని, జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొంది.

మాతృభాషలోనే 'ఉన్నత విద్య' బోధన

తక్షణమే కార్యాచరణ.. వర్సిటీలు, మండళ్లకు యూజీసీ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా సంస్థల్లో మాతృభాషలో బోధనకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీశ్ కుమార్ ఉన్నత విద్య మండళ్ళు, యూనివర్సిటీలను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ లేఖ రాశారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా స్థానిక భాషల్లో బోధన, పరీక్షల విధానం అత్యంత కీలకమైందిగా పేర్కొన్నారు. దీనివల్ల ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలు ఉన్నత విద్యలో మరింత రాణిస్తారని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యలో ఇప్పుడున్న 27 శాతం ప్రవేశాల నిష్పత్తిని 2035 నాటికి 50 శాతానికి తీసుకెళ్ళడం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉన్నత విద్య సంస్థలు కీలకమైన పాత్ర పోషించాలని సూచించారు. మాతృభాషలో పుస్తకాల తయారీ, బోధనకు అవసరమైన ఫ్యాకల్టీ సమకూర్చుకోవాల్సిన పరిస్థితిని గుర్తు చేశారు. అన్ని యూనివర్సిటీలు పరీక్షల్లో విద్యార్థులు తెలుగులో రాసేందుకు అనుమతించాలని యూజీసీ చైర్మన్ కోరారు. ఈ నేపథ్యంలో మాతృభాషలో బోధనకు గల అవకాశాలపై సమగ్ర వివరాలను ఆన్‌లైన్ ద్వారా పంపాలని వర్సిటీలను, ఉన్నత విద్యా మండళ్ళను కోరారు.

ఈ వివరాలు పంపండి...

ఉన్నత విద్యలో విభాగాల వారీగా పుస్తకాలు, రిఫరెన్స్ బుక్స్, స్టడీ మెటీరియల్ స్థానిక భాషలో ఏమేర అందుబాటులో ఉన్నాయో తెలపాలి. ఇతర భాషల్లో ఉన్న పుస్తకాల తర్జుమాకు గల అవకాశాలను వివరించాలి. స్థానిక భాషలో బోధించేందుకు బోధకులు ఏమేర అందుబాటులో ఉన్నారు. సబ్జెక్ట్ నిపుణులు, స్కాలర్స్ స్థానిక భాషల్లో తర్జుమా చేసేవాళ్ళు ఏమేర ఉన్నారు. స్థానిక భాషల్లో పుస్తకాల ముద్రణకు గల అవకాశాలు, ప్రింటింగ్, పబ్లిషర్ల వివరాలు తెలపాలి. స్థానిక భాషల్లో విద్యార్థులు ఏమేర పరీక్షలు రాయగలరో వివరించాలి"అని కోరారు.

డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ సోదాలు

- మైత్రి మూవీ మేకర్స్ ఆఫీసుల్లోనూ కొనసాగిన తనిఖీలు
- విదేశాల నుంచి నిధుల మళ్లింపు, జీఎస్టీ చెల్లింపుల్లో అవకతవకలపై ఆరా



సాక్షి, హైదరాబాద్: టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ ఇల్లు, మైత్రి మూవీస్ కార్యాలయాల్లో ఆదాయపన్నుశాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఇటీవల విడుదలైన కొన్ని భారీ చిత్రాల నిర్మాణానికి విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా తీసుకోవడం, వాటికి సంబంధించి పన్నుల చెల్లింపుల్లో అవకతవకలపై ఐటీ అధికారులు ఈ సోదాలు చేపట్టినట్టు తెలిసింది. సదరు చిత్ర నిర్మాణ సంస్థ భారీ చిత్రాల నిర్మాణానికి అవసరమైన డబ్బులను విదేశాల నుంచి పెద్ద మొత్తంలో సేకరించిందని, ఈ సొమ్ము రూ.500 కోట్లకుపైగా ఉండడంతో ఐటీ అధికారులు ఫోకస్ పెట్టినట్టు తెలిసింది.

జీఎస్టీ చెల్లింపుల్లోనూ అవకతవకలు: ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి డబ్బులు పెట్టుబడుల రూపంలో సేకరించడంతో పాటు, జీఎస్టీ చెల్లింపులలోనూ అవకతవకలు ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు. మైత్రి మూవీస్, డైరెక్టర్ సుకుమార్‌ల కాంబినేషన్‌లోనే పుష్ప–2 సినిమా తెరకెక్కుతోంది. ఈ క్రమంలోనే ఐటీ అధికారుల బృందాలు సుకుమార్ ఇల్లు, మైత్రి కార్యాలయాల్లో సోదాలు జరిపి పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. మైత్రీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి చిత్రాలు జనవరిలో విడుదలకు ముందు సమయంలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన సంగతి విదితమే. ఇప్పుడు మరోసారి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని మైత్రీ మూవీస్ సంస్థ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. స్వాధీనం చేసుకున్న పత్రాలు, డాక్యుమెంట్స్ ఆధారంగా గురువారం విచారణ కోసం కార్యాలయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం.

మారుమూల ప్రాంతాలకు డిజిటల్ సేవలందాలి

- జీ–20 'డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూపు'ప్రతినిధుల చర్చ
- ముగిసిన మూడు రోజుల సమావేశాలు



సదస్సులో పాల్గొన్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: జీ–20 సదస్సులో భాగంగా నగరంలోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్'రెండో విడత సమావేశాలు బుధవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో జీ–20 సభ్య దేశాలు, 8 అతిథి దేశాలు, 5 అంతర్జాతీయ సంస్థలు, ఒక ప్రాంతీయ సంస్థ నుంచి మొత్తం 81 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. డిజిటల్ నైపుణ్యాలు, డిజిటల్ పౌర మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక రంగంలో సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. మొదటిరోజు మొబైల్ బ్రాడ్‌బ్యాండ్, దాని ప్రభావాలపై సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రతినిధులు ఐఐటీ–హైదరాబాద్‌ను సందర్శించి 5జీ ఉత్పత్తులు, 5జీ బేస్ స్టేషన్లు, 6జీ సిస్టమ్ ప్రోటోటైప్‌లు, అటానమస్ నావిగేషన్ టెస్ట్ బెడ్, ఏఐ–ఆధారిత ఆర్ఎన్ఏ ఎలక్ట్రానిక్ టెస్ట్ కిట్స్ వంటి భారతదేశపు డిజిటల్ టెలికాం, టెక్నాలజీ రంగ ఆవిష్కరణలు, నవ్య పంథాను పరిశీలించారు. రెండో రోజు సదస్సులో డిజిటల్ నైపుణ్యాలపై పరస్పర సహకారం గురించి ప్రభుత్వ, పరిశ్రమ, విద్యారంగ నిపుణులతో చర్చాగోష్ఠి జరిపారు. డిజిటల్ పౌర మౌలిక సదుపాయాలు, డిజిటల్ ఆర్థిక రంగంలో సైబర్ సెక్యూరిటీ అంశాలపై మూడో రోజున చర్చించారు. మారుమూల ప్రాంతాలకు డిజిటల్ సేవలు, నైపుణ్యాల చేరవేత, ఆరోగ్య రంగంలో డిజిటల్ టెక్నాలజీ పాత్రపైనా చర్చించారు. మూడో విడత సమావేశాలు జూన్‌లో పుణేలో నిర్వహించాలని నిర్ణయించారు.

క్లుప్తంగా...

మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనమండలి అర్జీలు, ప్రివిలేజ్ కమిటీల చైర్మన్‌గా మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ నియమితుల య్యారు. ఆయన అధ్యక్షతన శాసనమండలి కమిటీ హాల్లో అర్జీలు, ప్రివిలేజ్ కమిటీ సమావే శాలు బుధవారం వేర్వేరుగా జరిగాయి. ఈ సమావేశాల్లో మండల చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని కమిటీల నూతన చైర్మన్, సభ్యు లను అభినందించారు. మండలి సమావేశాల సందర్భంగా ప్రస్తావనకు రాని సమస్యలను సభ్యులు అర్జీల కమిటీకి సమర్పిస్తారని, ఈ అర్జీలపై అధికారులతో చర్చించి ప్రజలకు మేలు కలిగేలా చూడాలని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మండలి సభ్యులకు కొన్ని విశే షమైన అధికారాలు, హక్కులు రాజ్యాంగం లోని ఆర్టికల్ 194 ప్రకారం లభించాయని, హక్కులకు భంగం కలిగితే వాటిని పరిశీలించి చర్యలు తీసుకునే విశేషాధికారాలు ప్రివిలేజ్ కమిటీకి ఉంటాయని తెలిపారు. సభ్యుల విశే షాధికారాలకు ఏమైనా భంగం కలిగితే కమిటీ లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా చర్యలు తీసుకునే అధికారం ప్రివిలేజ్ కమిటీకి ఉంటుందని సుఖేందర్ రెడ్డి చెప్పారు. సమావేశంలో డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, సిరికొండ మధుసూదనాచారి, శేరి సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, కసిరెడ్డి నారా యణ రెడ్డి, తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు పాల్గొన్నా రు.

పటిష్టమైన పునాదులతో ఉద్యమిద్దాం..: చాడ



సిద్దిపేట జోన్: ప్రతిపక్ష పార్టీలు లేని ప్రజాస్వామ్యాన్ని తయారు చేసే దిశగా మోదీ సర్కారు చేస్తున్న ప్రయత్నా లను కట్టడి చేసేందుకు ఒక పటిష్టమైన పునా దుల మీద వామపక్షాలు, ప్రగతిశీల పార్టీలతో కలసి ఉద్యమిద్దామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పిలుపుని చ్చారు. పల్లె పల్లెకు సీపీఐ పేరిట చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర బుధవారం రాత్రి సిద్దిపే టకు చేరింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... సంఘ్ పరివార్ చేతిలో మోదీ సర్కారు కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, అందుకు వామపక్షాలు ప్రగతి శీల పార్టీలు, వ్యక్తులు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. బీఆర్‌ఎస్‌తో కలిసి సీపీఐ బీజేపీకి వ్యతిరేకంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. సమన్వయంతో కలిసి ముందుకు సాగు దామని బీఆర్‌ఎస్ అధిష్టానానికి సూచించారు.

'నిరాహార దీక్ష'కు అనుమతించండి

హైకోర్టులో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిటిషన్



సాక్షి, హైదరాబాద్: 'అఖిల పక్ష నిరాహార దీక్ష'కు అనుమతించా లంటూ వైఎస్సార్ టీపీ అధినేత వైఎస్ షర్మిల హైకోర్టును ఆశ్రయించారు. 'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా నగరంలోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 17న దీక్ష నిర్వహించ తలపెట్టాం . అనుమతికోసం ఈ నెల 11న పోలీసులకు దరఖాస్తు చేశాం. అనుమతి నిరాకరిస్తూ హైద రాబాద్ అడిషనల్ కమిషనర్ 15న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో దీక్ష ఆగిపోయింది. లక్షలాది మంది తరఫున, శాంతియుతంగా చేయాలనుకున్న ఈ దీక్షకు పోలీసులు అనుమ తించేలా ఆదేశాలు జారీ చేయండి'అని ఆమె పిటిషన్ వేశారు. మరోరోజు దీక్ష నిర్వహి స్తామని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో విచారణ జరగనుంది.

ప్రీతి హత్య కేసు నిందితుడు సైఫ్‌కి బెయిల్ మంజూరు

వరంగల్ లీగల్: కాకతీయ వైద్య కళాశాల పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి హత్య కేసులో నిందితు డు సీనియర్ విద్యార్థి డాక్టర్ సైఫ్‌కి ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి సత్యేంద్ర షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. 60 రోజుల జ్యూడీ షియల్ రిమాండ్ బుధవారం నాటికి 58 రోజులు అవుతున్న సందర్భంగా నిందితుడి తరఫు న్యాయవాదులు కోర్టు ఎదుట వాద నలు విన్పించారు. వాదనల అనంతరం కోర్టు సైఫ్‌కి బెయిల్ మంజూరు చేసింది. అయితే చార్జి షీట్ దాఖలు చేసేనాటికి లేదా 16 వారాల వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య సంబంధిత విచా రణ అధికారి ఎదుట హాజరుకావాలని షరతు విధించింది. వ్యక్తిగతంగా రూ.10 వేల బాండ్, ఇద్దరు జమానత్‌దారుల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సాక్షులపై కానీ, మృతురాలి కుటుంబ సభ్యులపై కానీ ఎలాంటి బెదిరింపులకు పాల్పడకూడదని, నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో ప్రాసిక్యూషన్ వారికి బెయిల్ రద్దు కోరే అవ కాశం ఇస్తూ కోర్టు ఆదేశించింది.

ఇంకా ఆలస్యమే..!

తీరని ధరణి పోర్టల్ కష్టాలు

- ఒక్క ఎస్‌పీఏ ఆప్షన్ మాత్రమే కొత్తగా అందుబాటులోకి..
- పేరు మార్పు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గుల సమస్యలు యథాతథం
- మాడ్యూల్స్ రూపకల్పనలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలే కారణం
- ఒకట్రెండు రోజుల్లో అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయంటున్న సీసీఎల్‌ఏ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ కష్టాలు తీరడం లేదు. ఈ పోర్టల్ ద్వారా ఎదురవు తున్న సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎ ల్‌ఏ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్‌మి త్తల్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముఖ్య సమస్యల పరిష్కారానికి ఉపక్రమించినప్ప టికీ, ఈ క్రమంలో వస్తున్న తీవ్ర సాంకేతిక సమస్యలు అడుగు ముందుకు పడనీయడం లేదని సమాచారం. ఈ కారణంగానే విస్తీర్ణం, పేరు మార్పు లాంటి సమస్యల పరిష్కారం ఆలస్యమవుతోంది. ధరణి పోర్టల్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న 10 సమస్యలకు సంబంధించిన మార్పులు జరి గినప్పటికీ, సాంకేతిక అవరోధాల కారణం గా బుధవారం నాటికి స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ (ఎస్‌పీఏ) ఆప్షన్ మాత్రమే అందు బాటులోకి వచ్చిందని రెవెన్యూ వర్గాల ద్వారా తెలుస్తోంది. విదేశాల్లో ఉంటున్న పట్టాదారులు తమ భూమి విక్రయానికి గాను ఇక్కడకు రావాల్సిన అవసరం లేకుం డా, తాము ఉంటున్న దేశం నుంచే అధీకృత డాక్యుమెంట్ పంపి ఇక్కడ రిజిస్ట్రేషన్ చేసేం దుకు వీలుగా ఉన్న ఈ ఆప్షన్ మాత్రమే అం దుబాటులోకి వచ్చింది. మిగిలిన సమస్యలు కూడా దాదాపు పూర్తయినట్టేనని, ఒకట్రెం డు రోజుల్లో అన్నీ అందుబాటులోకి వస్తా యని సీసీఎల్‌ఏ వర్గాలు చెపుతున్నాయి.

వేలసంఖ్యలో పెండింగ్‌లో టీఎం 33 దరఖాస్తులు

ధరణి పోర్టల్‌లోకి రైతుల వివరాల నమోదు సమయంలో వచ్చిన చిక్కులను తొలగిం చేందుకు గాను టీఎం (టెక్నికల్ మాడ్యూల్) 33 కింద దరఖాస్తులు తీసుకుంటున్నారు. పట్టాదారు పేరు, భూమి విస్తీర్ణం, స్వభా వం, మిస్సింగ్ సర్వే నంబర్ల లాంటి సమ స్యల సవరణ కోసం ఈ మాడ్యూల్‌ను అం దుబాటులోకి తీసుకువచ్చారు. పట్టాదారు బయోమెట్రిక్‌తో మీసేవా కేంద్రం ద్వారా తగిన ఆధారాలు పొందుపరిచి ఈ మాడ్యూ ల్ కింద రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సదరు దరఖాస్తులను జిల్లా కలె క్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ఈ క్రమంలోనే తీవ్ర జాప్యం జరుగుతుండడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ మాడ్యూల్ కింద దరఖాస్తు చేసుకున్న వారి సమస్యల పరిష్కారంలో రాజకీయ జోక్యం కూడా ఎక్కువగా ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ కారణంగానే స్థానిక అధి కారులు (తహసీల్దార్లు) నిష్పక్షపాతంగా నివేదికలు పంపడం లేదని, ఈ నివేదికల



ఆధారంగా కలెక్టర్లు దరఖాస్తులను తిరస్క రిస్తున్నారని తెలుస్తోంది. ఒకవేళ కలెక్టర్లు ఆమోదించినా సీసీఎల్‌ఏ కార్యాలయంలో క్లియర్ చేయాల్సి ఉండడం కూడా జాప్యా నికి కారణమవుతోంది. ఈ దరఖాస్తుల పరి ష్కారానికి సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా, ఇంకా వేల సంఖ్యలో దరఖాస్తులు సీసీఎల్‌ఏ కార్యాలయ స్థాయి లో పెండింగ్‌లో ఉండడం గమనార్హం. తహ సీల్దార్లు, జిల్లాల కలెక్టర్లు నివేదికలు పంపేం దుకే నెలలు గడుస్తోందని, ఆ తర్వాత సీసీ ఎల్‌ఏ కార్యాలయానికి వెళ్లిందీ లేనిదీ తెలి యడం లేదని, ఒకవేళ సీసీఎల్‌ఏ కార్యాల యానికి వెళ్లినా తదుపరి సమా చారం కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోం దని రైతులు వాపోతున్నారు. టీఎం–33 దరఖాస్తులను వీలున్నంత త్వరగా పరిష్క రించాలని, తమ దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ

- పనులు వేగంగా చేయాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం
- పనుల పురోగతిపై ఆయా అధికారులతో సమీక్ష



మంత్రి హరీశ్‌రావుకు ఆస్పత్రి నిర్మాణ వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆర్‌అం డ్‌బీ అధికారులను ఆదేశించారు. దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసు కోవాలని చెప్పారు. గ్రేటర్ పరిధితో పాటు, నగర శివారు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత చేరువ చేసే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న సనత్‌నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతి, ఇతర అంశాలపై మంత్రి హరీ శ్‌రావు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఒక వైపు వైద్యం, మరోవైపు వైద్యవిద్యను విస్తృతం చేస్తు న్నట్లు చెప్పా రు. వరంగల్ మల్టీ స్పెషా లిటీ ఆసుపత్రి పూర్తయితే మెడికల్ హబ్ గా మారుతుందన్నారు. ఇందులో అత్యా ధునిక వైద్య పరికరాలు సమకూర్చు తున్నట్లు చెప్పారు. అత్యాధునిక మాడ్యు లర్ థియేటర్లు, ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే అవకాశాలు లేకుండా ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ తరహాలో టిమ్స్ సేవలు ఉండాలన్నది సీఎం కేసీఆర్ సంక ల్పమని చెప్పారు. ఒక్కొక్కటి వెయ్యి పడ కలతో ఉన్న ఈ ఆసుపత్రులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలని, 8 బోధనాస్పత్రుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రారంభం కానున్న 9 వైద్య కాలేజీల డిజైన్లు రూపొందించాలని చెప్పారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ నిర్మాణాలకు వైద్య ఆరోగ్య శాఖ తరఫున అన్ని చర్యలు పూర్తి చేసినట్లు తెలిపారు. కాబట్టి ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు వేగవంతం చేయా లని, భవిష్యత్ అవస రాలకు అనుగుణంగా విస్తరించుకునే విధంగా నిర్మాణాలు ఉండాలని సూచిం చారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సం క్షేమ కమిషనర్ శ్వేత మహంతి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైద్య విధాన పరి షత్ కమిషనర్ అజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ గంగాధర్, ఆరోగ్యశ్రీ సీఈవో విశా లాక్షి, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ సీఈ రాజేందర్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఈహెచ్‌ఎస్ విధానం వేగవంతం: హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అం దిస్తున్న నగదు రహిత ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)పై ఉద్యో గులు, టీచర్ల సంఘాల ప్రతినిధులతో చర్చించి, పది రోజుల్లో నివేదిక రూపొం దించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఆరోగ్యశ్రీ అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఉద్యోగ ఉపాధ్యాయ సం ఘాల వినతి మేరకు కొత్త ఈహెచ్‌ఎస్ విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకువస్తామని అసెంబ్లీలో ప్రకటిం చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జరిగిన సమీక్షలో ఆ దిశగా చర్యలు వేగ వంతం చేయాలని హరీశ్ రావు ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాక్షిని ఆదేశిం చారు. ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యేలా కృషి చేయాలని, అందుతున్న సేవల గురించి స్వయంగా వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. వారానికి మూడు ఆసుప త్రులు సందర్శించాలని ఆదేశించారు. కాగా ఆరు వైద్య కళాశాలలకు అనుమ తులు రావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

...జీవిత పన్ను

▶ మొదటి పేజీ తరువాయి

విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చట్టం అమలుకు వీలుగా ప్రభుత్వం గెజిట్ విడుదల చేసి, అమలు ప్రారంభించింది.

మార్చిలో కొన్నా.. ఏప్రిల్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే కొత్త విధానమే..

చట్ట సవరణ నేపథ్యంలో అమలుపై రవాణాశాఖ స్పష్టతనిచ్చింది. కారు ఏప్రిల్‌కు ముందు కొన్నా, రిజిస్ట్రేషన్ ఇప్పుడు జరిగితే, కొత్త విధానమే వర్తి స్తుందని స్పష్టం చేసింది. గత నెలలో కార్లు కొన్న వాళ్లు చాలామంది ఇంకా రిజిస్ట్రేషన్ చేయించుకో లేదు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముం దే కారు కొన్నందున తమకు కొత్త విధానం వర్తించ దన్న ధీమాతో ఉన్నారు. కానీ, కారు ఎప్పుడు కొన్నా.. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకుంటే కొత్త విధా నమే వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

పెరగనున్న పన్ను..

ధర ఎక్కువ కార్లపైనే ఈ కొత్త విధానం ప్రభావం ఉండనుంది. కారు కొన్నప్పుడు ఎక్స్‌షోరూం ధర పైన షోరూం నిర్వాహకులు డిస్కౌంట్ ఇవ్వటం సహజమే. ధర ఎక్కువగా ఉండే కార్లపై ఈ మొత్తం ఎక్కువగా ఉంటుంది. ఈ డిస్కౌంట్‌ను సాకుగా చూపి కొంతమేర పన్ను ఎగవేస్తున్నారు. ఇప్పుడు దానికి అవకాశం లేదు. రూ.5 లక్షల ధర ఉన్న కార్ల పై 13%, రూ.5 లక్షలు దాటి రూ.10 లక్షల లోపు ఉండే కార్లపై 14%, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉండే కార్లపై 17%, రూ.20 లక్షలకం టే ఎక్కువ ధర ఉండే కార్లపై 18% చొప్పున జీవిత పన్నును సవరిస్తూ గతేడాది ఉత్తర్వు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా సవరణ ప్రకారం.. డిస్కౌంట్ మొత్తం మినహాయించక ముందు ఉండే ఎక్స్‌షోరూం ధరలపై పైన పేర్కొన్న నిర్ధారిత శాతంలో పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తుల పేరు మీద కాకుండా సంస్థలు, కంపెనీల పేరుతో ఉండే కార్లపై అదనంగా 2%, రెండో కారు తీసుకు నేవారు అదనంగా 2% చెల్లించాల్సి ఉంటుంది.

ఎంసెట్‌కు 'వెయిటేజ్' ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్‌కు ఇంటర్ మార్కుల వెయిటేజ్‌ను ఎత్తివేశారు. ఇంజ నీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి ఇక ఎంసెట్‌లో పొందే మార్కుల ఆధారంగానే ర్యాంకు ఇస్తారు. విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. కోవిడ్ నేపథ్యంలో ఇంటర్మీడియేట్ పరీ క్షలు సరిగా నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. గతేడాది వరకూ 70% సిల బస్‌ను అమలు చేశారు. దీంతో ఇంటర్ మార్కుల వెయిటేజీ లేకుండానే ఎంసెట్ ర్యాంకులు ఇచ్చారు. కార్పొరేట్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఇంటర్ మార్కులు ఎక్కువ రావడం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు అనేక కారణాల వల్ల తక్కువ మార్కులు వస్తుండటంతో ఎంసెట్ ర్యాంకుల్లో గ్రామీణ విద్యార్థులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. వీటన్నింటినీ సమీక్షించిన విద్యాశాఖ ఇంటర్ మార్కుల వెయి టేజీని ఎత్తివేసింది.

లండన్‌లో హైదరాబాద్ యువతి మృతి



సాయి తేజస్వి (ఫైల్)

సైదాబాద్: ఫస్ట్ టర్మ్ అయిపోయింది.. సెలవు తీసుకుని ఇంటికొస్తానని చెప్పిన ఆ యువతి శాశ్వతం గా సెలవు తీసుకుంది. హైదరాబాద్ యువతి సాయి తేజస్వి కొమ్మారెడ్డి (24) లండన్‌లో దుర్మరణం చెందింది. ఒక్కగానొక్క బిడ్డ మృతి చెందడం, మృతదేహం రావడానికి సమయం పడుతుండటంతో నగరంలోని ఆమె కుటుంబం కన్నీరుమున్నీరవుతోం ది. యాదాద్రి జిల్లా మోటకొండూరుకు చెందిన కొమ్మారెడ్డి శశిధర్ రెడ్డి, జ్యోతి దంపతులు ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాల నీలో ఉంటున్నారు. వీరి కుమార్తె తేజస్వి సైదాబాద్‌లో ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) పూర్తి చేశారు. లండన్‌లోని క్రాన్ ఫీల్డ్ యూనివర్సిటీలో మాస్టర్స్ చేయడానికి గతే డాది సెప్టెంబర్‌లో వెళ్లారు. ఈ నెల 11న తన స్నేహితులతో కలిసి అక్కడి బ్రైటన్ బీచ్‌లో విహారయాత్రకు వెళ్లి సముద్రంలో కొట్టుకుపోయారు. వెంట ఉన్న సహ విద్యార్థులు ఎమర్జెన్సీ రెస్పాన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడి బలగాలు గాలించి తేజస్వి మృతదేహాన్ని గుర్తించి ససెక్స్ కౌంటీ హాస్పిటల్‌కు తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విషయంపై కేటీ ఆర్‌కు ట్వీట్ చేసిన తేజస్వి బంధువులు మృతదేహం ఇక్కడకు తరలించడానికి సహకరించాలని కోరారు. బుధవారం మృతురాలి ఇంటికి వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు. మృతదేహం శుక్రవారం నాటికి నగరానికి చేరుకుంటుందని ఆమె కుటుంబీకులకు సమాచారం అందింది. ''చనిపోవడానికి ముందు రోజు తేజస్వి తల్లిదండ్రులతో వీడియోకాల్‌లో మాట్లాడింది. ఫస్ట్ టర్మ్ పూర్తయిన విషయం చెప్పింది. వీలుంటే వారం లేదా పది రోజులు సెలవు తీసుకుని రమ్మని వాళ్లు చెప్పారు. ఆరేడు నెలల్లో గ్రాడ్యుయేషన్ కూడా ఉండటం తోసెర్మనీకి వెళ్లడానికి తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈలోపు ఇలా జరిగింది''అని తేజస్వి బంధువులు తెలిపారు.

'దత్తత దరఖాస్తులు రెండు వేలు'

సాక్షి, హైదరాబాద్: పిల్లల దత్తత కోసం ఇప్పటివరకు రాష్ట్ర పరిధిలో రెండు వేల దరఖాస్తులు వచ్చాయని రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మం త్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. కానీ ప్రస్తుతం దత్తత ఇచ్చేందుకు అర్హత ఉన్న పిల్లలు 38 మంది మాత్రమే ఉన్నారని, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు మరో వం ద మంది కూడా ఉన్నట్లు వివరించారు. దరఖాస్తుదారుల సీనియారిటీ, అర్హతల ఆధారంగా దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దత్తత హెల్ప్ డెస్క్‌ను బుధవారం మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ వచ్చిన ఫోన్ కాల్‌ను మంత్రి మాట్లాడి దత్తత వివరాలను తెలియజేశారు. తెలంగాణలో దత్తత తీసుకోవాలనుకునే తల్లిదండ్రులు 040–23748663 / 040–23748664 నంబ ర్లకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని మంత్రి తెలిపారు.

బీజేపీని ఓడించగలిగితే కాంగ్రెస్‌తో సర్దుబాటు

▶ మొదటి పేజీ తరువాయి

తగ్గట్టుగా సీట్లు కోరతామని అన్నారు. తాము కోరుకున్నట్టుగా బీఆర్‌ఎస్ సీట్లు ఇవ్వకపోతే విడిగానే పోటీ చేస్తామని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం ఎంబీ భవన్ లో పొలిట్ బ్యూరో సభ్యులు ఎ.విజయ రాఘవన్, బీవీ రాఘవులు, నాయకులు చెరుపల్లి సీతారాము లు, జూలకంటి రంగారెడ్డిలతో కలిసి తమ్మినేని విలేకరులతో మాట్లాడారు.

స్నేహంగా ఉంటాం..సమస్యలపై పోరాడతాం

బీజేపీని వ్యతిరేకిస్తున్న బీఆర్‌ఎస్‌తో రాజకీయంగా స్నేహంగా ఉంటామని తమ్మినేని వీరభద్రం చెప్పా రు. అదే సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ తప్పులను విమర్శిస్తామని, ఒప్పును సమర్థిస్తామని చెప్పారు. బీజేపీని ఎదు ర్కోవడం అంత సులువు కాదని, అందుకే కేసీఆర్‌ను సమర్థిస్తున్నామని వివరించారు. బీజేపీ వ్యతిరేక పోరాటాన్ని బలపర్చేందుకే బీఆర్‌ఎస్‌తో సాను కూలంగా ఉన్నామని, బీజేపీని ఎదుర్కోవడమే తమ లక్ష్యమన్నారు. అఖిలపక్షం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు చేసే ఆందోళనల్లో తాము పాల్గొనబోమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదిం చాలని తాము కోరుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వం దృ ష్టికి తీసుకెళ్తామని, వారంలో సీఎం కేసీఆర్‌తో భేటీ అవుతామని తమ్మినేని చెప్పారు. జూన్‌లో సంతకాల సేకరణ, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, నిరస నలు చేపడతామన్నారు. ప్రజాసంఘాల పోరాట కమిటీ ఉద్యమ కార్యాచరణకు మద్దతు ఇస్తున్నా మని, తాము కూడా పాల్గొంటామని తెలిపారు.

బీజేపీ ఎజెండా ప్రమాదకరం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాద కరమని విజయరాఘవన్, రాఘవులు విమర్శిం చారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చినా దానిపై పార్లమెంటులో చర్చ జరగలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజా స్వామిక హక్కులు కాలరాస్తున్నారని, పోలీసు రాజ్యం నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా సామాన్యులను సమీకరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

...సమ్మేళనాలపై ఫోకస్

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో.. ఈ సమ్మేళనాల ద్వారా ఆయా వర్గాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు ప్రణాళిక రూపొందించింది. యువజన, విద్యార్థి సమ్మేళనాలతోపాటు వివిధ సామాజికవర్గాలతో ప్రత్యేక భేటీలు, సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. ఈ సమ్మేళనాలు, భేటీలకు సంబంధించిన షెడ్యూల్, విధి విధానాలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉంది. ఇక పార్టీ కార్యకలాపాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా కమిటీలను పటిష్టం చేయడంపై పార్టీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

'హైదరాబాద్ స్టేట్' ప్రాంతాలపై నజర్

మహారాష్ట్రలో వరుస బహిరంగ సభలతో పార్టీ కార్యకలాపాలను వేగవం తం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. 2024 లోక్‌సభ ఎన్నికలు లక్ష్యం గా పావులు కదుపుతున్నారు. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వ పథకాలపై నెలకొన్న ఆసక్తిని అనువుగా మలుచుకునే దిశగా ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణతోపాటు పూర్వపు హైదరాబాద్ స్టేట్‌లో అంతర్భాగంగా ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాల్లో బలం పెం చుకోవడంపై ఫోకస్ చేశారు. కనీసం 40 నుంచి 60 లోక్‌సభ నియోజకవర్గాల్లో అన్నిస్థాయిల్లో పార్టీ నిర్మాణం ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని బీఆర్‌ఎస్ నేతలు చెప్తున్నారు. మరోవైపు ఈ నెల 25న రాష్ట్రంలోని 19వేల జనావాసాల్లో పార్టీ జెండా పండుగతోపాటు అదే రోజున అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో 3వేల మందితో పార్టీ ప్రతినిధుల సభలను నిర్వహించేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు చేస్తోంది.

బీఆర్‌ఎస్‌లో ఔరంగాబాద్ జెడ్పీ చైర్మన్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన వివిధ పార్టీల నేతలు బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలకి కేసీఆర్ ఆహ్వానిం చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో ఎన్సీపీకి చెందిన ఔరంగాబాద్ జెడ్పీ చైర్మన్ ఫిరోజ్‌ఖాన్, ఔరంగా బాద్ ఎన్సీపీ ఉపాధ్యక్షుడు రణ్వాసింగ్, విదర్భ షెత్కారి సంఘటన్ అధ్యక్షుడు జంగదీశ్ పాండే, మహారాష్ట్ర అన్నదాత శేటకారి సంఘటన్ అధ్యక్షుడు జయజీరావు సూర్యవంశీ, పోలంబరి ఎన్సీపీ ఉపాధ్యక్షుడు త్రయంబక్ మడ్గే తదితరులు న్నారు. వీరితో పాటు పలువురు సీనియర్ రాజ కీయ నేతలు, రైతు సంఘం నేతలు, సామాజిక సేవ తదితర రంగాలకు చెందిన పలువురు నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, మహారాష్ట్రలో వివిధ రంగాలకు చెందిన పలువురు నేతలు, విద్యాధికులు ఈనెల 26న తెలంగాణ భవన్ వేదికగా బీఆర్‌ఎ స్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. వీరితో బుధ వారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమావేశమయ్యారు.

24న ఔరంగాబాద్‌లో బీఆర్‌ఎస్ సభ

- జబిందా మైదానం ఎంపిక..
- సభా ప్రాంగణానికి జీవన్‌రెడ్డి భూమి పూజ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని ఔరంగా బాద్ (శంభాజీనగర్)లో ఈ నెల 24న జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను భారత్ రాష్ట్ర సమితి ముమ్మరం చేసింది. ఔరంగాబాద్ లోని అంకాస్ మైదానంలో సభ నిర్వహణకు సన్నాహాలు చేసినప్పటికీ భద్రతా కార ణాలరీత్యా పోలీసులు అనుమతి నిరాకరిం చారు. దీంతో పట్టణంలోని జబిందా మైదా నంలో సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయిం చింది. నాలుగు రోజులుగా ఔరంగాబాద్‌లో మకాం వేసిన ఆర్మూరు ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి బుధవారం జబిందా మైదానంలో కొబ్బరికాయ కొట్టి సభ ఏర్పా ట్లను ప్రారంభించారు. మహారాష్ట్రలో నాం దెడ్, కాందార్ లోహ తర్వాత ఇది మూడో సభ కాగా, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యఅతిథిగా ఈ సభకు హాజరవుతు న్నారు. సభ ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న పార్టీ ఔరంగాబాద్ చరిత్రలో నే ఇది అతిపెద్ద సభగా నిలుస్తుందని చెబు తోంది.

డిజిటల్ రథాలతో పథకాల ప్రచారం

తెలంగాణ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ఏడు డిజిటల్ ప్రచార రథాలను రంగంలోకి దిం పింది. ఈ ప్రచార రథాలు ఔరంగాబాద్ జిల్లా పరిధిలోని ఔరంగాబాద్ తూర్పు, పశ్చిమ, మధ్య అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు వైజాపూర్, కన్నాడ్, గంగాపూర్, కొలంబర్ నియోజకవర్గాల్లో మొత్తంగా 450 తెలంగాణ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్నాయి. ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, పార్టీ జాతీయ కార్యదర్శి హిమాన్షు తివారీ, బీఆర్‌ఎస్ కిసాన్ సమితి మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడు మాణిక్ కదమ్ తదితరులు ఔరంగాబాద్‌లోనే మకాం వేసి సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



అందరి సంతోషంలో మీ సంతోషాన్ని వెతుక్కోండి.
- జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, 20 ఏప్రిల్ 2023

మండుటెండల్లో మహా నిర్లక్ష్యం

ప్రకృతి ప్రకోపానికి గురికావడం వేరు. పాలకుల అనాలోచిత చర్య, నిర్లక్ష్యానికి బలి కావడం వేరు. నవీ ముంబయ్‌లోని ఖార్‌ఘర్ ప్రాంతంలో ఆదివారం 38 డిగ్రీల మండుటెండలో 306 ఎకరాల్లో ఆరుబయట ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో అసువులు బాసిన 13 మంది అమాయకులు అక్షరాలా పాలనా యంత్రాంగపు నిర్లక్ష్యానికి బలిపశువులే. మహారాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారం 'మహారాష్ట్ర భూషణ్'ను సంఘ సంస్కరణవాది అప్పాసాహెబ్ ధర్మాధికారికి ప్రదానం చేసే ఆ బహిరంగ సభకు 10 లక్షల మంది హాజరయ్యారు. కేంద్ర హోమ్ మంత్రి, సీఎం లాంటి వీవీ ఐపీలకు ఎండ కన్నెరగని రీతిలో ఏర్పాట్లు చేసిన పెద్దలు, సామాన్యులకు నెత్తి మీద నీడ కాదు కదా.. తాగేందుకు గుక్కెడు చల్లటి మంచినీటినైనా ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారంటే ఏమనాలి?

650 మంది దాకా వేసవి ఉష్ణతాపం వల్ల అస్వస్థతకు గురి కాగా, 18 మంది ఆస్పత్రి పాలైన ఆ సభావేదిక దృశ్యాలు చూస్తుంటే, ఎవరికైనా గుండె మండిపోతుంది. ఎండలు ముదిరిన వేసవిలో, మహారాష్ట్రలో ప్రచండ గ్రీష్మపవనాల ప్రభావం తప్పదని వాతావరణ శాఖ హెచ్చరించి సంగతి తెలిసీ... ఇలా మిడసరిలగ్నంలో బహిరంగ సభ పెట్టి మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే హక్కు ఏ పార్టీకైనా, ఏ ప్రభుత్వానికైనా ఎవరిచ్చారు? పర్యావరణ విధ్వంసం, వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడు ఏటేటా పెరుగుతున్న ఉష్ణోగ్రత, వేడిగాలులపై పాలకులు దృష్టి పెట్టాల్సిన అత్యవసరాన్ని ఈ నిర్లక్ష్యం, వ్యవస్థాగత వైఫల్యం గుర్తుచేస్తున్నాయి. ఈ ఘటన అటు పాలకులకూ, ఇటు వేసవి గడిచేకొద్దీ ఎన్నికల రాజకీయ వేడి పెరిగి, భారీ సభలకు దిగే పార్టీలకూ పాఠాలు చెబుతోంది.

మహారాష్ట్ర ఘటనలో మహాపరాధాలు అనేకం. సాయంత్రం 5 గంటలకు అనుకున్న సభను ఎందుకు ఆరు గంటలు ముందుకు జరిపినట్టు? పక్క రాష్ట్రాల నుంచి కూడా లక్షల మంది హాజరయ్యేలా ఎర్రటి ఎండలో గంటలకొద్దీ సభ పెట్టినప్పుడు నీడలో కూర్చొనే ఏర్పాటు, సక్రమంగా మంచినీటి వసతి ఎందుకు చేయలేకపోయినట్టు? ఎండ వేడి, ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరై, దాహంతో నోరు పిడచగట్టుకుపోయి, కళ్ళు తిరిగి వడదెబ్బకూ, గుండెపోట్లకూ జనం మరణిస్తే, 'దురదృష్టకరం' అని ఒక్కమాట అనేస్తే చాలా? మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం ప్రకటించినంత మాత్రాన... చేసిన పాపం, ఏర్పాట్లలో చూపిన నిర్లక్ష్యం మాసిపోతాయా? ఉష్ణపవనాలపై వాతా వరణ శాఖ హెచ్చరికలను యంత్రాంగం పెడచెవిన పెట్టిన ఫలితమిది. ఇది దేశంలో అందరికీ ఓ గుణపాఠం.

తాజాగా ఏప్రిల్ 17 నుంచి అయిదురోజులు యూపీ, బెంగాల్, సిక్కిమ్, ఒడిశా, జార్ఖండ్, కోస్తా ఆంధ్రలో ఉష్ణతీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ హెచ్చరికలు రావడం గమనార్హం. గడచిన 2022లో ఏకంగా 280 రోజులు 16 రాష్ట్రాల్లో ఉష్ణ పవనాలు వీచినట్టు 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' నివేదిక. ఇది గత దశాబ్దిలోకెల్లా అత్యధికం. ఒక్క మహా రాష్ట్రలోనే నిరుడు వేసవిలో 2 నెలల్లో, 4 హీట్ వేవ్స్ వచ్చాయి. 31 మంది మరణించారు. ఈ ఏడాదీ మార్చి నుంచి మే వరకు మధ్య, వాయవ్య భారతంలో గ్రీష్మ పవనాలు వచ్చే అవకాశం ఎక్కువని ఐఎండీ ఫిబ్రవరిలోనే పారాహుషార్ చెప్పింది. ఆ అంచనా సాక్ష్యమే ఇటీవలి ఎండలు, వడగాడ్పులు. ఏటేటా పెరుగుతూ, జనజీవనాన్ని ప్రభావితం చేస్తున్న ఈ వేడిమిపై పాలకులు తక్షణం దృష్టి పెట్టాలంటున్నది అందుకే!

2010లోనే ఉష్ణపవనాల తాకిడికి 800 మందికి పైగా మరణించిన అహ్మదాబాద్‌లో అక్కడి నగరపాలక సంస్థ నిపుణుల సాయంతో దేశంలోనే తొలి 'గ్రీష్మపవన కట్టడి కార్యాచరణ ప్రణాళిక' (హెచ్‌ఏపీ)ను రూపొందించింది. 2013 నుంచి అమలులో పెట్టి, ఏటా వెయ్యికి పైగా మరణాలను నివారిస్తోంది. జనం జీవనోపాధినీ, ఆరోగ్యాన్నీ దెబ్బతీసే ఈ వడగాడ్పులను ఎదుర్కోవడానికి ఇంకా అనేకచోట్ల వివిధ పాలనా యంత్రాంగాలు ప్రణాళికలు రూపొందించక పోలేదు. పిల్లల బడి వేళల్లో, రోజువారీ కూలీల పని వేళల్లో మార్పులు, ప్రథమ చికిత్స, మంచినీటి వసతుల ఏర్పాటు లాంటి ప్రామాణిక కార్యాచరణ విధానాలను (ఎస్‌ఓపీ) ఒడిశా లాంటి రాష్ట్రాలు రూపొందించాయి. అయితే, మన దేశంలో ఈ హెచ్‌ఏపీలను ఎక్కడికక్కడ స్థానిక అవసరాలకు తగ్గట్లు తయారు చేయట్లేదు. అది పెద్ద లోపం. నిధుల కొరత సరేసరి. పదులకొద్దీ ప్రణాళికల్ని అధ్యయనం చేసి 'సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్' ఇది తేల్చింది. ఆ మాట మనకు మరో కనువిప్పు.

అందుకే, ఈ ప్రణాళికలన్నిటినీ జాతీయ స్థాయిలో ఒకచోట సమీకరించడం అవసరం. పారదర్శకంగా, ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచి, తరచూ వాటి పనితీరును మదింపు చేయాలి. సీపీఆర్ ఆ సూచనే చేస్తోంది. అలాగే, రోజువారీ కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల్ని కొలిచే సంప్రదాయ విధానాలు సరిపోవు. ఒక ప్రాంతపు వేడినీ, తేమనూ కలిపి కొలిచే 'వెట్-బల్బ్' ఉష్ణోగ్రత; అలాగే గాలి వేడిమి, సాపేక్ష ఆర్ద్రత, వాయువేగాల కలయికైన ఒంటికి అనిపించే ఉష్ణోగ్రత లాంటి కొత్త విధానాల్ని అనుసరించడం మంచిది. దీనివల్ల ఒంటిపై ఉష్ణప్రభావాన్ని గ్రహించి, సునిశిత చర్యలు చేపట్టవచ్చు. ప్రజలకు వాతావరణ అక్షరాస్యత కల్పించి, అవగాహన పెంచి, అవాంఛనీయ మార్పులకు సంసిద్ధం చేయడమూ అవసరం.

అందులోనూ రానున్న కాలంలో... ప్రపంచంలో తొలిసారిగా మానవ ఉనికికే ప్రమాదమయ్యే స్థాయి ఉష్ణపవనాలు ఎదురయ్యే ప్రాంతాల్లో ఒకటి భారత్ కావచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరిక. పంచాగ్ని మధ్యంలో పడిపోక ముందే తెలివి తెచ్చుకొని, సత్వర కార్యాచరణకు దిగడమే విజ్ఞత. ఉదాసీనతతో, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మహారాష్ట్ర లాంటి ఘటనలే మళ్ళీ ఎదురవుతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** అమావాస్య ఉ.9.44 వరకు, తదుపరి వైశాఖ శు.పాడ్యమి, **నక్షత్రం:** అశ్వని రా.11.33 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** రా.7.37 నుండి 9.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** సా.4.31 నుండి 6.03 వరకు.

సూర్యోదయం: 5.45
సూర్యాస్తమయం: 6.12
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

నకిలీల తనిఖీ పేరుతో పెత్తనం?

సందర్భం



అపర్ గుప్తా

డిజిటల్ మీడియాలో వచ్చే ప్రభుత్వ వార్తల్లోని సత్యాసత్యాలను ఒక ప్రత్యేక 'ఫ్యాక్ట్ చెక్' విభాగం ద్వారా తనిఖీ చేయించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ... ఐటీ 'నియమావళి – 2023'ని సవరించడంపై పలు అభ్యంతరాలు, ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం హామీ ఇచ్చిన విస్తృత సంప్రదింపులు లేకుండానే నిబంధనలు రూపొందించడం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1)(ఎ) పౌరులకు ప్రసాదిస్తున్న భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉందని సోషల్ మీడియా వెబ్‌సైట్‌లు, డిజిటల్ మాధ్యమాలు కలవరం చెందుతున్నాయి. సమాచారాన్ని తొలగించమని ఆదేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దఖలు పడుతున్నందునే తాజా 'ఐటీ నియమావళి, 2023' వివాదాస్పదం అయింది.

ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్‌తో ఒక కొత్త సమాచార నియంత్రణ శక్తి ఊపిరి పోసుకుంది! ప్రాథమిక 'ఐటీ నియమావళి, 2023'కి జోడింపుగా 'మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నీతి నియమాలు' (ఇంటర్మీడియేటరీ గైడ్‌లైన్స్ అండ్ మీడియా ఎథిక్స్ కోడ్)ని చేర్చడం ద్వారా 'ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ' అలాంటి నియంత్రణ శక్తి ఆవిర్భావానికి తావు కల్పించింది. ఈ కొత్త నియమావళి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి డిజిటల్ మీడియాలో వచ్చే నకిలీ, తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని గుర్తించి, వాటిని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఒక 'వాస్తవాల తనిఖీ' (ఫ్యాక్ట్ చెక్) విభాగం ఏర్పాటుకు అధికారాన్ని ఇస్తోంది!

సమాజ సంక్షేమాన్ని విస్మరించి, స్వేచ్ఛను హరించేందుకు (ఆర్వేలియన్) అవకాశం ఉన్న ఆ ఫ్యాక్ట్ చెక్ విభాగం... ప్రభుత్వ శాఖలు, మంత్రుల గురించి డిజిటల్ మీడియాలో వచ్చే వార్తలు, వ్యాఖ్యలు, నివేదికలు, అభిప్రాయాలను వాస్తవాల తనిఖీ పేరిట పరిశీలించి వాటిని తొలగించడం కోసం ఆన్‌లైన్ మధ్యవర్తులకు ఆదేశాలు జారీ చేస్తుంది. ఆ మధ్యవర్తులు ఆన్‌లైన్ సోషల్ మీడియా కంపెనీలు కావచ్చు. ఐ.ఎస్.పి. (ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్)లు, యాప్‌ల రూపకల్పనకు అవసరమైన సాంకేతికతల్ని హోస్ట్ చేసే సంస్థలూ కావచ్చు. వాస్తవాల తనిఖీ వల్ల కచ్చితత్వ నిర్ధారణ జరుగుతుందనీ, వాస్తవాలకు మాత్రమే విస్తృతి లభించి, పాఠక పౌరులకు ఏది చేరాలో అదే చేరుతుందనీ 'ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ' ఉద్దేశం.

ఐటీ యాక్ట్, 2000లోని సెక్షన్ 79 కల్పిస్తున్న 'నియమాల రూపకల్పన అధికారాన్ని' ఉపయోగించుకుని ఈ తాజా ఐటీ నియమావళి, 2023 ఏర్పడింది. శ్రేయా సింఘాల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం... సెక్షన్ 79, ఐ.టి. నియమావళిని అనుసరించి చట్ట విరుద్ధ చర్యలకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని కోర్టు ఉత్తర్వు ద్వారా లేదా ప్రభుత్వ విభాగం ఆదేశాల మేరకు ప్రభుత్వం పొందడానికి మధ్యవర్తులను ఏర్పరచుకోవచ్చు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(2)లో 'నకిలీ', 'తప్పుడు', 'తప్పుదారి పట్టించే' అనే పదాలు ప్రత్యేకించి లేవు. శాంతి భద్రతలు, దేశ సమగ్రత, నైతికత వంటి విస్తృత వర్గీకరణల కింద మాత్రమే ఐటీ నియమావళి అన్వయం అవుతుంది. అంతమాత్రాన, సరిగా లేని ఏదైనా సమాచారం లేదా ప్రకటన... నకిలీ, తప్పుడు, లేదా తప్పుదారి పట్టించేది అయిపోదు. అయితే నకిలీ, తప్పుడు, తప్పుదారి పట్టించే వర్గీకరణల కిందికి వచ్చే ప్రతి సమాచారం కూడా ఈ 'వాస్తవాల తనిఖీ' పరిధిలోకి రాకపోయినప్పటికీ రాజ్యాంగ విరుద్ధమైన నిషేధ అధికారంతో ప్రభుత్వం చర్య తీసుకునే ప్రమాదం ఉంది.

ఇక ఐటీ నియమావళి, 2023 'నకిలీ, తప్పుడు, తప్పుదారి



పట్టించే' సమాచారం ఎలాంటిదన్నది నిర్వచించలేదు. 'వాస్తవాల తనిఖీ విభాగం' అర్హతల్ని, విచారణ పరిధుల్ని, విధానాలను పేర్కొనలేదు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి.) లో ఇప్పటికే ఉన్న తనిఖీ విభాగం గతంలో పొరబడిన సందర్భాలు కూడా ఉన్నాయి! 2020 డిసెంబర్ 16 పీఐబీ ఒక ఇంటెలిజెంట్ బ్యూరో నియామక సమాచారానికి బూటకంగా ముద్రవేసింది. అయితే ఆ మర్నాడే సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... పీఐబీ బూటకం అని భావించిన ఆ నియామక ప్రకటన నిజమైనదేనని ప్రకటించింది. ఇదొక్కటే ఇలాంటి సంఘటన కాదు. పలు పత్రికా ప్రచురణకర్తలు ఇటువంటి వాస్తవాల తనిఖీ తొందరపాట్లపై ఫిర్యాదు చేసిన ఉదంతాలు ఉన్నాయి.

'ఐటీ నియమావళి, 2023' మొదట 2023 జనవరి 2న ఒక ముసాయిదా రూపంలో వెలువడింది. ఆ నియమావళిపై 2023 జనవరి 17 లోపు తమ అభిప్రాయాలను వెల్లడించాలని ప్రభుత్వం డిజిటల్ సంస్థలను, డిజిటల్ వినియోగదారులను కోరింది. అయితే ఆ ముసాయిదా ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను నియంత్రించడానికి అవసరమైన నిబంధనలను మాత్రమే కలిగి ఉంది. అభిప్రాయాల వెల్లడికి గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆ ముసాయిదాలో 'వాస్తవాల తనిఖీ' అధికారాలను చేరుస్తూ దానిపై సంప్రదింపుల వ్యవధిని పొడిగించింది. ఈ చర్యే ఆందోళనకు దారి తీసింది. ఎడిటర్స్ గిల్డ్ జనవరి 18న ఒక ప్రకటన విడుదల చేస్తూ, తనిఖీ అధికారాల నిబంధనను వెనక్కు తీసుకోవాలని కోరింది. ఏది నకిలీ సమాచారమో తేల్చే పూర్తి నిర్ణయాధికారం ప్రభుత్వం చేతిలో ఉండకూడదని అభిప్రాయపడింది. జనవరి 19న 'డిజిపబ్'... ప్రతిపాదిత సవరణల్ని విమర్శించింది. ఆ సవరణలు భారత ప్రభుత్వానికి ఏకపక్షంగా విచక్షణాధికారాలను కట్టబెడుతున్నాయని ఆరోపించింది. జనవరి 23న ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ... ఈ సవరణలు ప్రభుత్వ చర్యల్ని విమర్శించడాన్ని నిషేధించేందుకు అనుమతిస్తున్నాయని వాదించింది.

ఈ అభ్యంతరాలన్నిటికీ జనవరి 25న ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. ఈ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఏర్పాటు ప్రతిపాదనపై ఫిబ్రవరి ఆరంభంలో పీఐబీతో ప్రత్యేక సంప్రదింపులు జరుపుతామని ప్రకటించారు. అయితే ముఖాముఖీలు గానీ, ఆన్‌లైన్ ప్రజా సంప్రదింపులు గానీ లేవు. డిజిటల్ సమాచార సంస్థలతో ప్రభుత్వం అసలు సమావేశమే అవలేదు. ''అన్నిటికన్నా ఆశ్చర్య పరుస్తున్నదేమంటే ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా అర్థవంతమైన సంప్రదింపులేవీ జరపకుండానే ముసాయిదాలో సవరణల్ని ప్రకటించడం'' అని ఎడిటర్స్ గిల్డ్ ఏప్రిల్ 7న పేర్కొంది.

వాస్తవానికి 'ఐటీ నియమావళి, 2021'లో ప్రతి సంవత్సరం సవరణలు జరుగుతూనే ఉన్నాయి. మొదట 2021 ఫిబ్రవరి 25న ప్రభుత్వం ఆన్‌లైన్ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు, డిజిటల్ న్యూస్ పోర్టల్స్‌కు ఉన్న అధికారాలను విస్తరిస్తూ నియమాల్లో మార్పులు చేసింది. ఆ మార్పులపై వ్యతిరేకత వ్యక్తం అయింది. 30 రిట్ పిటిషన్‌లు దాఖలు అయ్యాయి. వాటిపై మూడు హైకోర్టులు నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చాయి. 2021 ఆగస్టు 5న బాంబే హైకోర్టు ''ఈ మార్పులు ఆలోచనా స్వేచ్ఛ కోసం ప్రజలు అలమటించేలా చేస్తాయి'' అని పేర్కొంటే, 2021 సెప్టెంబరు 17న మద్రాసు హైకోర్టు, ''ప్రభుత్వపు ఒక్క కనుసైగతో పౌరులకు సమాచారం అందుబాటులో లేకుండా పోతుంది'' అని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం ఈ కేసులను సవాలు చేసి వాటిని సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కోరింది.

ఆ తర్వాత, 2022 అక్టోబర్ 28న ప్రభుత్వం మరికొన్ని సవరణల్ని ప్రవేశపెట్టింది. సోషల్ మీడియా వినియోగదారులు సమాచార నియంత్రణ నియమాలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికి వీలుకల్పించే ఫిర్యాదుల అప్పిలేట్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలకు 37 విజ్ఞప్తులు రాగా, వాటిల్లో 19 విజ్ఞప్తులను నిర్ణయమేమిటో వెల్లడించకుండా, ప్రజలకు వాటి యు.ఆర్.ఎల్.లను బహిర్గతం చేయకుండా అవి పరిష్కరించేశాయి! ఇదంతా 'రేస్ ఇప్సా లోక్విటూర్' (వాస్తవాలు వాటికవే మాట్లాడతాయి) అనే లాటిన్ సామెతను గుర్తు చేస్తోంది. నిజం ఏమిటో నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వ శాఖకు దఖలు పరుస్తున్న ఐటీ నియమావళి, 2023తో వాస్తవాలే మాట్లాడతాయన్న సంగతి కూడా నిర్ధారణలోకి రావచ్చు.

వ్యాసకర్త న్యాయవాది,
ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇక్కడ తెలుసా?



అమెరికాలో నలభై శాతం మందికి మోదీ ఎవరో తెలీదని ప్యూ సర్వే వెల్లడించింది. కానీ వాళ్లు ఇండియాలో సర్వే చేసివుంటే, జో బైడెన్ ఎవరో 99 శాతం మందికి తెలీదని వెల్లడయ్యేది.
- సేవియో రోడ్రిగ్స్, జర్నలిస్ట్

పొరుగు సమస్య



తమ పొరుగు దేశాన్ని తాలిబన్లు హస్తగతం చేసుకోవడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేసిన పాకిస్తానీయులే, ఇంకో పొరుగు దేశంలో తొలి యాపిల్ స్టోర్ ప్రారంభం కావడం పట్ల అసూయ చెందుతున్నారు.
- సలీమ్, పాక్ వ్యాఖ్యాత

లింగాన్ని ఏం నిర్దేశించాలి?



జీవశాస్త్ర పరంగా స్త్రీ పురుష లింగ భేదం సంపూర్ణమేమీ కాదనడం అసంబద్ధం. ఇదింకా జననేంద్రియాలు ఆడా, మగా అనేది నిర్దేశించవనే హాస్యాస్పద అతివాదానికి దారి తీస్తుంది. అలాంటప్పుడు, మగవాళ్లను మగ, ఆడవాళ్లను ఆడ అని ఎందుకనడం? 'అతడు', 'ఆమె' మాటలను రద్దు చేసి, 'అది' అంటే సరిపోతుంది కదా! పాశ్చాత్య లింగ మేల్కొలుపువాదం సుప్రీంకోర్టును పీడిస్తోంది.
- కన్వల్ సిబ్బల్, మాజీ రాయబారి

చిల్ సిల్వియో!



ఇటలీ బిలియనీర్, మాజీ ప్రధానమంత్రి సిల్వియో బెర్లుస్కోనీ సెనేట్ దగ్గర సన్‌గ్లాసెస్ పెట్టుకుని కనిపించారు (ఫొటో షేర్ చేశారు). 'కంటి ఆరోగ్య' సమస్యల వల్ల ఆయన వ్యభిచార విచారణ పోస్ట్‌పోన్ అయిన తర్వాతి సంగతి ఇది.
- అలెసాండ్రా బొక్కి, జర్నలిస్ట్

మూల కారణం



ఎందుకు యువత నేరాల వైపు మళ్లుతున్నారు? 1. పేదరికం. 2. నాణ్యత లేని బడిచదువులు. 3. నిరుద్యోగం. వాళ్లను రాజకీయనాయకులు ద్వేషం వ్యాప్తిచేయడానికి వాడుకుంటున్నారు. ఎవరు దీనికి బాధ్యులు? రాజ్యం, రాజకీయ నాయకులు.
- కపిల్ సిబాల్, రాజ్యసభ ఎంపీ

తొక్కిపెడతారా?



మహారాష్ట్ర ప్రభుత్వం ఒక బహిరంగ సభను నిర్వహించడంలోని వైఫల్యం వల్ల జరిగిన తొక్కిసలాట మరణాలను కూడా ఎండదెబ్బ మరణాల్లోకి ఎందుకు తోసేస్తున్నారు? ఎందుకు కప్పిపుచ్చుకోవడం? అది కూడా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కేంద్ర హోంమంత్రి పాల్గొన్న సభ గురించి?
- తుషార్ గాంధీ, రచయిత

కావాలంటే చేసుకోనివ్వాలి!



వివాహం అనేది ఎంతమాత్రమూ అవసరం లేని, ఇక చెల్లుబాటు కాని వ్యవస్థ. చాలా సంతోషంగా ఉన్న వివాహితగానే ఈ మాటలు చెబుతున్నాను. అయినప్పటికీ, వివాహ సమానత్వానికి చట్టబద్ధతను దాని సంపూర్ణార్థంలో ఎవరైనా కోరుకుంటే నేను వాళ్లకు మద్దతిస్తాను. వైవాహిక స్థితిని కోరుకునేవాళ్ల పట్ల వివక్ష చూపడంలో ఏ హేతువూ లేదు.
- నిష్ఠ గౌతమ్, సంపాదకురాలు

ఇన్‌బాక్స్

బెట్టింగ్ పట్ల జర జాగ్రత్త!

ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న యువత 'బెట్టింగ్' ఉచ్చులో పడి డబ్బును కోల్పోవడంతో పాటు, ఇటు చదువులనూ ఆటకెక్కిస్తున్నారు. పోలీసులు బెట్టింగ్‌ను అరికట్టడానికి ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవేవీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు. బెట్టింగ్ రాయుళ్లు రకరకాల పద్ధతుల్లో బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటం కూడా ఈ పరిస్థితికి కారణం. ఒకప్పుడు కోడిపందాలు, గుర్రపు పందాలు, ఎన్నికల ఫలితాలు వంటి వాటిలో కనిపించిన బెట్టింగ్ ఇప్పుడు ఐపీఎల్ పుణ్యమా అని క్రికెట్‌లో అధికమయ్యింది.

పిల్లలపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు కళ్లముందే తమ పిల్లలు ఈ చెడు వ్యసనానికి బలవుతుంటే చెప్పలేని బాధకు గురవుతున్నారు. సాధారణంగా బెట్టింగ్ జాడ్యం యువతకు వారి స్నేహితుల ద్వారానే అంటుకుంటూ ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల స్నేహితులపైనా ఒక కన్నువేసి ఉంచాలి. యువకులు, విద్యార్థులు వారు ఎంచుకునే స్నేహితుణ్ణి బట్టే జీవితంలో సగం విజయాన్ని కానీ, పతనాన్ని కానీ పొందుతారనేది గుర్తుంచుకోవాలి.

చదువు మీద శ్రద్ధ పెట్టకుండా తిరిగేవారు, నిరుద్యోగ యువతలో కొందరు బెట్టింగ్‌కు అలవాటవుతున్నారు. వీరికి పందెం కాయడానికి డబ్బులు ఇటీవల అందుబాటులోకి వచ్చిన అనేక రుణ యాప్‌లు అందిస్తున్నాయి. బెట్టింగ్‌లో డబ్బు కోల్పోయిన ఈ యువతను యాప్‌లవాళ్లు తిరిగి డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయడంతో చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. లేదా పరిస్థితి విషమించిన తర్వాత యువత ఇంట్లో చెబుతున్నారు.

ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే యువత, తల్లి దండ్రులు, పోలీస్‌వారు ఎవరి పరిధిలో వారు తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుంది. అలా కానిచో బెట్టింగ్ భూతానికి లక్షలాది కుటుంబాలు బలికాక తప్పదు.

– సభావట్ కళ్యాణ్, గోవిందాయిపల్లి తాండ, రంగారెడ్డి జిల్లా

హైకోర్టుల పేర్లలో ఈ తేడాలెందుకో!


అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

భారతదేశంలో ప్రస్తుతానికి 25 హైకోర్టులు పని చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు ఒక్కో హైకోర్టు వేర్వేరుగా ఉండగా... మరి కొన్నింటికి ఉమ్మడి కోర్టులున్నాయి. మహారాష్ట్ర, గోవా, దాద్రా నగర్ హవేలి, డామన్ - డయ్యూలకు ఉమ్మడిగా బొంబాయి హైకోర్టు అధికార పరిధి కలిగి ఉంది. పశ్చిమ బెంగాల్, అండమాన్ నికోబార్‌లకు ఉమ్మడిగా కలకత్తా హైకోర్టు; అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మిజోరం, నాగాలాండ్‌లకు ఉమ్మడిగా గౌహతి హైకోర్టు; కేరళ, లక్షద్వీప్‌లకు ఉమ్మడిగా కేరళ హైకోర్టు; తమిళనాడు, పుదుచ్చేరిలకు ఉమ్మడిగా మద్రాస్ హైకోర్టు ప్రాతి నిధ్యం వహిస్తున్నాయి. పంజాబ్, హర్యానా, చండీ గఢ్‌లు ఉమ్మడి పంజాబ్ హర్యానా హైకోర్టు అధికార పరిధిలో ఉన్నాయి.

కొన్ని రాష్ట్రాల్లో రాష్ట్ర రాజధాని నగరంతో పాటు ఇతర నగరాల్లో కూడా శాశ్వత హైకోర్టు బెంచ్‌లు స్థాపించారు. అవి లక్నో, ఔరంగాబాద్, నాగపూర్, పనాజీ, పోర్ట్ బ్లెయిర్, జల్పాయిగురి, ఐజ్వాల్, కోహిమా, ఇటానగర్, హుబ్బలి, కాలాబురగి (గుల్బర్గా), మదురై, ఇండోర్, గ్వాలియర్, జైపూర్ (ప్రిన్సిపల్ హైకోర్టు జోధ్‌పూర్‌లో ఉంది). మనకు స్వాతంత్ర్యం సిద్ధించక ముందే అలహాబాద్, బొంబాయి, కలకత్తా, మద్రాస్, మధ్యప్రదేశ్, పాట్నా హైకోర్టులను నెలకొల్పారు. బ్రిటిష్ ఇండియాలో ప్రెసిడెన్సీ టౌన్స్‌గా పిలిచిన కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లోని హైకోర్టులను చార్టర్డ్ హైకోర్టులుగా వ్యవహరించేవారు. క్వీన్ విక్టోరియా తన అప్రతిహత అధికారాల్ని ఉపయోగించి ఆనాటి చట్టాల ప్రకారం 1861–62 ప్రాంతంలో వీటిని నెలకొల్పింది. జమ్మూ, కశ్మీర్, లద్దాక్‌లకు ఉమ్మడి హైకోర్టు ఉంది. నైజాంల పరిపాలనలో స్థాపింపబడిన హైదరాబాద్ హైకోర్టు భారతదేశంలో హైదరాబాద్ దక్కన్ విలీనమైన తదుపరి కూడా నవంబర్ 1956 దాకా అదే పేరుతో వ్యవహరింపబడేది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏకీకరణతో 1956 నవంబర్‌లో ఆంధ్ర హైకోర్టు హైదరాబాద్ హైకోర్టులో విలీనమై, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు



ఏర్పడింది. రాష్ట్రాల పునర్విభజనతో తిరిగి 2019 జనవరి మొదటి తేదీ నుండి రెండు వేర్వేరు హైకోర్టులుగా విడిపోయాయి.

సంబంధిత రాష్ట్ర హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం... హైకోర్టుల పేర్లు, స్థాపించాల్సిన నగరాన్ని కేంద్రప్రభుత్వ సిఫారసుతో రాష్ట్రపతి నిర్ణయిస్తారు. కారణమేమిటో కానీ దేశంలోని హైకోర్టుల పేర్ల విషయంలో సారూప్యత లేదు. కొన్ని హైకోర్టులను నగరాల పేర్లతో, మరికొన్నింటిని రాష్ట్రాల పేర్లతో నేటికీ పిలుస్తున్నారు. బొంబాయి నగరం 1995లో ముంబైగా మార్పు చెందింది. మద్రాస్ నగరాన్ని 1996లో చెన్నైగా మార్పు చేశారు. కలకత్తా నగరాన్ని 2001 సంవత్సరంలో కోల్‌కతాగా, అలహాబాద్ నగరాన్ని 2018లో ప్రయాగరాజ్‌గా, ఒరిస్సా రాష్ట్రం పేరును ఒడిశాగా 2011లో మార్పు చేశారు. అస్సాం రాష్ట్రాన్ని 2008 లో అసోంగా మార్పు చేసినా, హైకోర్టుకు మాత్రం గౌహతి హైకోర్టు అని పేరు పెట్టారు. అధికారిక మార్పులు చేర్పులు చేసి దశాబ్దాలు గడచినా, ఆయా హైకోర్టులకు ఇంకా పాత పేర్లే వాడకంలో ఉన్నాయి. కలకత్తా, బొంబాయి, మద్రాస్ హైకోర్టుల పేర్లను వరుసగా కోల్‌కతా, ముంబై, చెన్నై హైకోర్టులుగా మార్చాలనే సంకల్పంతో కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన బిల్లును ఆ నాటి కేంద్ర న్యాయశాఖా మంత్రి రవి శంకర్ ప్రసాద్ 2016లో లోక్ సభలో ప్రవేశ పెట్టారు. ఇంతవరకు అది ఆమోదం పొందలేదు. మొత్తం మీద ప్రభుత్వం హైకోర్టుల పేర్లను నగరాల పేర్లతో కాకుండా రాష్ట్రాల పేర్లతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. అప్పుడే దేశంలోని హైకోర్టుల పేర్లలో ఏకరూపత వస్తుంది. ఇదిలా ఉండగా మిగతా హైకోర్టుల పేర్లకు భిన్నంగా తెలంగాణ హైకోర్టు పేరు ఉన్నట్లు తోస్తోంది. ఇంగ్లీషులో హైకోర్టు ఆఫ్ కర్ణాటక, హైకోర్టు ఆఫ్ కేరళ... అని పేర్లు ఉండగా, వీటికి భిన్నంగా 'హైకోర్ట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ' అనే పేరు స్థిరపరచి 2019 నుండి అమల్లోకి తెచ్చారు. ఈ విషయంలో కూడా చర్చ జరగాలి.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి
మొబైల్: 98485 45970

ఆత్మబంధువు

'ఆత్మబంధువు' అంటే అత్యంత సన్నిహితమైన వాడు అని లోకంలో వాడుక. ఇది శరీరగతమైన బంధుత్వం (రక్త సంబంధం, జ్ఞాతి సంబంధం లాంటిది) కాకపోయినా, అంతకంటే సన్నిహితమైంది అని ఇక్కడ భావం.

ఆత్మబంధువు అంటే నిఘంటువులు చెప్పిన అర్థం వేరు. ఆత్మ మాతుః స్వసుః పుత్రాః, సుతాః ఆత్మపితుః స్వసుః/ఆత్మ మాతుల పుత్రాః చ, విజ్ఞేయాః ఆత్మ బాంధవాః – తన తల్లి సోదరి పుత్రులూ, తన తండ్రి సోదరి పుత్రులూ, తల్లి సోదరుడైన మేనమామ పుత్రులూ ఆత్మ బంధువులు. వాళ్ళు తన గోత్రానికి చెందిన వాళ్ళు కాకపోయినా, రక్త సంబంధం కలవాళ్ళు కనక సగోత్రీకులంతటి సన్నిహితులే.

'ఆత్మ' అనే మాటనే మనం చాలా అర్థాలలో వాడుతూ ఉంటాం.



మొదటి అర్థం పరమాత్మ, జీవాత్మ, ప్రత్యగాత్మ లాంటి మాటలలో ఉన్న 'ఆత్మ'. అది సర్వాంతర్యామి. సర్వ వ్యాపి. ప్రతి ప్రాణిలోనూ ఉండి చైతన్యాన్నిచ్చే తత్త్వం ఆత్మ. శరీరం నశించినప్పుడు, అది నశించదు. ఆత్మ అవినాశి, అనాది, అనంతం. ప్రతి ప్రాణిలోనూ ప్రత్యేకంగా ఉన్నట్టు తోచినా అది ఒకే ఒక అద్వితీయమైన అఖండ చైతన్యం. నామ రూపాలు లేని అగోచర తత్త్వం. కనక ఆ ఆత్మకు బంధువులూ మిత్రులూ ఉండే అవకాశమే లేదు.

ఆత్మ అంటే మరో అర్థం 'తను, తనకు తాను' అని. ఉదాహరణకు, ఆత్మహత్య అంటే తనను తాను చంపుకోవటం. అలాగే ఆత్మస్తుతి అంటే తనను తానే పొగుడుకోవటం. దీన్ని సంకర భాషలో 'సెల్ఫ్- డబ్బా' అంటుంటాం. ఆత్మ అంటే ఆ 'సెల్ఫ్'.

ఉద్ధరేత్ ఆత్మనా ఆత్మానం, న ఆత్మానం అవసాదయేత్. / ఆత్మా ఏవ హి ఆత్మనః బంధుః, ఆత్మా ఏవ రిపుః ఆత్మనః – సాధకులు తమను తామే ఉద్ధరించుకోవాలి, అంతే కానీ తమను తాము పతన దిశగా, వినాశం దిశగా తోసేసుకోగూడదు; మనిషి తనకు తానే మిత్రుడు, తనకు తానే శత్రువు– అని చెప్తుంది గీత. తనను తాను నిగ్రహించుకొనే 'ఆత్మ నిగ్రహం' కలవాడు తనకు తాను బంధువు– 'ఆత్మ బంధువు' అవుతాడు. అలా తనను నిగ్రహించుకోలేనివాడు తనకు తానే శత్రువై, తనకు తానే హాని చేసుకొంటాడు, అంటుంది (6-5,6).

– ఎం. మారుతిశాస్త్రి

కేసీఆర్ కలలు కల్లలు చేస్తాం

- ఆయన వల్ల నష్టపోయిన వారమంతా ఐక్యంగా ముందుకు కదులుతాం
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వచ్చే నెల మొదటి వారంలో రాజకీయంగా నిర్ణయం తీసుకుంటా..



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ''సీఎం కేసీఆర్ తెలంగాణ బిడ్డలను మోసం చేస్తున్నారు. మూడోసారి సీఎం కావాలనుకుంటున్న ఆయన కలలను కల్లలు చేయడమే లక్ష్యంగా.. ఆయన వల్ల నష్టపోయిన వారమంతా ఐక్యంగా ముందుకు కదలాలన్న ఆలోచన చేస్తున్నాం. వచ్చే నెల మొదటి వారంలో రాజకీయ నిర్ణయం తీసుకుంటా..''అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిని కూడా వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ గేటు తాకనివ్వనని శపథం చేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ పార్టీలో చేరాలన్నది నిర్ణయించుకోలేదని.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఉన్న ముఖ్యనేతలతో చర్చిస్తున్నానని తెలిపారు. 'సాక్షి' టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..

తెలంగాణ బిడ్డల కలలు కల్లలయ్యాయి

ప్రత్యేక రాష్ట్రమొస్తే ఉద్యోగాలు వస్తాయని, ఆత్మగౌరవంతో బతుకుతామని తెలంగాణ బిడ్డలు కలలు కన్నారు. కానీ అవన్నీ కల్లలు అయ్యాయి. ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసినవారి సమాధుల మీద కేసీఆర్ అంతస్తులు కట్టుకుని ఆనందిస్తున్నారే తప్ప అమరులను పట్టించుకోవడం లేదు.

గెలవనివ్వను..: మాటల గారడీ చేస్తూ, ప్రజ లను మభ్యపెడుతూ మళ్లీ గెలవాలని కేసీఆర్ కంటు న్న పగ టి కలలను కల్లలుగా మిగుల్చుతానని శపథం చేస్తున్నా.. ఇది నా శపథం కాదు.. ఖమ్మం జిల్లా ప్రజల శపథం.

కేసీఆర్‌కు వివరించే ప్రయత్నం చేసినా.. వినలేదు

గత ఎన్నికల్లో నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడించి ఉంటే.. అప్పుడే నన్ను సస్పెండ్ చేయాల్సింది. నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఫలితాలకు కారణాలను కేసీఆర్‌కు వివరించే ప్రయత్నం చేశా. కానీ వారికి వినే ఓపిక లేదు.

సమయం వచ్చినప్పుడు మీ స్థిరాస్తులూ చూపిస్తా..

నాకు వేల కోట్ల పనులు ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. 2018 ఎన్నికల తర్వాత శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన కంపెనీకి ఒక్క వర్క్‌ను ఎక్సెస్‌లోగానీ, ఎస్టిమేట్ రేట్‌లోగానీ ఇప్పించి ఉంటే.. నేను దేనికైనా రెడీ. 2018 వరకు మా కంపెనీ చేసిన పనులు రూ.1,700 కోట్లు. అందులోనే వందల కోట్లు మిగిలాయని మీరు అంటుంటే.. మరి రాష్ట్రం వచ్చాక మీరు రూ.లక్షా 80వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. అందులో ఎంత మిగిలాయి, మీకు ఎన్ని వేలకోట్లు మీకు ఇచ్చారు? సందర్భం వచ్చినప్పుడు నేను లెక్కలు చెప్తా.. ఎక్కడైనా మీరు స్థిరాస్తులు దాచుకొని ఉంటే అవన్నీ నేను చూపిస్తా.

డబ్బుతో బీఆర్ఎస్ రాజకీయం

సుమారు రూ.5 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చి అభివృద్ధి చేశామని చెప్తున్నారు. వాటికి సంబంధించి ఎన్ని లక్షల కోట్లు మీకు కమీషన్ రూపంలో వచ్చింది? ప్రజలు డబ్బుకు అమ్ముడుపోవడమో, డబ్బుతో రాజకీయాల్లో సక్సెస్ కావడమో ఉత్తమాటే. బీఆర్ఎస్ పెట్టి దేశవ్యాప్తంగా డబ్బుతో రాజకీయం చేయాలని కేసీఆర్ కలలు కంటున్నారు.

అవమానించినా.. కేటీఆర్ కోసం ఆగాను

2014లో ఫలితాలు రాకముందే టీఆర్ఎస్‌లోకి రావాలని మంత్రి కేటీఆర్ మమ్మల్ని అడిగారు. మీకు సరిపోను మెజార్టీ ఉందకదా అని మేం వెళ్లలేదు. నాకు కేసీఆర్ మీద ఎన్నడూ పూర్తిగా నమ్మకం లేదు. కానీ కేటీఆర్ మీద పూర్తి విశ్వాసం, నమ్మకం ఉన్నాయి. నన్ను బీఆర్ఎస్‌లోకి తీసుకొచ్చింది కేటీఆరే. నాకు ఎంపీ టికెట్ ఇవ్వకపోయినా, నా వెంట ఉన్న నేతలను ఇబ్బందిపెట్టినా, అవమానించినా ఇటీవలి వరకు బీఆర్ఎస్‌లో ఉన్నాను. దానికి కారణం కేటీఆరే. చాలా సందర్భాల్లో ఆయన నాకోసం ఫైట్ చేశారు. కానీ ఫలితం లేదు.

అందరం ఐక్యంగా కదులుతాం

కేసీఆర్ ద్వారా నష్టపోయినవారితోపాటు ప్రజాప్రతినిధులుగా ఉన్న వారు కూడా ఆత్మగౌరవాన్ని కోల్పోయామన్న బాధలో ఉన్నారు. అలాంటి వారమంతా ఐక్యంగా ముందుకుపోవాలన్న ఆలోచన ఉంది. ఇప్పటివరకు కొత్త పార్టీ ఆలోచన లేదు. వచ్చేనెల మొదటి వారం నాటికి ఒక నిర్ణయానికి వస్తా.

ఆ రెండు పార్టీలు ఆహ్వానించాయి

కాంగ్రెస్, బీజేపీ నన్ను వారి పార్టీలోకి ఆహ్వానించాయి. అయితే కేసీఆర్‌తో నష్టపోయిన వాళ్లంతా కూడా ఒక సమీకరణ చేయాలని ఆలోచిస్తున్నారు. ఆ సమీకరణగానీ, జాతీయ పార్టీలుగానీ.. ఏదో ఒక నిర్ణయం త్వరలో తీసుకుంటా. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు రెండు కలిపి వస్తే ఆలోచిస్తా. విడిగా వస్తే అసెంబ్లీకి పోటీచేస్తా.

అసెంబ్లీ రన్.. '160' డేస్!

▶ మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ చివరిదాకా పార్టీని బలోపేతం చేసే కార్యక్రమాలతోపాటు కేంద్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని ప్రచారం చేస్తూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పార్టీ నేతలకు సూచించింది. మే రెండో వారంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 500 మంది ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని సూచించింది. ఇక ఎన్నికల మోడ్‌లోకి వచ్చేసినట్టేనని, ముందూ వెనకా చూడకుండా అంతా సమష్టిగా మెరుగైన సమన్వయంతో పార్టీ విజయానికి కృషి చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం జరిగిన రాష్ట్ర పార్టీ కోర్ కమిటీ, ముఖ్యనేతల సమావేశంలో.. బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్, పార్టీ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, రాష్ట్రపార్టీ సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్ దిశానిర్దేశం చేశారు.

అమిత్‌షా సభను సక్సెస్ చేయాలి

ఈ నెల 23న చేవెళ్లలో కేంద్రమంత్రి అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకునే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉండే విధంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ కమిటీల్లో ఖాళీగా ఉన్నస్థానాలను వెంటనే భర్తీ చేయాలని.. పార్టీ పదవుల్లో ఉండి కార్యక్రమాలు, ఆందోళనల్లో పాల్గొనని వారిని తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, పార్టీనేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, పి.మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఏపీ జితేందర్‌రెడ్డి, విజయశాంతి, గరికపాటి మోహన్‌రావు, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నేతలు గురు, శుక్రవారాల్లోనూ సమావేశాలు నిర్వహించి, వివిధ అంశాలను సమీక్షించనున్నారు.

కార్యక్రమాల తీరు ఇలా..

- మోదీ నేతృత్వంలో ఎన్డీయే సర్కారు తొమ్మిదేళ్ల పాలన పూర్తిచేసుకుంటున్న సందర్భంగా మే 15 నుంచి జూన్ 15 వరకు 'జన సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలను నిర్వహిస్తారు. కేంద్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను, వివిధ రంగాల్లో సాధించిన విజయాలను ప్రచారం చేస్తారు.
- జూన్, జూలై మాసాల్లో 'సాలు దొర.. సెలవు దొర' పేరుతో తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో అవినీతి, అక్రమాలు, స్కామ్‌లు, వివిధ రంగాల సమస్యలు, ప్రజల ఇబ్బందులపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- ఆగస్టు, సెప్టెంబర్‌లలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, యువత, విద్యార్థులు, రైతులు, కూలీలు తదితర వర్గాలను స్వయంగా కలుసుకుని.. బీజేపీ అధికారంలోకి వస్తే వారికి జరిగే ప్రయోజనాలను వివరిస్తారు.

తాగేందుకు నీళ్లే లేవు.. అభివృద్ధి ఎక్కడ?: సంజయ్

బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తరుణ్‌చుగ్, బండి సంజయ్‌ల సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎంలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. తాగడానికి మంచి నీళ్లు అందించలేని సీఎం కేసీఆర్.. అభివృద్ధి గురించి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ''మంచి నీళ్లు అందక జనం అల్లాడుతున్నారు. ఎండలో కిలోమీటర్లు నడిచి వెళ్లి వ్యవసాయ బోర్ల వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నారు. దీనిని బట్టి మిషన్ భగీరథ ఎంత పెద్ద స్కామో తెలిసిపోతుంది..'' అని వ్యాఖ్యానించారు.

బీసీ బంధు పథకం ఎక్కడ?

అసెంబ్లీలో ఇచ్చిన హామీ ఏమైంది?

- 54 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో 5 శాతం నిధుల కేటాయింపులా..?
- జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి
- సీఎం కేసీఆర్‌కు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బహిరంగ లేఖ



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన లేఖను చూపుతున్న భట్టి విక్రమార్క

సాక్షి, పెద్దపల్లి: దళితబంధు మాదిరిగానే బీసీలకు బీసీ బంధు పథకం ప్రారంభించాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. బీసీబంధు ప్రారంభిస్తామని అసెంబ్లీలో సీఎం ఇచ్చిన హామీ ఎందుకు కార్యరూపం దాల్చడం లేదని ప్రశ్నించారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర పెద్దపల్లి నియోజకవర్గంలో కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో భట్టి సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలోని అంశాలను వివరించారు. రాష్ట్రంలో 54 శాతానికి పైగా ఉన్న బీసీల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడటం మానుకోవాలని, వారికి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు చేసి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023–24లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2.90లక్షల కోట్లుకాగా.. ఇందులో బీసీ సంక్షేమానికి కేవలం 5 శాతం నిధులు మాత్రమే కేటాయించారని తెలిపారు. చివరికి కేటాయించిన ఆ కొద్ది శాతం నిధులనూ పూర్తిస్థాయిలో ఖర్చు చేయటం లేదని విమర్శించారు. 2018–19లో కూడా బీసీల సంక్షేమానికి రూ.5,960 కోట్లు కేటాయించినా అందులో 63 శాతం కూడా ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. సబ్సిడీ రుణాల కోసం లక్షలాది మంది దరఖాస్తు చేసుకుని ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. సీఎం కళ్లు తెరిచి బీసీలు, ఎంబీసీలు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత ఏదీ..?

బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత తెస్తామని 2017లో అసెంబ్లీలో ప్రకటించిన కేసీఆర్ ఇప్పటివరకు ఎందుకు చేయలేదని భట్టి ప్రశ్నించారు. బీసీ సబ్‌ప్లాన్ అమలు చేస్తే మరో రూ.10 వేల కోట్లు అదనంగా సమకూరేవన్నారు. 2017లో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా అలంకారప్రాయంగానే మిగిలిందన్నారు. ప్రతి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్లు చూపుతున్నా.. ఫైనాన్స్ విభాగం ఆమోదం పొందింది నామమాత్రమేనని, అందులో ఖర్చు చేసింది చాలా తక్కువని ఆరోపించారు. 2018–19లో 75 శాతం, 20–22లో 100 శాతం నిధులు ఖర్చు చేయకుండా ఎంబీసీలను మోసగించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. 46 బీసీ కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మిస్తామని ఇచ్చిన జీవోలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, ఎంబీసీ జాబితాలో చేర్చాలని 15 కులాలవారు ప్రభుత్వానికి విన్నవించుకుని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను 18 శాతానికి కుదించారని, మంత్రివర్గంలో కేవలం ముగ్గురికి పదవులిచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

పంట నష్టపరిహారం రూ.151 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎకరాకు రూ.10 వేల చొప్పున ఖాతాల్లో జమ
- 90 రోజుల్లో చెల్లింపుల పూర్తికి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గత మార్చి 17వ తేదీ నుంచి 21వ తేదీ మధ్య కురిసిన వడగండ్ల వాన కారణంగా జరిగిన పంటల నష్టానికి గాను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి పరిహారం ప్రకటించింది. రాష్ట్రంలోని 26 జిల్లాల రైతులకు ఒకేసారి ఉపశమనాన్ని అందించడం కోసం రూ.151.64 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కౌలు రైతులతో సహా నష్టాన్ని చవిచూసిన రైతులందరికీ ఎకరాకు రూ.10 వేల చొప్పున అందజేయనున్నారు.

కలెక్టర్లు పర్యవేక్షించాలి: పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో సీఎం కేసీఆర్ పర్యటించి పరిహారంపై ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం వ్యవసాయ శాఖ జిల్లా ల వారీగా పంట నష్టంపై సర్వే నిర్వహించింది. 1.51 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఇన్‌పుట్ సబ్సిడీ నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. దీనిని వీలైనంత వరకు ఆధార్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిధులు విడుదలైన తేదీ నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లింపులు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. నష్టపోయిన ప్రతి రైతు ఒక వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని తెలిపింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ లభించేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించింది. వ్యవసాయ శాఖ పైస్థాయి నుంచి పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది.

అత్యధికంగా వరంగల్‌లో పంటనష్టం

అత్యధికంగా వరంగల్ జిల్లాలో 60,936 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో 23,633 ఎకరాల్లో, కరీంనగర్ జిల్లాలో 8,166 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 1.30 లక్షల మంది బాధిత రైతులకు పరిహారం అందుతుందని వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

మళ్లీ మావోల కలకలం!

- ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు మావోయిస్టుల కదలికలు
- పోడు పట్టాలు, గిరిజన చట్టాల అమలుకు ఉద్యమించాలని పిలుపు
- సీపీఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయం
- ఛత్తీస్‌గఢ్‌లో ఎమ్మెల్యే కాన్వాయ్‌పై దాడి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణలో మళ్లీ మావోల కదలికలు మొదలయ్యాయి. ముఖ్యంగా తెలంగాణ తూర్పు భాగం గుండా మావోయిస్టులు రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు యత్నిస్తున్నారు. అదే సమయంలో తూర్పు దిక్కున మావోలకు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవీ కాన్వాయ్‌పై తూటాల వర్షం కురిపించి దాడికి తెగబడ్డారు. అయితే, ఈ దాడి నుంచి ఆయన సురక్షితంగా బయటపడ్డారు. ఈ క్రమంలో మావోలు తెలంగాణలోకి వస్తున్నారన్న సమాచారం కలకలం రేపుతోంది. ముఖ్యంగా పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల్లో వీరి కదలికలపై పోలీసులకు స్పష్టమైన సమాచారం ఉంది. దీంతో వీరు రాష్ట్రంలోకి రాకుండా నిలువరించేందుకు పోలీసులు సరిహద్దుల వద్ద భద్రత పెంచారు. అయితే, ఈసారి ఏప్రిల్ 20న జరగనున్న ఇంద్రవెల్లి అమరుల సంస్మరణను పురస్కరించుకుని ఉద్యమాలను నిర్మించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించడం పోలీసులను కలవరపాటుకు గురిచేస్తోంది. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఉద్యమించిన ఆదివాసీల్లో 13 మంది పోలీసు కాల్పుల్లో మరణించిన ఘటనను ఉద్యమకారులు మరో జలియన్ వాలా భాగ్‌తో పోలుస్తారు.

గిరిజనులు, ఆదివాసీల హక్కుల పరిరక్షణే..!

ఇంద్రవెల్లి వారోత్సవాల సందర్భంగా మావోయిస్టు పార్టీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. తరచుగా కేంద్రంపై విమర్శలు, తమపై సాగే పోలీసు దాడులను నిలిపివేయాలనే సాధారణ డిమాండ్లను మావోయిస్టు పార్టీ ఈసారి వినిపించకపోవడం గమనార్హం. కేవలం ఆదివాసీలు, గిరిజనుల హక్కులు, వారి సంక్షేమానికి ప్రభుత్వం తెచ్చిన చట్టాలు, జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేయడం విశేషం. ఆదివాసీ ప్రాంతాల్లో స్వయం పాలన, 1995 పెసా చట్టం, 2005 అటవీ హక్కుల చట్టం, కవ్వాల్ టైగర్ జోన్, అభయారణ్యాల ఎత్తివేత, ఆదివాసీల పోడు భూములకు పట్టాలు, ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటు, ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ, ఆదివాసీబంధు అమలు తదితర డిమాండ్లను మావోయిస్టులు ప్రభుత్వం ముందుంచుతున్నారు. చివరిగా.. ఎస్టీల్లో ఇతర కులాలను చేర్చవద్దని స్పష్టంచేశారు.



ఎందుకు వస్తున్నట్లు..?

మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించేందుకు రాజకీయ, భౌగోళిక, వాతావరణ కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం మహారాష్ట్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం వేసవి కారణంగా అడవులు పలుచబడటం, ఆకులు రాలిపోవడంతో వీరు మరింత దట్టమైన అడవుల్లోకి లేదా తెలంగాణలోకి రావాల్సిన అనివార్య పరిస్థితులున్నాయి. అదేసమయంలో గోదావరిలో నీటిప్రవాహం తగ్గడం వల్ల ఎంపిక చేసిన ప్రాంతాల్లో నదిని దాటడం సులభంగా ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆదివాసీలు, గిరిజనుల హక్కుల కోసం గతంలో చేసిన చట్టాలు, విడుదల చేసిన జీవోల అమలుకు ప్రజా ఉద్యమాలను నిర్మించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం మావోల వ్యూహంగా కనిపిస్తోంది.

క్లుప్తంగా...

క్రీడాకారులకు అన్నివిధాలా ప్రోత్సాహం



సనత్‌నగర్: తెలంగాణ క్రీడాకారులు ఇతర రాష్ట్రాల ఆటగాళ్లకంటే ఎక్కువగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించాలనే ఉద్దేశంతో వారికి ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలను అందిస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన అన్ని జిల్లాల యువజన సర్వీసుల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల వసతులతో స్టేడియాలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించి విజేతలకు సీఎం కప్‌ను అందజేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే సీఎం కప్ పోటీల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న స్టేడియాల పనులు 50 శాతం పూర్తి కాగా, మిగిలిన పనులు కూడా త్వరలోనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సీఎం కప్ నిర్వహణపై త్వరలో క్రీడా సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. చిన్నతనంలో ఆడుకున్న తొక్కుడు బిళ్ల నుంచి గోళీల ఆటల వరకు తెలంగాణ గ్రామీణ క్రీడలను గుర్తించి వాటిని వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ ఆంజనేయగౌడ్, క్రీడా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, యువజన సర్వీసుల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీపై చర్చకు సిద్ధమా



సూర్యాపేటటౌన్: ఉద్యోగాల భర్తీపై తాము చర్చకు సిద్ధమేనని.. అందుకు కాంగ్రెస్, బీజేపీలు సిద్ధంగా ఉన్నాయా అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గడిచిన తొమ్మిదేళ్లలో లక్షా 32 వేల 632 ఉద్యోగాలను భర్తీ చేసిందని వెల్లడించారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పదేళ్ల నుంచి పదివేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేకపోయినా ఈ రెండు పార్టీలు నిరుద్యోగ మార్చ్.. అంటూ హడావుడి చేయడం ముమ్మాటికీ నిరుద్యోగులను వంచనకు గురి చేయడమేనన్నారు. నిరుద్యోగ మార్చ్ చేయాల్సి వస్తే అది గల్లీలో కాదని, ఢిల్లీలో చేయాలని సూచించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. అంటూ మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీకి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంవత్సరానికి రెండు లక్షల మంది ఉద్యోగులను వీధిన పడేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీది అని ఆయన దుయ్యబట్టారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ పార్టీ దిక్కుమాలిన పార్టీగా మారిందన్నారు. దేశాన్ని ఏలుతున్న పార్టీకి రాష్ట్రంలో అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి టెన్త్ ప్రశ్న పత్రం లీకేజీలో అడ్డంగా దొరికిపోయారని అన్నారు.

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని నియమించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు హుజూరాబాద్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2021 హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఇటీవల రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు నేతలు బీఆర్ఎస్ తరపున హుజూరాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న నేపథ్యంలో ఇన్‌చార్జిగా కౌశిక్‌రెడ్డికి బాధ్య తలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరుబాట

సాక్షి, హైదరాబాద్: మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. పలు దఫాలుగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, గురుకుల సొసైటీ కార్యదర్శి షఫీయుల్లాకు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 29న హైదరాబాద్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమళ్ల సమ్మయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకులాల్లో ఏడేళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని, ఏడాదిలో పదినెలల వేతనమే ఇవ్వడంతో మిగతా 2 నెలలు కూలీపనులు చేసుకోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నల్లగొండ నిరుద్యోగ నిరసన సభ వాయిదా

- సమాచారం లేకుండా కార్యాచరణ ప్రకటించడంపై జిల్లా నేతల అభ్యంతరాలు..
- 24, 26 తేదీల్లో ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆందోళనకు సిద్ధమవుతోన్న టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంలో రాష్ట్రంలోని నిరుద్యోగులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 21న నల్లగొండలో నిర్వహించ తలపెట్టిన 'నిరుద్యోగ నిరసన సభ'వాయిదా పడింది. సభ వాయిదాపై టీపీసీసీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, సభ వాయిదా పడినట్లేనని, త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తామని అటు నల్లగొండ జిల్లా కాంగ్రెస్ వర్గాలు, ఇటు గాంధీభవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. నిరుద్యోగుల నిరసన పేరుతో నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్‌తో పాటు సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహిస్తామని, ఈ సభకు ప్రియాంకా గాంధీ వస్తారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇటీవల వెల్లడించారు. అయితే, నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించాల్సిన సభ గురించి జిల్లా నేతలతో సంప్రదించకపోవడమే వాయిదా పడేందుకు కారణమని తెలుస్తోంది. కనీస సమాచారం ఇవ్వకుండా కార్యాచరణ ప్రకటించడంపై ఆ జిల్లా నేతలు, ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభ్యంతరం తెలిపినందునే సభను వాయిదా వేసినట్టు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఈనెల 24, 26 తేదీల్లో ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆందోళన నిర్వహించేందుకు టీపీసీసీ సిద్ధమవుతోంది.

నిరసన దీక్ష సమాచారం లేదు: ఉత్తమ్



సూర్యాపేట: ఈ నెల 21న నల్లగొండ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన దీక్షకు సంబంధించి తనకెలాంటి సమాచారం లేదని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ నిరసన దీక్ష ఉన్నట్లు మీడియా ద్వారానే తెలిసిందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ప్రియాంకా గాంధీ సభ ఎప్పుడున్నా.. నల్లగొండ నుంచి భారీగా కార్యకర్తలను తరలించడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని ఉత్తమ్ చెప్పారు.

'కర్ణాటక' స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్‌రెడ్డి

- 40 మంది జాబితాలో తెలంగాణ నుంచి ఇద్దరి పేర్లు
- పీసీసీ అధ్యక్షుడితో పాటు మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు చోటు





సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్‌గా టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. గురువారంతో నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు మొత్తం 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ బుధవారం ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఇందులో ఇద్దరు తెలంగాణ నాయకులకు అవకాశం లభించింది. పీసీసీ అధ్యక్షుడితో పాటు మాజీ క్రికెటర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌ను కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో చేర్చింది. ఇప్పటికే ఎనిమిది మంది రాష్ట్ర నాయకులను కాంగ్రెస్ అధిష్టానం అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పరిశీలకులుగా నియమించింది. కాగా, బుధవారం బెంగళూరులోని రాడిసన్ హోటల్‌లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశానికి వీరంతా హాజరయ్యారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో స్టార్ క్యాంపెయినర్‌లుగా నియమించిన వారితో పాటు కర్ణాటక సరిహద్దు జిల్లాలకు చెందిన తెలంగాణ జిల్లాల నాయకత్వాన్ని ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా వినియోగించుకోవాలని అధిష్టానం నిర్ణయించింది.

ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉంది

- నా భూములు లాక్కొన్నాడు
- బీఆర్ఎస్ నేత సామ దామోదర్ రెడ్డి ఆరోపణలు



పంజగుట్ట (హైదరాబాద్): ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తన భూములు లాక్కోవడమే కాకుండా, తనను, తన కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సామ దామోదర్‌రెడ్డి ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన భార్య సామ మహేశ్వరితో కలిసి మీడియాతో మాట్లాడారు. తనకు నగరంలో ఉన్న ఆస్తులు అమ్ముకుని శంకర్‌పల్లిలోని ఈర్లపల్లిలో 172 ఎక రాలు కొనుక్కుని లే-అవుట్ చేసేందుకు సిద్ధం కాగా, అదేసమయంలో జీవన్‌రెడ్డి తనను సంప్రదించి తాను కూడా రియల్‌ఎస్టేట్ చేస్తానని ఇద్దరం కలిసి చేద్దా మని అడిగారని తెలి పారు. ఈ క్రమంలో తనకు మూడు వేల గజాల విల్లా, కొంపల్లిలో 451 గజాల ఎనిమిది అంతస్తుల వాణిజ్య సముదాయం నిర్మించి ఇస్తానని, అందుకు తన 172 ఎకరాల స్థలంలోనుంచి 113 ఎకరాల స్థలం తీసుకుంటూ ఎంవోయూ చేసుకున్నట్లు వివరించారు. అయితే ఇప్పుడు తనకు ఇస్తానన్న విల్లా, కమర్షియల్ ప్రాపర్టీ ఇవ్వకుండా తన 113 ఎకరాల స్థలంతో పాటు మిగిలిన 65 ఎకరాల స్థలాన్ని కూడా జీవన్‌రెడ్డి కబ్జాచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్థలం వద్దే బౌన్సర్లు, రౌడీలను పెట్టి మమ్మల్ని రానివ్వడంలేదని దామోదర్‌రెడ్డి దంపతులిద్దరూ వాపోయారు. అక్కడ కనిపిస్తే తమను చంపేస్తామని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రిపేరుతో ఉన్న ఫంక్షన్‌హాల్స్ కూడా కబ్జాచేసుకుని అతనిపేరు పెట్టుకున్నాడని చెప్పారు. 'నువ్వు ఎవ్వరివద్దకు వెళ్లినా ఏం చేయలేవు' అని హెచ్చరిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా...

ధనుర్ధారిగా అయోధ్య రాముడు

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామమందిరంలో ప్రతిష్ఠించబోయే రాముడి విగ్రహం ధనుర్ధారిగానే ఉండనుంది. పవిత్ర కృష్ణశిలలో 5 అడుగుల ఎత్తుతో విగ్రహాన్ని తొలుస్తారు. రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు తాజా భేటీలో విగ్రహం రూపురేఖలను ఖరారు చేశారు. రాముడు విల్లుబాణాలు చేబూని నిలబడినట్లుగా విగ్రహం ఉంటుందని ట్రస్టు సభ్యుడు స్వామి తీర్థ ప్రసన్నాచార్య బుధవారం చెప్పారు. వచ్చే సంక్రాంతి నాటికి మందిర నిర్మాణం పూర్తవుతుందని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వెల్లడించారు.

క్వాంటమ్ మిషన్‌కు ఆమోదం



న్యూఢిల్లీ: క్వాంటమ్ టెక్నాలజీలో శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనలు, అభివృద్ధికి ఉద్దేశించిన నేషనల్ క్వాంటమ్ మిషన్(ఎన్‌క్యూఎం)కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. దీనికి వచ్చే ఆరేళ్లలో రూ.6,003.65 కోట్లు వెచ్చిస్తారు. ఈ రంగంలో పరిశోధనలతో దేశంలో మరింత ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్ అండ్ మెట్రాలజీ, క్వాంటమ్ మెటీరియల్స్ అండ్ డివైజెస్ విభాగాల్లో నాలుగు థీమాటిక్ హబ్స్(టీ–హబ్స్) నెలకొల్పనున్నట్లు తెలియజేశారు. సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు–2023కు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. సినిమాల పైరసీకి అడ్డుకట్ట వేసే కఠిన నిబంధనలను బిల్లులో చేర్చినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతామని చెప్పారు. ప్రస్తుతమున్న యూ, ఏ, యూఏ అని కాకుండా ప్రేక్షకుల వయసుల విభాగం ఆధారంగా సినిమాలను వర్గీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఎలాంటి ఆపదనైనా ఆర్మీ ఎదుర్కోగలదు: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: సరిహద్దు వెంట ఎలాంటి పరిణామాలనైనా సమర్థంగా ఎదుర్కోగల సత్తా సైన్యం సొంతమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు. ఆయన బుధవారం ఆర్మీ కమాండర్స్ సదస్సులో మాట్లాడారు. చైనాతో సరిహద్దు వెంట ఉద్రిక్తత సద్దుమణగలేదు. అందుకే మన భారతసైన్యం తన నిరంతర అప్రమత్తతను కొనసాగించాల్సిందే' అని ఆర్మీ టాప్ కమాండర్లను ఆదేశించారు.

కొత్తా ఓటరండీ!

పార్టీలు ఏం చేస్తాయన్నది కాదు.. యువతకి ఏం కావాలో ముఖ్యం. కర్ణాటక ఎన్నికల్లో మెజార్టీ మార్కు దాటాలంటే ఫస్ట్ టైమ్ ఓటర్లే కీలకం

కొత్తగా ఓటు హక్కు పొందడం అంటే ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం. తల్లిదండ్రులు చెప్పారనో, స్నేహితులు సిఫారసు చేశారనో ఎవరికి పడితే వారికి నేటి తరం ఓటు వెయ్యరు. సొంతంగా ఆలోచించి తమకు నచ్చిన అభ్యర్థికి తొలిసారి ఓటు వేస్తే ఆ కిక్కే వేరబ్బా అంటున్నారు. ఓటు వెయ్యడంలో ఉదాసీనత మచ్చుకైనా లేదు. ఉరిమే ఉత్సాహంతో చూపుడు వేలి మీద సిరా గుర్తు చూపిస్తూ ఫొటోలు దిగి ఓట్ల పండుగను సంబరంగా చేసుకుంటున్నారు. కర్ణాటకలో మెజార్టీ మార్కు దాటడానికి అత్యంత కీలకమైన కొత్త ఓటర్ల మదిలో ఏముంది ?



బెంగళూరులోని మహారాణి క్లస్టర్ యూనివర్సిటీలో విద్యార్థిని ఎంజే గుణ. కొద్ది రోజుల క్రితమే ఆమెకు 18 ఏళ్లు నిండాయి. మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకునే చాన్స్ వచ్చింది. ఎప్పుడెప్పుడు తమ నాయకుడ్ని ఎన్నుకునే రోజు వస్తుందాని ఆమె ఉత్కంఠగా ఎదురు చూస్తోంది. ఆమె ఉద్దేశంలో నాయకుడంటే బాగా చదువుకుని, దార్శనికుడై ఉండాలి. "నేను ఓటు వేసే ముందు ఏ పార్టీ అని కూడా చూడను. మా నియోజకవర్గానికి అభ్యర్థి ఏం చేస్తాడన్నదే ముఖ్యం. ఆ తర్వాత అభ్యర్థి బ్యాక్‌గ్రౌండ్, విద్యార్హతలు, గతంలో చేసిన పని, భవిష్యత్‌లో ఏం చేయగలడు వంటివన్నీ చూశాకే ఓటేస్తా"అని ఆమె కచ్చితంగా చెప్పింది. సునీత అనే మరొక ఫస్ట్ టైమ్ ఓటరు సరైన వ్యక్తిని ఎంపిక చేసుకునే సామర్థ్యం మనకున్నప్పుడే రాష్ట్రం, దేశం సరైన మార్గంలో వెళతాయని చెప్పుకొచ్చింది. వీరి మాటలు వింటే సంప్రదాయంగా రాజకీయ వ్యూహాలు రచిస్తూ, తాయిలాల ఆశ చూపిస్తూ వెళ్లే పార్టీల వైపు వీరు చూసే చాన్సే లేదు.

గత ఎన్నికల్లో...

మొదటి సారి ఓటు వేసే వారిలో కొత్త ఉత్సాహం, ఓటు వెయ్యాలన్న తపన ఎక్కువ ఉంటుంది. వారు తప్పనిసరిగా ఓటు వెయ్యడానికి పోలింగ్ కేంద్రాలకు కదిలి వెళతారు. గత 3 ఎన్నికల్లోనూ కొత్త ఓటర్లు ఓటు వేసే విధానాన్ని విశ్లేషిస్తే వారి నాడి పట్టుకోవడం కష్టమనే అభిప్రాయం కలుగుతుంది. సీఎస్‌డీఎస్–లోక్‌నీతి పోస్ట్ పోల్ సర్వే కొత్త ఓటరు అండదండ లేనిదే ఏ పార్టీ కూడా మెజార్టీ మార్క్ సాధించలేదు.

2008
ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ మార్కుకి కేవలం మూడు సీట్ల దూరంలో నిలిచిపోయింది. ఈ ఎన్నికల్లో పార్టీకి వచ్చిన సగటు ఓటు షేరు కంటే కొత్త ఓటరు వేసిన ఓట్ల వాటా (మొత్తం పోలయిన కొత్త ఓటర్ల ఓట్లలో) ఎక్కువగా ఉంది. కొత్త ఓటర్ల ఓటు షేర్ మూడు శాతం ఎక్కువగా ఉంది.

2013
అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త ఓటర్లు కాంగ్రెస్ వైపు స్వల్పంగా మొగ్గు చూపించారు. ఆ పార్టీకి వచ్చిన సగటు ఓట్ల కంటే కొత్త ఓటర్లు కాంగ్రెస్‌కు వేసిన ఓటు షేరు ఒక్క శాతం అధికంగా ఉంది. హస్తం పార్టీ గద్దెనెక్కింది.

2018
బీజేపీ మెజార్టీ మార్కుకి 9 సీట్ల దూరంలో ఉండిపోయింది. దీనికి కారణం కొత్త ఓటర్లేనని సీఎస్‌డీఎస్–లోక్‌నీతి గణాంకాల్లో తేలింది. బీజేపీకి పోలయిన సగటు ఓట్ల కంటే కొత్త ఓటర్ల షేరు ఆరు శాతం తక్కువగా ఉంది. హంగ్ అసెంబ్లీ ఏర్పడింది.

2013, 2018 ఎన్నికల్లో జేడీ(ఎస్) పార్టీకి సగటు ఓటు షేర్ కంటే తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న వారి ఓటు షేర్ నాలుగు శాతం అధికంగా ఉంది. దీంతో పట్టణ యువత జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీ వైపు మొగ్గు చూపిస్తున్నారని తేలుతోంది.

కర్ణాటకలో ఈ సారి 11 లక్షల మంది కొత్త ఓటర్లు రిజిస్టర్ చేసుకున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2018లో 7.7 లక్షలుంటే ఈ సారి వారి సంఖ్య 11 లక్షలకు చేరుకుంది. ప్రతీ సారి ఎన్నికల్లోనూ కొత్త ఓటర్లు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. కొత్త ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగరు. మనీ, మద్యం కంటే అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తారు. సోషల్ మీడి

కొత్త ఓటరు ఎటుంటే..

యాలో యాక్టివ్‌గా ఉంటూ మంచి, చెడులను తామే విశ్లేషించుకునే శక్తి సామర్థ్యాలున్నవారు. ఓపెన్ మైండ్‌తో ఉంటారు. పార్టీలు వారిని తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలైతే చేస్తున్నాయి. కర్ణాటకలో ఏదైనా పార్టీ మెజార్టీ మార్కు దాటాలంటే కొత్త ఓటర్లు అత్యంత కీలకమని రాజకీయ విశ్లేషకుడు సందీప్ శాస్త్రి అభిప్రాయపడ్డారు.

మేము ఏం చేస్తాం అన్నది కాదు.. మీకేం కావాలన్నదే ముఖ్యం అని కొత్త ఓటర్ల మనసులో ఏముందో పార్టీలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. కొత్త ఓటర్లను ఆకర్షించడానికి కాంగ్రెస్ పార్టీ "సెలబ్రేట్ యువర్ ఓటు"అనే ప్రచారాన్ని ప్రారంభించింది. 18–23 మధ్య వయసున్న వారే లక్ష్యంగా చేసుకొని వారికి ఏం కావాలో తెలుసుకునే ప్రయత్నాలు చేస్తోంది. వాతావరణ మార్పుల వల్ల కలిగే దుష్పరిణామాలను అరికట్టడం, అందరికీ ఉన్నత విద్యనభ్యసించే అవకాశాన్నివ్వడం ప్రస్తుతం యువత ఆశిస్తుందని తెలుసుకొని ఆ దిశగా వ్యూహాలు పన్నుతోంది. దాంతో పాటు నిరుద్యోగులు తల్లిదండ్రులకి భారంగా మారకుండా రెండేళ్లపాటు నెలకి రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ యువ సంవాద్ కార్యక్రమం

పార్టీల కొత్త పంథా..!

ద్వారా కొత్త ఓటర్ల ఆశలు, ఆకాంక్షల్ని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తోంది.కొత్త ఓటర్లను దృష్టిలో ఉంచుకునే బీజేపీ సిట్టింగ్‌లను కాదని అత్యధికంగా 60 మంది కొత్త ముఖాలకు టికెట్లిచ్చింది. జేడీ(ఎస్) పంచరత్న రథయాత్రలో యువతకే అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. కుమారస్వామి ప్రచారంలో యువతతోనే మాట్లాడుతూ వారి నాడి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త ఓటర్లు తమ వైపేనని ధీమాతో ఉంది. ఢిల్లీ, పంజాబ్‌లో యువ ఓటర్లను అధికంగా ఆకర్షించిన ఆప్ ఈసారి ఉన్నత విద్య అభ్యసించిన వారికే ఎక్కువగా టిక్కెట్లు ఇచ్చింది.

సాక్షి, నేషనల్ డెస్క్

జన భారతం

మన దేశ జనాభా 142.86 కోట్లు

- జనాభాలో చైనాను దాటేసిన భారత్
- డ్రాగన్ దేశం జనాభా 142.57 కోట్లు
- భారత్‌లో 25 శాతం మంది 14 ఏళ్లలోపువారే
- దేశంలో 65 ఏళ్లు దాటిన వృద్ధులు కేవలం 7 శాతం
- 34 కోట్ల మందితో మూడోస్థానంలో అమెరికా
- ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం నివేదిక విడుదల



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం ఏమిటి? చైనా కాదు. ఇకపై భారత్ అని చెప్పుకోవాలి. పోటీ పరీక్షల్లో ఈ ప్రశ్న అడిగితే భారత్ అని సమాధానం రాయాలి. జనాభాలో చైనాను భారతదేశం దాటేసింది. మన దేశ జనాభా రికార్డు స్థాయిలో 142.86 కోట్లకు చేరింది. 142.57 కోట్ల మందితో ప్రపంచంలో రెండో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనా నిలిచింది. భారత్ కంటే చైనా జనాభా 29 లక్షలు తక్కువగా ఉంది. 34 కోట్ల మందితో అగ్రరాజ్యం అమెరికా అత్యధిక జనాభా కలిగిన మూడో దేశంగా రికార్డుకెక్కింది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్(యూఎన్‌ఎఫ్‌పీఏ) స్టేట్ ఆఫ్ ద వరల్డ్ పాపులేషన్ రిపోర్టు–2023ను తాజాగా విడుదల చేసింది. ప్రపంచ దేశాల జనాభా గణాంకాలను వెల్లడించింది. ఇందులో పలు ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి.

- దేశ జనాభాలో 65 ఏళ్లు దాటినవారు 2063 నాటికి 20 శాతం, 2100 నాటికి 30 శాతానికి చేరుతారని అంచనా. అంటే శతాబ్దాంతం దాకా మనది యువ భారత్‌గానే ఉంటుంది.
- జనాభా విషయంలో రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. కేరళ, పంజాబ్‌లో వృద్ధుల జనాభా అధికంగా ఉంది.
- బిహార్, ఉత్తరప్రదేశ్‌లో యువ జనాభా ఎక్కువగా ఉన్నట్లు తేలింది.
- ఐక్యరాజ్యసమితి 1950 నుంచి ప్రపంచ దేశాల జనాభా గణాంకాలను సేకరిస్తోంది.
- ఐక్యరాజ్యసమితి జనాభా జాబితాలో భారత్‌కు మొదటి స్థానం దక్కడం ఇదే తొలిసారి.
- 1950లో చైనా జనాభా 55.2 కోట్లు కాగా, భారత్ జనాభా 35.3 కోట్లు ఉండేది. అంటే 73 ఏళ్ల తర్వాత చైనాను భారత్ అధిగమించినట్లు స్పష్టమవుతోంది.
- 2022లో భారత్ జనాభా 141.2 కోట్లు కాగా, చైనా జనాభా 142.6 కోట్లుగా ఉంది.
- 2050 నాటికి భారత్ జనాభా 166.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనా జనాభా 131.7 కోట్లకు పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు.
- 1950 నుంచి ప్రపంచ జనాభా క్రమంగా పెరుగుతోంది. 2020లో మాత్రం ఈ పెరుగుదల రేటు ఒక శాతం లోపే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.
- ప్రపంచ జనాభా గత ఏడాది నవంబర్‌లో 800 కోట్లు దాటిందని ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేసింది.
- ఆధునిక కాలంలో మనుషుల సగటు జీవిత కాలం మెరుగవుతోంది. అదే క్రమంలో భారత్‌లో కూడా పురుషుల సగటు ఆయుర్దాయం 71 ఏళ్లు, మహిళల సగటు ఆయుర్దాయం 74 ఏళ్లుగా ఉన్నట్లు నివేదిక తెలియజేసింది.
- ప్రపంచ జనాభా ప్రస్తుతం 804.5 కోట్లు ఉన్నట్లు అంచనా. ఇందులో మూడింట ఒక వంతు జనాభా కేవలం భారత్, చైనాలోనే ఉండడం గమనార్హం.
- చైనా, అమెరికాలతో పోలిస్తే భారత్‌లో జననాల రేటు అధికంగా ఉంది.
- భారత మహిళ తన జీవిత కాలంలో సగటున ఇద్దరు పిల్లలకు జన్మనిస్తోంది. చైనాలో ఇది 1.2గా, అమెరికాలో 1.6గా ఉంది.

క్వాలిటీ ముఖ్యం: చైనా

బీజింగ్: జనాభాలో భారత్ తమను అధిగమించడాన్ని చైనా తేలిగ్గా కొట్టిపారేసింది. క్వాంటిటీ, కాదు, క్వాలిటీ ముఖ్యమని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ అన్నారు. "జనాభా అవసరమే అయినప్పటికీ వారిలో ప్రతిభా పాటవాలు సైతం కావాలి. మా దేశంలో 90 కోట్ల మందితో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ఉంది" అన్నారు. ప్రజల్లో నైపుణ్యాలను పెంచితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

అతీక్ హత్య కేసులో ఐదుగురు పోలీసుల సస్పెన్షన్

ప్రయాగ్‌రాజ్: గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ పోలీసు వలయం మధ్యే హత్యకు గురవడాన్ని యూపీ పోలీస్ విభాగం సీరియస్‌గా తీసుకుంది. దీనిపై దర్యాప్తు చేస్తున్న సిట్ సిఫార్సు మేరకు ఐదుగురు పోలీసులను సస్పెండ్ చేసినట్టు ఉన్నతాధికారి ఒకరు బుధవారం చెప్పారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో షాగంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ అశ్వనీకుమార్ సింగ్, ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారు. గత శనివారం ప్రయాగ్‌రాజ్‌లో రాత్రివేళ మెడికల్ చెకప్ కోసం అతీక్, అతని సోదరుడు అష్రాఫ్‌లను పోలీసులు వైద్యకళాశాలకు తీసుకెళ్తుండగా మీడియా సమక్షంలోనే ముగ్గురు నేరగాళ్లు పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో కాల్పులు జరిపి హత్యచేయడం తెల్సిందే.

లైంగికత స్వతఃసిద్ధమైనది

వివక్షకు ప్రాతిపదిక కారాదు • సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

- కోర్టు ఆమోదిస్తే సమాజమూ అంగీకరిస్తుంది
- స్వలింగ వివాహాలపై పిటిషనర్ల వాదన
- రాష్ట్రాలనూ ప్రతివాదులుగా చేర్చాలి: కేంద్రం
- ఇప్పటికే వాటి వైఖరి కోరినట్టు వెల్లడి



న్యూఢిల్లీ: స్వలింగ బంధాల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "లైంగిక లక్షణాలు, మొగ్గుదలల మీద వ్యక్తులకు అదుపు ఉండదు. అవి స్వతఃసిద్ధమైనవి. కనుక వాటి ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎవరి పట్లా వివక్ష చూపజాలవు" అని స్పష్టం చేసింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలంటూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ముందు బుధవారం రెండో రోజు కూడా వాదనలు కొనసాగాయి. ఈ పిటిషన్లు పట్టణ, ఉన్నత వర్గ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయన్న కేంద్రం వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. స్వలింగ ధోరణి పట్టణ, ఉన్నత వర్గాలకే పరిమితమైనదన్న వాదనను బలపరిచే సాక్ష్యాలేవీ కేంద్రం చూపలేకపోయిందని పేర్కొంది. "లైంగిక ధోరణి స్వతఃసిద్ధ భావనే తప్ప దానికి సామాజిక, వర్గ ప్రాతిపదికలేవీ ఉండవన్న సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి వాదనతో ఏకీభవిస్తున్నాం. స్వేచ్ఛాయుత వాతావరణం కారణంగా పట్టణ ప్రాంతాల్లో ఈ ధోరణులు ఎక్కువగా బయటికి కన్పిస్తుండవచ్చు" అని అభిప్రాయపడింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పిస్తే స్త్రీ పురుషుల పెళ్లీడు, దత్తత వంటివాటిపై పడే ప్రభావంతో పాటు తెరపైకి రాగల పలు ఇతర పరిణామాలను కూడా ధర్మాసనం లోతుగా చర్చించింది. 'స్వలింగ జంట ఆడయినా, మగయినా పిల్లలను దత్తత తీసుకోవచ్చు. పెరిగే క్రమంలో తమ తల్లుల/తండ్రుల లైంగిక ధోరణి తాలూకు ప్రభావం ఆ పిల్లల మనసులపై ఎలా ఉంటుందన్నది ఆలోచించాల్సిన అంశమే" అని అభిప్రాయపడింది.

పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకే...: సుప్రీంకోర్టే చొరవ తీసుకుని స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ విజ్ఞప్తి చేశారు. 142వ అధికరణ కింద రాజ్యాంగం కల్పించిన ప్లీనరీ అధికారాలను వినియోగిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. "అత్యున్నత న్యాయస్థానికి ఉన్న ప్రతిష్ఠ, నైతికత దృష్ట్యా సమాజమూ ఈ నిర్ణయాన్ని అంగీకరించి స్వలింగ వివాహాలను ఆమోదిస్తుందన్న విశ్వాసముంది. తద్వారా వారూ సమాజంలో గౌరవప్రదమైన జీవనం గడపగలరు. వితంతు వివాహాలకూ తొలుత సామాజిక ఆమోదం లేదు. కానీ చట్టం చేశాక ఆమోదం లభించింది" అని కోర్టు దృష్టికి తెచ్చారు. కేసులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కూడా ప్రతివాదులుగా చేర్చాలంటూ సుప్రీంకోర్టులో కేంద్రం తాజాగా తాజా అఫిడవిట్ దాఖలు చేసింది. స్వలింగ వివాహాలపై వైఖరి తెలపాల్సిందిగా రాష్ట్రాలకు లేఖ రాశామని, వాటి అభిప్రాయాలతో నివేదిక సమర్పించేందుకు అనుమతించాలని కోరింది.

సాయిబాబాపై పునర్విచారణ

బాంబే హైకోర్టుకు సుప్రీం ఆదేశం • విడుదల తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ: మావోయిస్టులతో లింకుల కేసులో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాను నిర్దోషిగా పేర్కొంటూ బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టేసింది. గత ధర్మాసనం కాకుండా వేరే ధర్మాసనంతో కేసుపై నాలుగు నెలల్లోపు మళ్లీ విచారణ మొదలుపెట్టాలని బాంబే హైకోర్టును ఆదేశించింది. ఈ కేసులో సాయిబాబాను 2014లో పోలీసులు అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం విచారణకు అనుమతి తీసుకోలేదంటూ బాంబే హైకోర్టు ఆక్షేపించింది. కనుక మొత్తం విచారణనే రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. సాయిబాబాను విడుదల చేయాలని గత అక్టోబర్ 14న ఆదేశించింది. ఈ తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

సూడాన్‌లో చిక్కిన మనోళ్లు

సురక్షితంగా రప్పించే యత్నాల్లో భారత్ • ముమ్మర సంప్రదింపులు



ఖార్టూమ్: సూడాన్ సైన్యం, పారామిలటరీ విభాగమైన తక్షణ మద్దతు దళం(ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్)కు మధ్య కొనసాగుతున్న పరస్పర దాడులతో నెలకొన్న కల్లోల పరిస్థితులు అక్కడి భారతీయులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. ఇరు వర్గాల కాల్పులు, బాంబుల మోతతో ఉన్నచోటు నుంచి కనీసం బయటకురాలేక బిక్కుబిక్కుమంటూ సాయం కోసం అర్థిస్తున్నారు. దీంతో దౌత్యమార్గంలో వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. కాల్పుల విరమణకు అమెరికా వంటి దేశాలు పిలుపునిచ్చినా కొద్ది గంటలకే అది విఫలమై గడిచిన 24 గంటల్లోనే మరో 100 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో పరిస్థితి చేయి దాటేలోపే భారతీయులను వెనక్కితీసుకురావాలనే భారత్ కృతనిశ్చయంతో ఉందని భారత విదేశాంగ శాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. కర్ణాటక సంప్రదాయ మూలిక వైద్యం చేసే 31 మంది 'హక్కీ పిక్కీ' గిరిజనులుసహా 60 మంది భారతీయులు సూడాన్‌లో చిక్కుకున్నారని వారి గురించి పట్టించుకోండని ఆ రాష్ట్ర మాజీ సీఎం సిద్ధరామయ్య కోరడం, ఈ విషయాన్ని రాజకీయం చేయొద్దని ఇప్పటికే విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యానించడం తెల్సిందే. సూడాన్ ఘర్షణల్లో ఇప్పటిదాకా దాదాపు 270 మంది ప్రాణాలు కోల్పోయారు. రాజధాని ఖార్టూమ్‌లో జరిగిన కాల్పుల్లో ఒక మాజీ భారతీయ సైనికుడు ఆల్బర్ట్ అగస్టీన్ చనిపోయారు. 1,800 మందికిపైగా గాయాలపాలయ్యారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

అమెరికా, బ్రిటన్, సౌదీ, యూఏఈతో మంతనాలు
సూడాన్‌తో సంబంధాలు నెరుపుతున్న అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలతో భారత విదేశాంగ శాఖ మంతనాలు కొనసాగిస్తోంది. క్షేత్రస్థాయిలో భారతీయుల రక్షణకు సాయపడతామని జైశంకర్‌కు సౌదీ, యూఏఈ విదేశాంగ మంత్రులు హామీ ఇచ్చారు. సూడాన్‌లో భారతీయ ఎంబసీ అక్కడి భారతీయులతో వాట్సాప్ గ్రూప్‌లుసహా పలు మార్గాల్లో టచ్‌లోనే ఉంది. ' మా నాన్న వ్యాపార నిమిత్తం అక్కడికెళ్లి శనివారమే ముంబైకి రావాల్సింది. సూడాన్ ఎయిర్‌పోర్ట్‌లో ఉండగా చివరి నిమిషంలో విమానం రద్దయిందని చెప్పి అక్కడి అధికారులు ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లగొట్టారు. హోటల్‌కు కాలినడకనే వెళ్లారు. ఇప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి ఏంటో తెలీడం లేదు' అని 63 ఏళ్ల వ్యక్తి కూతురు మానసి సేథ్ వాపోయారు. 'అక్కడంతా ఆటవిక రాజ్యమే. ప్రాణాలకు విలువే లేదు. స్వయంగా సైనికులే లూటీ చేస్తూ అపహరణలకు పాల్పడుతున్నారు. ఖర్టూమ్ హోటల్‌లో నా భర్త చిక్కుకుపోయారు. బాంబుల దాడి భయంతో హోటల్‌లోని అతిథులంతా బేస్‌మెంట్‌లో దాక్కున్నారు' అని మరో మహిళ పీటీఐకి చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వీధుల్లో రాకపోకలు కూడా కష్టమేనని భారత విదేశాంగ శాఖ చెబుతోందంటే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఎవరీ హక్కీ పిక్కీలు ?

గుజరాత్ నుంచి శతాబ్దాల క్రితం కర్ణాటకకు హక్కీ పిక్కీ అనే గిరిజన తెగ ప్రజలు వలసవచ్చారు. అడవుల్లో ఉంటూ మూలికా వైద్యం చేస్తారు. వీరికి సొంత భాష 'వగ్రీబూలి'తోపాటు తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం వచ్చు. పేద ఆఫ్రికా దేశం సూడాన్‌లో ఖరీదైన ఇంగ్లిష్ మందులు, వైద్యం పొందగల స్తోమత ఉన్న జనాభా చాలా తక్కువ. అందుకే స్థానికులు చవక వైద్యం వైపు మొగ్గుచూపుతారు. అందుకే వారికి తమ సంప్రదాయ వైద్యం చేసేందుకు సుదూరంలోని సూడాన్‌కు ఈ కర్ణాటక గిరిజనులు చేరుకున్నారు.

ఎందుకీ గొడవ ?

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధాని అబ్దల్లా హమ్దోక్‌ను గత ఏడాది సైన్యం, ఆర్‌ఎస్‌ఎఫ్ గద్దెదించి పాలనను తమ చేతుల్లోకి తీసుకున్నాయి. తాజాగా ఆర్‌ఎస్‌ఎఫ్‌ను సైన్యంలో విలీనం చేయాలని సైన్యాధ్యక్షుడు జనరల్ అబ్దుల్ ఫతాహ్ అల్–బుర్హాన్ ప్రతిపాదించగా ఆర్‌ఎస్‌ఎఫ్ చీఫ్ జనరల్ మొహమ్మద్ హమ్దాన్ దగాలో తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఇరు సాయుధ విభాగాల మధ్య అగ్గి రాజుకుంది.

150 ఏళ్ల క్రితమే సూడాన్‌కు వలసలు
ప్రస్తుతం సూడాన్‌లో దాదాపు 4,000 మంది భారతీయులున్నారు. వీరిలో 1,200 మంది శాశ్వత స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరి కుటుంబాలు 150 ఏళ్ల క్రితమే అక్కడికి వలసవెళ్లాయి. ఇక మిగతావారు సూడాన్ ఆర్థిక రంగం వంటి పలు వృత్తుల్లో ఉద్యోగాల కోసం వెళ్లారు. కొందరు ఐక్యరాజ్యసమితి కార్యక్రమాలు, అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్నారు.



ఫెన్సింగ్ దాటుకుని వైట్‌హౌస్‌లోకి ప్రవేశించిన చిన్నారిని ఎత్తుకుని తీసుకొస్తున్న యూఎస్ సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు. అత్యంత పకడ్బందీగా ఉంటుందని భావించే ఫెన్సింగ్ గుండా ఆ బాలుడు సునాయాసంగా దూరాడట. కాసేపు కలకలం అనంతరం బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉక్రెయిన్ చేతికి 'పేట్రియాట్'


కీవ్: అమెరికా అత్యాధునిక పేట్రియాట్ గైడెడ్ క్షిపణి వ్యవస్థ ఉక్రెయిన్ చేతికొచ్చింది. దీంతో రష్యా యుద్ధమూకలను మరింత దీటుగా ఎదుర్కొంటామని ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఒలెక్సీ రెజ్నికోవ్ బుధవారం ట్వీట్‌చేశారు. 'భూతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే పేట్రియాట్ క్షిపణి వ్యవస్థ రాకతో మా గగనతలానికి మరింత రక్షణ చేకూరింది' అని ఆయన అన్నారు. శత్రు సేనల నుంచి దూసుకొచ్చే క్షిపణులు, స్వల్ప శ్రేణి బాలిస్టిక్ మిస్సైళ్లను ఈ వ్యవస్థతో కూల్చేయొచ్చు. క్రూయిజ్ క్షిపణులు, స్వల్ప శ్రేణి మిస్సైళ్లతోనే ఉక్రెయిన్ పౌర మౌలిక వసతులు ముఖ్యంగా విద్యుత్ సరఫరా వ్యవస్థలను రష్యా ధ్వంసం చేస్తున్న విషయం విదితమే. అందుకే జనావాసాలు, మౌలిక వసతుల రక్షణ కోసం కొంతకాలంగా పేట్రియాట్ సిస్టమ్స్ సరఫరా చేయాలని అమెరికాను ఉక్రెయిన్ కోరుతోంది. ఇన్నాళ్లకు అవి ఉక్రెయిన్ చేతికొచ్చాయి.



అలస్కా మీదుగా ఆకాశంలో కన్పించిన వింత వలయమిది. స్పేస్ ఎక్స్ రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లే క్రమంలో ఆకాశంలో అత్యంత ఎత్తులో వదిలేసిన అదనపు ఇంధనం గడ్డకట్టి ఇలా అందమైన వింత వలయంగా ఆకృతి దాల్చిందని సైంటిస్టులు వివరించారు.

శిగ్గావ్‌లో బొమ్మై.. వరుణ నుంచి సిద్ధు

కర్ణాటకలో జోరందుకున్న నామినేషన్ల పర్వం



నామినేషన్ వేస్తున్న సీఎం బొమ్మై. చిత్రంలో నడ్డా, సినీ నటుడు సుదీప్

శిగ్గావ్/మైసూరు: కర్ణాటకలో అభ్యర్థుల నామినేషన్ల పర్వం ఊపందుకుంది. శిగ్గావ్ నియోజకవర్గ నుంచి సీఎం బసవరాజ్ బొమ్మై, వరుణ నుంచి మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య బుధవారం నామినేషన్లు వేశారు. బొమ్మై వెంట బీజేపీ చీఫ్ జేపీ నడ్డాతో పాటు ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ కూడా ఉన్నారు. ఇవే తన చివరి ఎన్నికలని సిద్ధరామయ్య చెప్పారు. ఇక బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం జగదీష్ శెట్టార్ కూడా హుబ్బళిలో నామినేషన్ వేశారు.

బీజేపీ స్టార్ క్యాంపెయినర్ జాబితాలో మోదీ, కేంద్ర మంత్రులు
కర్నాటకలో బీజేపీ 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితా విడుదల చేసింది. ప్రధాని మోదీ, పార్టీ చీఫ్ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, గడ్కరీ, నిర్మలా సీతారామన్, స్మృతీ ఇరానీ, ధర్మేంద్ర ప్రధాన్, మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషి, యూపీ, మధ్యప్రదేశ్, అసోం సీఎంలు యోగి ఆదిత్యనాథ్, శివరాజ్‌సింగ్, హిమంత బిశ్వ శర్మ తదితరులు ఇందులో ఉన్నారు.

కరోనాతో డయాబెటిస్ ముప్పు ..!

లండన్: కరోనా సోకిన వారికి డయాబెటిస్ ముప్పు అధికమని బ్రిటిష్ కొలంబియా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, వేన్‌కవర్‌లోని సెయింట్ పాల్ ఆస్పత్రి అధ్యయనంలో వెల్లడైంది. 20లో ఒక డయాబెటిస్ కేసుకు కరోనా కారణమని తేలింది. కరోనా పాజిటివ్ వచ్చి కోలుకున్న 6,29,935 మందిని తర్వాత కాలంలో వచ్చిన వ్యాధులపై అధ్యయనం చేశారు. కరోనా కారణంగా చక్కెర వ్యాధిగ్రస్తులు 3 నుంచి 5% పెరుగుతున్నట్టుగా అధ్యయనంలో వెల్లడైంది. కొత్తగా ప్రతీ 100 మంది మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 3–5% కేసులకు కరోనాతో సంబంధముందని బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నవీద్ జన్‌జువా చెప్పారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



బౌరంపేట్‌లో పులి వీడియో కలకలం
బౌరంపేట్‌లో పులి సంచారం స్థానికంగా కలకలం రేపింది. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ ఓఆర్ఆర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇది సంచరించినట్లు వదంతులు వచ్చాయి. -8లో



మన నగరం ఓ మినీ భారత్
హైదరాబాద్ నగరంలో అన్ని దేశాల, మతాల, కులాల ప్రజలు కలిసి జీవిస్తారని, ఇదొక మినీ భారత్ అని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. -8లో

ఓయూ ఫౌండేషన్ డేకు రాకేష్‌శర్మ
ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 26న జరిగే ఓయూ ఫౌండేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాకేష్ శర్మ హాజరు కానున్నారు. 1984 ఏప్రిల్ 3న చంద్రగ్రహణంపై తొలిసారి అడుగిడిన రాకేష్ శర్మ ఓయూకి రావడం ఇదే ప్రథమం. 26న జరిగే ఫౌండేషన్ సందర్భంగా ఈ నెల 24న మార్నింగ్ వాక్, 25న ఓపెన్ డే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



రంజాన్ హుషార్.. రాత్ బజార్



ఇంటి అలంకరణ వస్తువులు.. జానీ మాజ్‌లు.. సుర్మా.. అత్తరు పరిమళాలు.. కళకళలాడే గాజుల దుకాణాలు.. వస్త్రాల నుంచి పాదరక్షల దాకా విక్రయాలు.. సాయంత్రం 4 నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు పాతబస్తీలోని రాత్ బజార్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతోంది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని షాపింగ్ ధగధగలు ఆకట్టుకుంటున్నాయి. ఈ పండుగ సందర్భంగా ముస్లింలు వివిధ నూతన వస్తువుల కొనుగోళ్లకు ప్రాధాన్యమిస్తారు. ప్రధానంగా లాడ్‌బజార్‌లో ముచ్చటగొలిపే రంగురంగుల గాజులను ముస్లిం మహిళలు ఖరీదు చేస్తున్నారు. రంజాన్ మాసం ముగియడానికి ఇంకా రెండు రోజులే ఉండడంతో వినియోగదారులతో దుకాణాలన్నీ కిక్కిరిసి కనిపిస్తున్నాయి.
- సాక్షి, సిటీబ్యూరో



న్యూస్‌రీల్

కాలేయాన్ని కాపాడుకుంటే సంపూర్ణ ఆరోగ్యం



సైక్లథాన్‌ను ప్రారంభిస్తున్న రియాజ్ ఖాన్

లక్డీకాపూల్: కాలేయం బాగుంటేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు అని గ్లెనిగల్ గ్లోబల్ హాస్పిటల్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ చందన్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం లివర్ డే సందర్భంగా వాకథాన్‌తో పాటు సైక్లథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ అవార్డీ, ఆడియో ఇంజినీర్ డాక్టర్ సజీదాఖాన్, ఆస్పత్రి సీఈఓ రియాజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ మాట్లాడుతూ.. మద్యపానానికి దూరంగా ఉండి జీవనశైలిని మార్చుకుంటే లివర్‌ను కాపాడుకోవచ్చన్నారు. ప్రతిరోజూ 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని హాస్పిటల్ సీఈఓ రియాజ్ ఖాన్ సూచించారు.

రూ.12 కోట్లతో 5 చెరువుల డ్రైనేజీ మళ్లింపు

- పరిపాలన అనుమతులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని వివిధ చెరువుల ప్రక్షాళన కార్యక్రమాల్లో భాగంగా తాజాగా అయిదు చెరువుల డ్రైనేజీ మళ్లింపు పనులు చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. అందుకు అవసరమయ్యే దాదాపు రూ.12 కోట్ల పరిపాలన అనుమతులకు బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. డ్రైనేజీ మళ్లింపు చేయనున్న ఈ చెరువుల్లో గాజులరామారం మండలం లోని చింతల్‌చెరువు, మద్దెలకుంట చెరువు, బండచెరువు, కుత్బుల్లాపూర్ మండలంలోని లాల్‌సాబ్‌గూడ రామన్న చెరువు, శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలోని పీకాక్‌లేక్‌లున్నాయి. వీటితో పాటు మరో ఆరు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన వాటిల్లో ఖైరతాబాద్ జోన్‌లో రూ.41 కోట్లతో నిర్మించ తలపెట్టిన 14 థీమ్‌పార్కుల్లో మూడింటికి ఎంపిక చేసిన ప్రాంతాలు అనుకూలంగా లేనందున వాటిని ఇతర స్థలాల్లో ఏర్పాటు చేయడం,ఫలక్‌నుమా జూనియర్ కళాశాల ప్రాంగణంలో రూ. 5.95కోట్లతో పెవిలియన్, ఇండోర్‌స్పోర్ట్స్ భవన నిర్మాణం,తదితరమైనవి ఉన్నాయి.సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. కమిషనర్ లోకేశ్‌కుమార్, అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గార్డెన్ ఫెస్టివల్‌లో బల్దియాకు 19 అవార్డులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇటీవల నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, మొదటి అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్ -2023లో జీహెచ్ఎంసీకి 19 అవార్డులు లభించాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఎల్బీనగర్ జోన్‌కు 14 అవార్డులు, కూకట్‌పల్లి జోన్‌కు 3 అవార్డులు, ఖైరతాబాద్‌కు 2 అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో యూబీడీ అడిషనల్ కమిషనర్ కృష్ణ, ఖైరతాబాద్ జోన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



త'స్మార్ట్' జాగ్రత్త!

'మొబైల్'లో మరో కోణం
- హస్తభూషణంగా మారిన సెల్‌ఫోన్
- సైబర్ నేరాలకు ఇదే ప్రధాన ఆధారం
- వంచకులకూ కలిసి వస్తున్న పరిజ్ఞానం
- 'ఎండ్స్'తో పాటే ముప్పు పెరుగుదల
- అప్రమత్తత అవసరమంటున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ ప్రపంచంలో అనేక నేరాలకు సెల్‌ఫోనే కారణమవుతోంది.. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ లేనిదే రోజు గడవని పరిస్థితులు నెలకొన్నాయి. మొబైల్స్‌లో పెరుగుతున్న టెక్నాలజీతో పాటు దాని సంబంధిత నేరాలు పెరుగుతూ వచ్చాయి. వ్యక్తిగత సమాచారంగా భావించే సెల్‌ఫోన్ నంబర్లకు గోప్యత లేకపోవడం, పిల్లలపై కొరవడిన తల్లిదండ్రుల పర్యవేక్షణ, నానాటికీ తెలివి మీరుతున్న నేరగాళ్ల ఫోన్ ఆధారిత నేరాలు పెరగడానికి కారణమవుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

అత్యధికం 'ఫోన్'తోనే ప్రారంభం...

దేశ వ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాల్లో అత్యధికం బాధితుల ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని ప్రారంభమవుతున్నవే. సంక్షిప్త సందేశం పంపడం, కాల్ చేయడంతోనే నేరగాళ్లు వీటికి శ్రీకారం చుడుతున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే 60 శాతం సైబర్ నేరాలకు ఫోనే మూలం అవుతోందని సైబర్ క్రైమ్ అధికారులు చెబుతున్నారు.

'ఎండ్' పెరిగే కొద్దీ ముప్పే...

ఆండ్రాయిడ్, విండోస్ ఇలా వివిధ రకాలైన హైఎండ్ టెక్నాలజీ సెల్‌ఫోన్లలోకి అందుబాటులోకి రావడంతో 'ఎండ్' పెరిగే కొద్దీ అందులో సదుపాయాలతో పాటు హ్యాకింగ్ ముప్పూ ఎక్కువైంది.

వీటికి ఏదో ఒక రూపంలో సైబర్ నేరగాళ్లు 'ర్యాట్స్' (రిమోట్ యాక్సెస్ ట్రోజన్స్) పంపిస్తున్నారు. వీటిని ఓపెన్ చేస్తే చాలు మన ఫోన్ వారి అధీనంలోకి వెళ్లిపోతోంది.

'ట్రూ కాలర్' పూర్తి స్థాయిలో 'ట్రూ' కాదు...
'ట్రూ కాలర్' యాప్‌లో వచ్చే వివరాలు సైతం పూర్తి స్థాయిలో నమ్మదగ్గవి కాదని సైబర్ క్రైమ్ పోలీసులు వివరిస్తున్నారు. దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో సదరు వ్యక్తి ఏ పేరు నమోదు చేస్తే... అతడు కాల్ చేసిన వారికి అదే పేరు డిస్‌ప్లే అవుతుందని చెబుతున్నారు. వాట్సాప్ డీపీ ఫొటోలు చూసి అవతలి వ్యక్తి ఫలానా అని నమ్మకూడదని స్పష్టం చేస్తున్నారు.

'ప్రీ-పెయిడ్' నంబర్లు శాశ్వతం కాదు..
వినియోగంలో ఉన్న సెల్‌ఫోన్ నంబర్లలో అత్యధికంగా ప్రీ-పెయిడ్ కేటగిరీకి చెందినవే. వీటి 'మార్పిడి' విషయం తెలియక కొందరు చిక్కుల్లో పడుతున్నారు. పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే లావాదేవీల్లోనూ ఈ 'పాత నంబర్ల'తో ఇబ్బందులు ఎక్కువగా వస్తున్నాయి.

ఫోన్లలో వాట్సాప్, ఫేస్‌బుక్‌లు వచ్చాక...

సెల్‌ఫోన్లలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చాక ఎంత ఉపయోగం ఉందో... అదే స్థాయిలో చేటు చేకూరుతోంది. టీనేజర్లకూ తల్లిదండ్రులు హైఎండ్ ఫోన్లు అందిస్తుండటంతో వాటి ద్వారా ఈ అప్లికేషన్లను యాక్సస్ చేస్తూ పెడదారులు పడుతున్నారు. అపరిపక్వ ప్రేమాయణాలు, అశ్లీలానికి బానిసలు కావడం, సైబర్ వేధింపులకు గురి కావాల్సివస్తోంది.

భాషపై పట్టునూ కోల్పోతున్నారు

సెల్‌ఫోన్ ఎస్సెమ్మెస్‌లు, చాటింగ్ కారణంగా యువత ఆంగ్ల భాషను సక్రమంగా రాసే పరిజ్ఞానాన్నీ కోల్పోతోంది. ఓ పదంలో ఉండే అక్షరాలను తగ్గిస్తూ దాన్ని రాయడాన్ని 'రిబస్' అంటాం. ప్రస్తుతం ఎస్సెమ్మెస్, చాటింగ్స్‌లో ఇలాంటివే వినియోగిస్తున్నారు. ఇప్పటికే గడియారం, రేడియో, కంప్యూటర్లను రీప్లేస్ చేస్తున్న సెల్‌ఫోన్ భాషను రీప్లేస్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.
– ఎస్.ప్రతాప్ రాజు, ప్రొఫెసర్



కట్టడమే కాదు.. కలిగిన మేలూ చెబుతాం

- ఫ్లై ఓవర్లు, లింక్‌రోడ్లు తదితరాలు
- వరంగల్ 'నిట్'తో అధ్యయనం
- రూ.2.2 కోట్లు వెచ్చించనున్న బల్దియా


సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలో గడచిన ఆరేడేళ్లలో ఎస్సార్‌డీపీ కింద ఎన్నో ఫ్లైఓవర్లు, గ్రేడ్ సెపరేటర్లు, లింక్‌రోడ్లు నిర్మించారు. వీటితో పాటు ప్రధాన రహదారుల మార్గాల్లో 700 కి.మీ పైగా రోడ్ల నిర్వహణను సీఆర్ఎంపీ పేరిట ప్రైవేటు ఏజెన్సీల కప్పగించారు. వేల కోట్ల రూపాయిలతో చేపట్టిన ఈ పనుల వల్ల నగర ప్రజలకు ఎంతో సదుపాయం కలిగిందని భావిస్తోన్న ప్రభుత్వం అదే విషయాన్ని శాస్త్రీయంగానూ అధ్యయనం చేయించి ప్రజలకు వెల్లడించాలని భావించింది. గత సంవత్సరం కొన్ని ఫ్లైఓవర్లతో కలిగిన ప్రయోజనాలు అధ్యయనం చేసే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ.. పనులు ముందుకు సాగలేదు. తిరిగి ఇటీవల మళ్లీ వాటిపై దృష్టి సారించింది. ఈసారి ప్రైవేటు ఏజెన్సీలకు కాకుండా పేరెన్నికగన్న ఇంజినీరింగ్ విద్యాసంస్థల ద్వారా శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని భావించింది. అందుకుగాను వరంగల్ 'నిట్'ను ఎంపిక చేసింది.

నిట్‌తో ఒప్పందం..
పూర్తయిన ఫ్లై ఓవర్లలో 30 ఫ్లై ఓవర్లతోపాటు 8 లింక్‌రోడ్లు, సీఆర్ఎంపీ మార్గాల్లో పది మేజర్ కారిడార్లలో మారిన పరిస్థితుల్ని ప్రజలకు కలిగిన లాభాల్ని అధ్యయనం చేయించేందుకు నిట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అందుకుగాను రూ. 2.20 కోట్లు చెల్లించనుంది. ఆర్నెళ్లలోనే నివేదిక నందజేయాల్సిందిగా కోరినప్పటికీ, ఆ సమయం సరిపోదని, తొమ్మిదినెలల గడువును నిట్ కోరినట్లు తెలిసింది. అందుకు సమ్మతిస్తూ జీహెచ్ఎంసీ అధికారులు అధ్యయన బాధ్యతలు అప్పగించారు.

ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలు సైతం..
కలిగిన లాభాలంటే కేవలం రవాణాకే పరిమితం కాకుండా రవాణా సదుపాయం మెరుగుపడినందున తద్వారా తగ్గిన ఇంధన వ్యయం, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాహనాలు ఆగే పరిస్థితి లేనందున వాహనాల పొగ కమ్ముకోకుండా కలిగిన పర్యావరణ ప్రయోజనం.. తద్వారా ఆరోగ్య సమస్యలు తగ్గడం.. ఇలా వివిధ రూపాల్లో ఎలాంటి లాభం కలిగిందో వివిధ అంశాల వారీగా నిట్ నియమించే బృందం అధ్యయనం చేసి నివేదికను అందజేయనుంది. పనులు చేయడంతో పాటు వాటిని వివరించడం ద్వారా రాబోయే ఎన్నికల్లోనూ ఉపకరిస్తుందనే తలంపుతో ప్రభుత్వం ఇందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అధ్యయనంలో భాగంగా ట్రాఫిక్ సర్వేతోపాటు తమకు కలిగిన మేలు గురించి వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలనూ సేకరిస్తారు.

భానుడి సెగలు

41 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- విలవిల్లాడుతున్న నగరవాసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సూర్యుడు సెగలు కక్కుతున్నాడు. ఎండలు దడ పుట్టిస్తున్నాయి. భానుడి భగభగను తట్టుకోలేక జనం విలవిల్లాడుతున్నారు. పగటిపూట పనుల నిమిత్తం బయటికెళ్లాలంటే భయపడుతున్నారు. గత రెండురోజులుగా ఉష్ణతాపం తీవ్ర రూపం దాల్చుతోంది. సాధారణ ఉష్ణోగ్రత 38.6 డిగ్రీలు కాగా.. పలు ప్రాంతాల్లో అదనంగా మూడు డిగ్రీలు దాటింది. బుధవారం నగరంలోని మల్కాజిగిరి అడ్డగుట్టలో గరిష్ట ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలుగా నమోదైంది. ఉప్పల్‌లో 41.1, బీహెచ్ఈఎల్ 41.0, ఖైరతాబాద్ 40.9, గచ్చిబౌలి 40.8, షేక్‌పేట 40.7, కుత్బుల్లాపూర్ 40.3, తిరుమలగిరి, ఆసిఫ్‌నగర్ 40.2, రెడ్‌హిల్స్ 40.1, రామంతాపూర్ 40, సైదాబాద్, టోలిచౌకి, అంబర్‌పేట, ఆస్మాన్‌గఢ్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్‌లలో 39.9. డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న మూడ్రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

సైకిల్ ట్రాక్ రెడీ



వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధం
- అంతర్జాతీయ ప్రమాణాలతో 23 కి.మీ ట్రాక్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సైకిల్ ట్రాక్ నిర్మాణం పూర్తయింది. ట్రాక్‌పై ఏర్పాటు చేయనున్న సోలార్ రూఫ్ టాప్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో ఈ పనులు కూడా పూర్తయితే మే నెలలోనే ట్రాక్‌ను ప్రారంభించనున్నారు. ఈ మేరకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. దేశంలోనే మొట్టమొదటి అధునాతన సైకిలింగ్ ట్రాక్ ఇది. ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని 23 కి.మీ మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిలింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును రెండు మార్గాల్లో.. నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కి.మీ, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కి.మీ మార్గంలో చేపట్టారు. 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్‌లలో ట్రాక్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

అన్ని సదుపాయాలతో...
సైకిలింగ్ ట్రాక్‌లో సైకిళ్లపై పరుగులు తీయడం కేవలం ఒక వ్యాయమ ప్రక్రియగానే కాకుండా ఒక విహారంలాంటి అనుభూతిని కలిగించేవిధంగా అందంగా తీర్చిదిద్దారు. ట్రాక్ పొడవునా అక్కడక్కడా రెస్ట్‌రూమ్‌లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు ఉంటాయి. సైకిళ్లను ఇక్కడే అద్దెకు తీసుకోవచ్చు. సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేసి ఇస్తారు. ట్రాక్ పొడవునా తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఉంటాయి. భద్రత దృష్ట్యా ట్రాక్ పొడవునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సౌర విద్యుత్ వినియోగం..
ట్రాక్‌పై కప్పును ప్రస్తుతం సౌరఫలకలతో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను ట్రాక్ అవసరాలకు వినియోగించనున్నారు. లైట్లు తదితర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఈ ఏప్రిల్‌లోనే ప్రారంభించాలని భావించినప్పటికీ కొద్దిగా ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు.

చుట్టేయడానికి వచ్చేస్తున్నాయ్!

మరో 3 డబుల్ డెక్కర్ బస్సులు
- మొత్తం 6 సర్వీసులు అందుబాటులోకి
- 80 శాతం రూట్ సర్వే పూర్తి
- త్వరలోనే హెచ్ఎండీఏ పర్యాటక సేవలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఫార్ములా ఈ-పోటీల సందర్భంగా మెరుపులా మెరిసి మాయమైన డబుల్ డెక్కర్ బస్సులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఫిబ్రవరి నెలలో మూడు బస్సులను ప్రవేశపెట్టగా తాజాగా మరో 3 బస్సులు వచ్చాయి. నగరంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అనుగుణంగా డబుల్ డెక్కర్ బస్సులను నడపనున్నట్లు హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ తాజాగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం 6 బస్సులు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పాతబస్తీ తదితర ప్రాంతాల మీదుగా ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు.

దశలవారీగా 30 బస్సులు..
- నగర చారిత్రక వారసత్వానికి పూర్వ వైభవంలా ఒకనాటి సిటీ డబుల్ డెక్కర్ బస్సులను తలపించేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మళ్లీ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దశలవారీగా 30 బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. అంతర్జాతీయ ఫార్ములా ఈ-పోటీల సందర్భంగా 3 బస్సులను ప్రారంభించారు. మార్చి మొదటి వారంలోనే మరో 3 బస్సులు రానున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత బస్సులను కొద్ది రోజుల పాటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో తిప్పారు. ఆ తర్వాత రూట్ సర్వే పేరుతో వాటిని పార్కింగ్ యార్డ్‌కు తరలించారు. డబుల్ డెక్కర్ బస్సుల రాకపోకలకు అనువైన మార్గాల కోసం సర్వే చేపట్టారు. ప్రస్తుతం సర్వే 80 శాతం పూర్తయిందని, తుది దశకు చేరుకుందని హెచ్ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు.
- మరో వారం రోజుల్లోనే డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. అటు హైదరాబాద్ హైటెక్ హంగులను, ఇటు పాతబస్తీ పురాతన వైభవాన్ని సందర్శించేలా రూట్‌ల ఎంపిక నిర్వహణ ఉండనుంది. చార్మినార్, గోల్కొండ వంటి చారిత్రక కట్టడాలను సందర్శించేందుకు అవకాశం లభిస్తుంది. మరోవైపు 125 అడుగులు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పరిసరాలు ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా మారాయి. ఈ ప్రాంతంలో ఒక సర్క్యూట్ రూట్‌లో డబుల్ డెక్కర్‌లు చక్కర్లు కొట్టనున్నాయి.

90 కి.మీ.. 106 సర్వీసులు

- కొత్తరూట్లతో పెరిగిన ఎంఎంటీఎస్ రైళ్లు
- మేడ్చల్-సికింద్రాబాద్, ఉందానగర్-లింగంపల్లి మధ్య మొదలైన ప్రయాణికుల రాకపోకలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఎంఎంటీఎస్ నెట్‌వర్క్ విస్తరించుకుంది. గతంలో 48 కిలోమీటర్లు మాత్రమే రాకపోకలు సాగించగా, ఇప్పుడు 90 కి.మీ వరకు ఎంఎంటీఎస్ కనెక్టివిటీ పెరిగింది. కొత్తగా ప్రారంభించిన సికింద్రాబాద్ – మేడ్చల్, ఉందానగర్ – ఫలక్‌నుమాలతో నెట్‌వర్క్ పెరిగినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ మేరకు ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసుల సంఖ్య కూడా 106కు చేరింది. సికింద్రాబాద్-మేడ్చల్ మధ్య 20 ఎంఎంటీఎస్‌లను ప్రవేశపెట్టారు. మల్కాజిగిరి, దయానంద్ నగర్, సఫిల్‌గూడ, రామకృష్ణాపురం, అమ్ముగూడ, కేవలరి బరాక్స్, అల్వాల్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి తదితర స్టేషన్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వరకు కేవలం రూ.15తో చేరుకోవచ్చు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు లింగంపల్లి నుంచి ఉందానగర్ వరకు వెళ్లి అక్కడి నుంచి క్యాబ్‌లో వెళ్లేందుకు అవకాశం ఉంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతి 45 నిమిషాలకు, గంటకు ఒకటి చొప్పున రైళ్లు అందుబాటులో ఉంటాయి. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం 6.05 గంటల నుంచి సర్వీసులు ప్రారంభమవుతాయి. ఆఖరు సర్వీసు రాత్రి 11.10 గంటలకు బయలుదేరుతుంది. లింగంపల్లి – ఉందానగర్ మధ్య ఉదయం 5.50 నుంచి రాత్రి 10.10 వరకు రాకపోకలు సాగిస్తాయి.

ఎనీటైం ఎక్కడ?



మలక్‌పేటలో నిరుపయోగంగా మారిన వాటర్ ఏటీఎం



జీహెచ్‌ఎంసీ అలా..


వాటర్‌వర్క్స్ ఇలా..

- వెక్కిరిస్తున్న వాటర్ ఏటీఎంలు • గొంతు తడుపుతున్న సేవా కేంద్రాలు

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన వాటర్ ఏటీఎంలు నీళ్లు లేకుండా వెక్కిరిస్తుండగా.. పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాటు చేసిన వేసవి నీటికేంద్రాలు ప్రజల దాహాన్ని తీరుస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం వాటర్ ఏటీఎంల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన, మినరల్స్‌తో కూడిన తాగునీటిని తక్కువ ధరలకు అందజేస్తామన్న కంపెనీల మాటలు నమ్మి వాటర్ ఏటీఎంలు ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీ వాటికి స్థలాలు అప్పగించింది. ఒప్పందం మేరకు జీహెచ్‌ఎంసీ ఒక్కో వాటర్ ఏటీఎంకు 300 చదరపు అడుగుల స్థలాన్ని అప్పగించగా, జలమండలి నీటిని మినరల్ వాటర్‌గా మార్చి ప్రజల దాహార్తి తీరుస్తామన్న కంపెనీల మాటలు అమలు కావడంలేదు. సరికదా.. అసలు తాగునీరే లేక వాటర్ ఏటీఎంలు వెక్కిరిస్తున్నాయి. ఇది ఒకవైపు దృశ్యమైతే.. మరోవైపు పలు సంస్థలు, దాతలు ప్రజల కోసం కుండల్లో నీటిని నింపి, మండుతున్న ఎండల్లో ప్రజలకు చల్లని నీటిని అందిస్తున్నాయి. మాటల కోటలు ఒకరివైతే.. గొంతు తడుపుతున్న సేవలు మరొకరివి.


ఎస్సార్‌నగర్‌లో...


అమీర్‌పేటలో..
స్వచ్ఛందం భళా!

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల్లో జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒడ్డెన్న హెచ్చరించారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలతో బుధవారం నగరంలోని నల్లకుంటలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. నిబంధనలను ఉల్లంఘించి వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నందుకు కళాశాల యాజమాన్యానికి నోటీసు జారీ చేశారు. జూనియర్ కళాశాలలకు ఏప్రిల్ ఒకటి నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు చెప్పారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతుల పేరుతో కళాశాలల యాజమాన్యాలు ఎలాంటి తరగతులు నిర్వహించరాదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా గుర్తించాలన్నారు.

చినజీయర్ స్వామికి ఘన స్వాగతం


ముచ్చింతల్‌లోని దివ్య సాకేతాలయం ఆవరణలో మాతృమూర్తి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి


శంషాబాద్ రూరల్: పద్మభూషణ్ అవార్డు గ్రహీత శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామికి భక్తులు ఘనస్వాగతం పలికారు. ఢిల్లీలో అవార్డు తీసుకున్న తర్వాత ఆయన శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న ఆశ్రమానికి మొదటిసారి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆశ్రమం వరకు ర్యాలీ నిర్వహించారు. పూలమాలలతో ఆయనను వాహనంపై ఆశ్రమం వరకు ఊరేగించారు. ఆశ్రమంలో సమతామూర్తిని దర్శించుకున్న చినజీయర్‌స్వామి అక్కడ ఉన్న ఆయన మాతృమూర్తి విగ్రహానికి మాలసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, శ్రీత్రిదండి అహోబిల జీయర్‌స్వామి, శ్రీ వేదనాథ జీయర్‌స్వామి పాల్గొన్నారు.

ఆగిన కారును స్టార్ట్ చేస్తానని... కారుతో ఉడాయించిన ఘనుడు

బన్సీలాల్‌పేట్: రోడ్డుపై సడన్‌గా ఆగిన కారును స్టార్ట్ చేస్తానంటూ నమ్మించి కారుతో ఉడాయించాడు ఓ గుర్తు తెలియని వ్యక్తి. ఈ సంఘటన మంగళవారం రాత్రి గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ మోహన్ రావు కథనం ప్రకారం...శంషాబాద్ నివాసి భూక్య నరేష్ టీఎస్13యూబీ-0118 నెంబర్‌గల స్విఫ్ట్ కారు నడుపుకుంటూ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం శంషాబాద్ నుంచి సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ వరకు ఓ మహిళ నరేష్ కారు బుక్ చేసుకొని వచ్చింది. అయితే ఆమెను జూబ్లీ బస్సు స్టేషన్‌లో దించి వస్తుండగా నరేష్ కారు కవాడిగూడ చౌరస్తా సమీపంలోని మారియట్ హోటల్ వద్ద రోడ్డుపై ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాలేదు. దీంతో డ్రైవర్ నరేష్ సమీపంలోని పెట్రోల్ బంకుకు వెళ్లి డీజిల్ తీసుకువచ్చి పోసినా కారు స్టార్ట్ కాలేదు. అయితే అటుగా వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి కారు స్టార్ట్ చేస్తానంటూ డ్రైవర్ సీటులో కూర్చున్నాడు. నరేష్‌ను వెనుక నుంచి కారు తోయాలంటూ పురమాయించి డ్రైవర్ సీటులో కూర్చొని డ్రైవ్ చేయగా కారు స్టార్ట్ అయ్యింది. అయితే కారు వెనుకకు తీస్తున్నట్లు నటించి కారుతో ఉడాయించాడు. తన కళ్ల ముందే కారుతో ఉడాయిస్తుండగా డ్రైవర్ కేకలు వేశాడు. లాభం లేకపోవడంతో గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంలో స్ఫూర్తి దాతలు

మరణానంతరం శరీరదానం చేయాలని తల్లీ కొడుకుల నిర్ణయం


సాయికృష్ణ


లతాంబర్ రావు


లక్ష్మి

బంజారాహిల్స్: సమాజహితం కోరి తమ మరణానంతరం భవిష్యత్ వైద్య రంగ పరిశోధనల కోసం ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు తమ శరీరాలను దానం చేస్తూ అంగీకార పత్రాలను అందజేశారు. మరణానంతరం తమ శరీరాలు కాలి బూడిదయ్యేకంటే వైద్య రంగ పరిశోధనల కోసం ఉపయోగపడాలని మేలని భావించిన వీరు ఈ బృహత్తర నిర్ణయాన్ని తీసుకోవడమే కాకుండా మరణానంతరం తమ శరీరాలను దానం చేస్తూ హైదరాబాద్‌కు చెందిన అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘానికి రిజిస్టర్ పోస్టు ద్వారా అంగీకార పత్రాలను అందజేశారు. నిర్మల్‌కు చెందిన ఉలిసె లక్ష్మి(78) ఆమె పెద్ద కొడుకు టీచర్ ఉలిసె లతాంబర్‌రావు(55), రెండో కొడుకు నిర్మల్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఉలిసె సాయికృష్ణ(53)లు తాము బతికుండగానే ఈ సమాజహిత నిర్ణయం తీసుకున్నారు. తమ మరణానంతరం శరీరాలను వైద్య కళాశాలకు దానం చేయాలని కోరారు. తల్లి, కొడుకులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సర్వత్రా హర్షిస్తున్నారు. వీరు మరింత మందికి స్ఫూర్తిదాతగా నిలుస్తారని అమ్మ నేత్ర అవయవదాన శరీర ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం తెలిపారు. వీరిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. శరీరాలను దానం చేస్తూ రిజిష్టర్ పోస్ట్ చేయడం కూడా ప్రత్యేకతగా చెప్పారు.

5 నుంచి సమ్మర్ కార్నివాల్


సమ్మర్ కార్నివాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: వేసవి సెలవుల్లో పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి..అందులో వారికి శిక్షణ ఇవ్వడమే కాకుండా అక్కడే వివిధ రకాల గేమ్స్, స్విమ్మింగ్ పూల్ అన్ని సౌకర్యాలు కల్పిస్తూ సమ్మర్ కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండస్ గ్లోబల్ హాస్పిటాలిటీ, సిరి నేచర్ వాలీ రిసార్ట్స్ సంస్థల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు కుండల యాదగిరి, బాబురావు తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ప్రతిభ ఉండి నేర్చుకోవాలనే ఉత్సాహం ఉన్న పేద విద్యార్థులకు పూర్తి ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్ మే 5 నుంచి జూన్ 4వ తేదీ వరకు నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఇందులో అన్ని రకాల స్పోర్ట్స్, సింగింగ్, డ్యాన్సింగ్, అడ్వెంచర్స్ ఉంటాయని తెలిపారు. ఉదయం 10 నుండి రాత్రి 7 గంటల వరకు రోజూ క్యాంప్ కొనసాగుతుందని, నాణ్యమైన, పౌష్టిక ఆహారం కూడా అందిస్తామన్నారు.

మన నగరం ఓ మినీ భారత్: ఎంపీ రంజిత్‌రెడ్డి


ఇఫ్తార్ విందులో రంజిత్‌రెడ్డికి ఖర్జూర తినిపిస్తున్న ఎంపీ అసదుద్దీన్

రాజేంద్రనగర్: హైదరాబాద్ నగరంలో అన్ని దేశాల, మతాల, కులాల ప్రజలు కలిసి జీవిస్తారని, ఇదొక మినీ భారత్ అని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ జీ.రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని హెచ్‌ఎఫ్ కన్వెన్షన్ హాల్‌లో స్థానిక మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ విందులో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా షాదీముబాకర్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారన్నారు. తెలంగాణ ప్రజల్లో మతసామరస్యం ఎక్కువని, ఇది భవిష్యత్‌లోనూ కొనసాగాలని కోరారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

బౌరంపేటలో పులి వీడియో కలకలం!


అటవీ శాఖ అధికారులు సేకరించిన పాద ముద్రికలు

దుండిగల్: బౌరంపేట్‌లో పులి సంచారం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరించినట్లు వదంతులు వచ్చాయి. ఇదే విషయంపై స్థానికులతో పాటు పలువురు ఒక నిమిషం 41 సెకండ్ల నిడివి గల వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో స్థానిక బౌరంపేటతో పాటు చుట్టు పక్కల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సూరారం సెక్షన్ అటవీ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, బీట్ అధికారి హర్షద్‌లు స్థానికంగా పర్యటించి పాదముద్రలు సేకరించారు. బహదూర్‌పూర జూపార్క్‌లోని ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే సంబంధిత అధికారులు మాత్రం అవి పులి పాద ముద్రికలు కావని, కుక్క పాదాలని నిర్ధారించినట్లు సమాచారం. కాగా పులి సంచరించినట్లు వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేసింది ఎవరో తెలియాల్సి ఉంది. స్థానికంగా ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్: ఒకరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: యాప్ ద్వారా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకులపై శంషాబాద్ జోన్ ఎస్‌ఓటీ, ఆర్‌జీఐఏ పోలీసులు దాడి చేసి ఒకర్ని అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తెలిపిన ప్రకారం..సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ మధ్య మంగళవారం రాత్రి క్రికెట్ మ్యాచ్ సందర్భంగా బెట్టింగ్ జరుగుతోందని విశ్వసనీయ సమాచారం అందడంతో శంషాబాద్ పట్టణంలోని ఫార్చ్యూన్ బ్లిస్, డీఎస్‌ఆర్ హోటల్‌లపై దాడులు నిర్వహించారు. విశాఖపటాన్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చండూరు జగదీష్ (32) అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.24 లక్షల నగదుతో పాటు బ్యాంకుల్లో ఉన్న మరో నాలుగు లక్షలు, మూడు స్మార్ట్ ఫోన్‌లు, రెండు కీ ప్యాడ్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

బెట్టింగ్ ఇలా...

పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భీమవారినికి చెందిన సురేష్ కొవ్వూరి 777 క్రికెట్ బెట్టింగ్ యాప్ తయారు చేయించి దాని ద్వారా ఇతర ఏజెంట్లతో బెట్టింగ్‌ను కొనసాగిస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా నగదు లావాదేవీల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి ఫ్యాన్సీ లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్‌లైన్‌గురు, క్రికెట్ మజా, ఇండెంట్, లోటస్, బెట్-365, బెఫేయిర్, వీఎల్ గ్రూప్ తదితర యాప్‌లను కూడా యాక్సెస్ చేసి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా జరిగే ఈ ప్రక్రియలో యువత వ్యక్తిగత సమాచారం కోల్పోవడంతో పాటు జూదానికి అలవాటు పడి ఆర్థికంగా దివాలా తీసి అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

సీసీఎంబీలో ఉద్యోగాల పేరుతో మోసం

నిందితుడు ప్రవీణ్‌ను అరెస్టు చేసిన పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ)లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్న సైబర్ నేరస్తుడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జే నరేందర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

- కర్నూలు జిల్లా బేతంచెర్లకు చెందిన అందూరి ప్రవీణ్ కుమార్ బయోటెక్నాలజీలో బీఎస్సీ పూర్తి చేసి రేడియోగ్రాఫర్‌గా ఉద్యోగం చేశాడు. కరోనా సమయంలో ప్రవీణ్ ఉద్యోగం పోయింది. అప్పటికే లగ్జరీ లైఫ్‌కు అలవాటు పడిపోయిన నిందితుడు చేతిలో డబ్బులేక అక్రమ మార్గంలో సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల వేసి అందినకాడికి దోచేయాలని ప్రణాళిక రచించాడు. బయోటెక్నాలజీలో కొంత పట్టు ఉండే సరికి సీసీఎంబీలో ఉద్యోగాల పేరుతో మోసం చేయాలని నిర్ణయించుకున్నాడు.
- ఈ క్రమంలో సీసీఎంబీలో సీనియర్ పరిశోధన శాస్త్రవేత్త ప్రణయ్ చౌదరి పేరుతో నకిలీ లింక్డ్‌ఇన్ ఖాతాను తెరిచాడు. కాంట్రాక్ట్ పద్ధతిలో రీసెర్చ్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేసేవాడు. ఇది చూసిన కర్నాటకకు చెందిన ఓ మహిళ ప్రవీణ్‌ను సంప్రదించింది. మాయ మాటలతో తనను బుట్టలో వేసుకున్న ప్రవీణ్.. సీసీఎంబీలో రీసెర్చ్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. నకిలీ ఈ-మెయిల్ ఐడీ ద్వారా బాధితురాలికి నకిలీ ఆఫర్ లెటర్ కూడా పంపించాడు. క్యాన్సర్ సెల్ థెరపీలో ఫుల్ టైం ప్రాజెక్ట్ అసిస్టెంట్, రూ.33 వేల జీతం అని, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సంప్రదించాలని సూచించాడు. దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు వంటి పేర్లతో బాధితురాలి నుంచి కొంత నగదు తీసుకున్నాడు.
- ఇటీవల నిందితుడి కార్యాకలాపాలపై అనుమానం వచ్చిన బాధితురాలు వెంటనే సీసీఎంబీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై సీసీఎంబీ డైరెక్టర్ స్పందించి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్..సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడు ప్రవీణ్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రవీణ్ సీసీఎంబీతో పాటు పలు కంపెనీల పేర్లు చెప్పి దేశవ్యాప్తంగా చాలా మంది నిరుద్యోగులను మోసం చేసినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు.

విలక్షణ నటుడు నాగభూషణం

డాక్టర్ కేవీ రమణాచారి


నాగభూషణం కుమార్తె భువనేశ్వరి దంపతులను సన్మానిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: 'రక్తకన్నీరు' నాగభూషణం విలక్షణ నటుడు అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో సి.నాగభూషణం శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన కుమార్తె భువనేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ..రక్తకన్నీరు నాటకం తెలుగు నాట 5వేలకు పైగా ప్రదర్శనలను ఇచ్చి చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. విలనిజం, హాస్యం, వ్యంగ్యం ఇలా ఎలాంటి పాత్రలనైనా రక్తికట్టించిన గొప్ప నటుడు నాగభూషణం అని కొనియాడారు. అంతకు ముందు గాయనీ గాయకుల సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, ఫిక్కి సీఎండీ హరిశ్చంద్ర, ఆకృతి సుధాకర్, సింగపూర్ ప్రముఖులు పేరి వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల మూసివేత సమంజసమా?

– ఆర్.కృష్ణయ్య ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి భారత రాజ్యాంగం పట్ల మీ చిత్తశుద్ధిని చాటుకున్నారు. సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టి బడుగు, బలహీన వర్గాల పట్ల మీ ప్రేమను చూపారు. కానీ అంబేడ్కర్ వారసులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు నివసించే హాస్టల్స్‌ను మూసివేయాలని ఆదేశించడం ఎంత వరకు సమంజసమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. గత తొమ్మిది నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులు అర్ధకాలితో నకనకలాడుతున్నారని చెప్పారు. మార్చి 31న ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ మెస్, అద్దె, కరెంటు బిల్లులు పాస్ కాలేదన్నారు.విద్యారంగం, హాస్టళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర విషయాల్లో పక్క రాష్ట్రమైన ఏపీని తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య హితవు పలికారు. నాడు నేడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య తదితర పథకాలు ఏపీలో బ్రహ్మాండంగా అమలు అవుతున్నాయని, లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చక్కగా చదువుకుంటూ ఉన్నతస్థాయికి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బూస్టర్ డోస్‌కు సన్నద్ధం

- నేటి నుంచి వ్యాక్సిన్ వేసేందుకు ఏర్పాట్లు
- అర్బన్ హెల్త్ సెంటర్లకు చేరుకున్న కోర్బివ్యాక్స్ నిల్వలు
- కోవాగ్జిన్, కోవిషీల్డ్ ఏది వేసుకున్నా బూస్టర్ డోస్‌గా కోర్బివ్యాక్స్



బంజారాహిల్స్‌లోని దూద్‌ఖానా బస్తీలో వ్యాక్సిన్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కరోనా బూస్టర్ డోస్ టీకాలు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో బూస్టర్ డోస్ వేసేందుకు సన్నాహాలు చేస్తున్నది. గురువారం నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ బూస్టర్ డోస్ టీకా ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

బంజారాహిల్స్: కోర్బివ్యాక్స్ వ్యాక్సిన్‌ను బూస్టర్ డోస్‌గా అందించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షౌకత్‌నగర్, ఫిలింనగర్, పంజగుట్ట, ఎంఎస్ మక్తా, చింతల్‌బస్తీ, శ్రీరాంనగర్ బస్తీల్లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు బూస్టర్ డోస్‌ల నిల్వలను పంపిణీ చేశారు.

- మొదటి, రెండో డోస్‌గా కోవాగ్జిన్, కోవిషీల్డ్‌లలో ఏది తీసుకున్నా బూస్టర్ డోస్‌గా కోర్బివ్యాక్స్ వ్యాక్సిన్‌ను తీసుకోవచ్చని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి అవగాహన..

బుధవారం నుంచి వ్యాక్సిన్ వేస్తున్నామని ప్రభుత్వం చెప్పినప్పటికీ నిల్వలు ఆస్పత్రులకు రావడంలో జాప్యం జరగడంతో గురువారం నుంచి వ్యాక్సిన్ వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న బస్తీల్లో గురువారం ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వైద్యులు కోర్బివ్యాక్స్ బూస్టర్ డోస్‌పై అవగాహన కల్పించారు. అయితే చాలా చోట్ల కోవాగ్జిన్, కోవిషీల్డ్ కావాలని స్థానికులు అడుగుతున్నారని ఆ రెండింట్లో ఏది వేసుకున్నా కూడా బూస్టర్ డోస్‌గా కోర్బివ్యాక్స్ వేసుకోవచ్చంటూ అవగాహన కల్పిస్తున్నట్లు ఆశా వర్కర్లు తెలిపారు. ఈ మేరకు అన్ని బస్తీలు, కాలనీల్లో అవగాన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోవాలి



కరోనా మొదటి, రెండో డోసు పూర్తయినట్లు సర్టిఫికెట్ తీసుకొని వచ్చిన వారికి మాత్రమే బూస్టర్ డోస్ వేస్తాం. తప్పనిసరిగా ఆ రెండు డోస్‌లు పూర్తయినట్లు సర్టిఫికెట్ చూపించాల్సిందే. నిత్యం ఎంత మంది వచ్చినా వ్యాక్సిన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి ఉచితంగా వేస్తున్న వ్యాక్సిన్‌ను వేసుకునేలా కుటుంబ సభ్యులు చొరవ తీసుకోవాలి. బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో తాము అందుబాటులో ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేస్తాం. ఇందుకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. వ్యాక్సిన్ నిల్వలు కూడా సెంటర్‌లో భద్రపరచాము. వ్యాక్సిన్‌పై ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు.

– కార్తీక్, డాక్టర్, బంజారాహిల్స్ అర్బన్ హెల్త్‌సెంటర్

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు



షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జీహెచ్‌ఎంసీ సీఎంటీసీ భవన్‌లో జరిగిన షాదీముబారక్ కార్యక్రమంలో ఆయన కార్పొరేటర్ కవితారెడ్డితో కలిసి 32 మంది షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తమ రాజకీయ అవసరాల కోసం మతం రంగుపులుముకొని ప్రజల్లో అలజడి సృష్టించాలని కొంత మంది ప్రయత్నిస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశంలోని మరే రాష్ట్రంలో లేని ప్రజా సంక్షేమ పథకాలును ఎన్నింటినో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టారని వాటి ద్వారా లక్షలాది మందికి లబ్ధి చేకూరుతున్నదన్నారు. లబ్ధి కోసం దళారులను ఆశ్రయించవద్దన్నారు.

కాలనీల్లో అధికారుల బృందం పర్యటన

బంజారాహిల్స్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కాలనీల చెంతకే అధికారులు కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులు బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌లో పర్యటించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం అయ్యారు. ఎలక్ట్రికల్ కేబుల్‌కు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయిన దీని వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెట్ల కొమ్మలు కొంత మేర తొలగించాలని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ, శానిటేషన్, ఎంటమాలజీ, పోలీస్, జలమండలి అధికారులు పాల్గొన్నారు. నోడల్ అధికారి మణిపాల్ ఆధ్వర్యంలో పర్యటన కొనసాగింది.



మిథిలానగర్‌లో...

మిథిలానగర్‌లో...

బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కమాన్‌లో ఉన్న మిథిలానగర్ కాలనీలో బుధవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి, పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రికల్ అధికారులు పర్యటించి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

క్లుప్తంగా...

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను ఆర్పుతున్న ఆస్పత్రి సిబ్బంది

బంజారాహిల్స్: నగరంలో అగ్ని ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రద్దీ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా మంటలను ఆర్పాలి, వాటి నుంచి ఎలా బయట పడాలి అనే అంశంపై ఫిలింనగర్ ఫైర్‌స్టేషన్ అధికారులు గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని రెయిన్ బో ఆస్పత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. మంటల్లో చిక్కుకున్నప్పుడు ఎలా బయటపడాలి, మంటలను తమ వద్ద ఉన్న ఉపకరణాలతో ఎలా ఆర్పాలి అనే విషయాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న ఫైర్ సేఫ్టీ వస్తువులపై పూర్తిగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ ఫైర్ స్టేషన్ అధికారి జి.బి.చంద్రశేఖర్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిస్ ఇండియా తెలంగాణ ఊర్మిలాచౌహాన్ సందడి

22న బి.గోకుల్ చంద్ జ్యువెలర్స్ ప్రారంభం



ఆభరణాలను ప్రదర్శిస్తున్న ఊర్మిలా చౌహాన్ తదితరులు

బంజారాహిల్స్: ఆభరణాల డిజైన్లు, నాణ్యతకు మారుపేరుగా నిలిచిన బీ గోకుల్ చంద్ జ్యువెలర్స్ ఈ నెల 22వ తేదీన బషీర్‌బాగ్‌లో అత్యాధునిక సౌకర్యాలు, ఆకట్టుకునే డిజైనర్ ఆభరణాలతో షోరూంను తెరుస్తున్నది. ఇందులో భాగంగా గ్రాండ్ జ్యువెలరీ షోకేస్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు నిర్వాహకులు చేతన్‌కుమార్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి సన్నాహక ప్రదర్శన బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం 10లో నిర్వహించారు. కార్యక్రమంలో మిస్ ఇండియా తెలంగాణ 2023 ఊర్మిలా చౌహాన్, నటి వన్యా అగర్వాల్‌తో పాటు మోడల్స్ కనువిందుచేసే ఆభరణాలు ధరించి ఆకట్టుకున్నారు. నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్లు, చెవి రింగులు ప్రత్యేకతగా ప్రత్యేక ఆభరణాలను అందుబాటులో ఉంచుతున్నట్లు వారు తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి



హరిబాబుకు నియామకపత్రం ఇస్తున్న నవీన్ పి శర్మ

పంజగుట్ట: వినియోగదారులకు ఉన్న హక్కులను తెలియచేస్తూ ఎక్కడ అన్యాయం జరిగినా మన గొంతు వినిపించాలని వినియోగదారుల హక్కుల సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్ పి శర్మ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇప్పటివరకు సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన రామగిరి హరిబాబును రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరుగురితో ప్రారంభమైన తమ సంస్థ ఇప్పుడు సుమారు వెయ్యి మంది సభ్యులతో అన్ని జిల్లాలకు విస్తరించిందన్నారు. గ్రామీణ పట్టన ప్రాంతాల్లో వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన కల్గిస్తూ ఎవరికైనా అన్యాయం జరిగితే న్యాయం జరిగేవరకు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షులు జి.శివకుమార్, రవి యాదవ్, మహిళా నాయకురాలు కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా రమణకు నియామకపత్రం అందజేశారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీకి చెందిన ఆలూస సాయికిరణ్‌కు భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ తెలంగాణ ప్రభుత్వం అందించిన దళితరత్న అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో రాజీవ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టెల గిరేందర్, ప్రధాన కార్యదర్శి దుబ్బాక నవీన్, సాయిగిరిలు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

చీకటిపడితే.. విసిగిస్తారు!

- ఖైరతాబాద్ కార్పొరేటర్‌కు ప్రజల ఫిర్యాదు
- పంజగుట్ట ఏసీపీ దృష్టికి హిజ్రాలు, సెక్స్‌వర్కర్ల సమస్య
- పరిష్కరిస్తామన్న ఏసీపీ మోహన్ కుమార్



సమస్యలు తెలుసుకుంటున్న విజయారెడ్డి

పంజగుట్ట: చీకటి పడితే చాలు ఎర్రమంజిల్‌లో హిజ్రాలు, సెక్స్ వర్కర్ల అల్లర్లు, వారు చేసే వెకిలిచేష్టలను భరించలేక పోతున్నామని, రోడ్డుపైకి కూడా రాలేకపోతున్నామని పలు ప్రాంతాల ప్రజలు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డికి విన్నవించారు. ప్రజలతో నేరుగా సంప్రదింపులు కార్యక్రమంలో భాగంగా బుధవారం విజయారెడ్డి పంజగుట్ట మార్కెట్ బస్తీ, ద్వారకాపురి కాలనీ, ఎర్రమంజిల్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రాత్రివేళల్లో బయటకు రాలేకపోతున్నామని ఎన్నో సార్లు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పత్రికల్లో కథనాలు సైతం ప్రచురితమైనా అధికార యంత్రాంగంలో ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. హిజ్రాలు, సెక్స్ వర్కర్లు రాత్రివేళల్లో కొట్టుకుంటున్నారని, రోడ్డుపై ఎవరైనా వెళ్తే వారిని అడ్డగించి బెదిరిస్తున్నారని, ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకుంటూ హంగామా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన విజయారెడ్డి పంజగ్గుట ఏసీపీ మోహన్ కుమార్‌కు ఫోన్ చేసి సమస్య వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంజగుట్ట మార్కెట్ బస్తీలో గతంలో విజయారెడ్డి సివరేజీ పైప్‌లైన్ పనులు 300 ఎంఎం డయా పైప్‌లైన్ వేయించారని కాని ప్రధాన కూడలిలో కూడా పైప్‌లైన్ మారిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికే మెయిన్ రోడ్డు పనులకు కూడా నిధులు మంజూరయ్యాని త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. తాగునీటి సరఫరాలో ప్రెషర్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ చరణ్, వివిధ శాఖల అధికారులు శివ, అశోక్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'అమరావతి' గ్రాడ్యుయేషన్ డే

రహమత్‌నగర్: యూసుఫ్‌గూడ అమరావతి హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రంగురంగుల దుస్తులతో చిన్నారులు వేషధారణ ఆకట్టుకుంది. చిన్నారులకు ఉపాధ్యాయులు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రాడ్యుయేషన్ డే విశిష్టతను చిన్నారులకు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ కవిత, నస్రీన్, గీత, ఉష తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

వీధి కుక్కల పట్టివేత



దుర్గా భవానీనగర్‌లో కుక్కలను పట్టుకుంటున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీలో కొద్ది రోజులుగా వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. ఈ విషయంపై స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. బుధవారం సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది డాగ్ క్యాచర్ వాహనంతో దుర్గా భవానీనగర్ బస్తీలోని ఈదమ్మ గుడి వద్ద పర్యటించారు. సమస్యాత్మకంగా ఉన్న 15 కుక్కలను గుర్తించి అక్కడి నుంచి తరలించారు. ఫిలింనగర్ బస్తీల్లో గత 15 రోజుల్లో 60 కిపైగా కుక్కలను తరలించినట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

బీసీల సమస్యలు కేంద్రానికి పట్టవా?

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి ఆరోపించారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన మోడీ ప్రభుత్వం బీసీలను విస్మరిస్తూ... తమని అంటరానివారిలా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... 70 కోట్ల మంది బీసీల పరిస్థితిని బిచ్చగాళ్ల కంటే అధ్వానంగా మార్చారని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఇకపై యుద్ధం తప్పదని బీసీల దమ్ము ఏంటో చూపిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోడీకి కేంద్రంలో రెండుసార్లు అధికారం కట్టబెడితే బీసీలకు ఒక్క మంచి పని చేశారా అని నిలదీశారు. తమ హక్కుల కోసం సమస్యల కోసం డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తుంటే చిన్న చూపు చూస్తున్నారన్నారు. బీసీల జనగణన కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ కోసం చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల కోసం ప్రధాన ఎజెండా ఎంచుకొని ఢిల్లీ స్థాయిలో తిరుగుబాటు పోరాటాలకు సందర్భం అని స్పష్టం చేశారు. సమావేశంలో నేతలు నవ్య, సుభాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాలేయ సంరక్షణపై ఆస్పత్రుల్లో అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విరించి ఆస్పత్రి వైద్యులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1/12 చౌరస్తాలో ఉన్న విరించి ఆస్పత్రిలో బుధవారం ప్రపంచ లివర్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యువ వైద్యులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. లివర్‌కు సంబంధించి తలెత్తే పలు ఆరోగ్య సమస్యలు వాటికి గల పరిష్కార మార్గాలు సూచించడంతో పాటు వారి వద్దకు వచ్చే రోగులకు తలెత్తే లివర్ సమస్యలపట్ల ఎలా స్పందించాలన్న అంశంపై నిపుణులైన వైద్యులు ప్రత్యేక ప్రజంటేషన్ల ద్వారా వివరించారు. విరించి గ్రూప్ వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ మాట్లాడుతూ... తమ ఆస్పత్రిలో త్వరలోనే అత్యాధునిక లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్ ప్రారంభిస్తున్నామని తెలిపారు. కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ లతా ప్రసాద్ మాట్లాడుతూ... లివర్ పూర్తిగా పాడై మందులతో లేదా శస్త్ర చికిత్స ద్వారా బాగు చేయలేని సందర్భంలో కాలేయ మార్పిడి, శస్త్ర చికిత్స మాత్రమే రోగికి ఉన్న ఏకైక మార్గం అన్నారు. కాలేయ మార్పిడి కోసం దాతల నుంచి కాలేయాన్ని సేకరించాల్సి వస్తుందని దీనిపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. డాక్టర్ మహ్మద్ సాదుద్దీన్ అజ్మీ, డాక్టర్ సురేష్ చంద్ర, సీఈవో డాక్టర్ సాయి రవి శంకర్, డాక్టర్ సురేష్ చంద్ర హన్ను తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో...

బంజారాహిల్స్: ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో కాలేయ ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం గురించి అవగాహన పెంచుకోవడానికి 'బి లివర్ వైస్' ప్రచారాన్ని ప్రారంభించారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ సంగీతారెడ్డితో పాటు డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్‌రావు, డాక్టర్ రఘు, డాక్టర్ శరత్ చంద్రలు కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ... కాలేయ వ్యాధులు పెరుగుతున్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా రూ. 999 తో లివర్ స్క్రీనింగ్ ప్యాకేజీని అందిస్తున్నామన్నారు. హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ, లివర్ ఫంక్షన్ పరీక్షలు, ఫైబ్రోస్కాన్, గ్యాస్ట్రో కన్సల్టేషన్ వంటి కీలకమైన వైద్య పరీక్షలు ఈ ప్యాకేజీలో భాగంగా ఉన్నాయన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అన్ని వర్గాలకు గౌరవం



కానుకలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: బీఆర్‌ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత గౌరవం లభిస్తున్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణలోనే అన్ని పండగలకు ఆయా వర్గాల ప్రజలకు కానుకలు అందజేస్తున్నారన్నారు. హెచ్‌ఎఫ్ నగర్ క్వారీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... పండగలను శాంతియుత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శులు సుబ్బరాజు, శ్రీనివాస్, డివిజన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు గని, గఫ్ఫార్, జాఫర్ హుస్సేన్, జబ్బార్ ఖాన్, రవూఫ్, నజీర్, ముబీన్, రఫీ, డివిజన్ మాజీ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, రాకేష్, క్రిష్టఫర్ ,జగన్, విలియమ్స్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయమ్మ జన్మదిన వేడుకలు

సాక్షి, హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సతీమణి వై.ఎస్.విజయమ్మ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం లోటస్‌పాండ్‌లోని తన నివాసంలో ఆమె కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేశారు. విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపిన కుమార్తె, వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కేక్ తినిపించారు. వేడుకల్లో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సతీమణి వై.స్వర్ణలతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని సీపీఎం ధర్నా

రహమత్‌నగర్: బోరబండ డివిజన్ బాబా సైలానీనగర్ బస్తీలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. బస్తీ కూడలిలో నిర్వహించిన ధర్నాలో సీపీఎం నాయకుడు శేషగిరిరావు మాట్లాడుతూ... బాబా సైలానీనగర్ మూడు రోజులకు ఓ సారి నల్లాల్లో తాగు నీరు సరఫరా అవుతున్నందున నీటి కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే సమస్యపై ఇటీవల జలమండలి జీఎంకు వినతి పత్రం సమర్పించామని గుర్తుచేశారు. రంజాన్ మాసం నేపథ్యంలో స్థానిక ముస్లింలతోపాటు బస్తీ ప్రజలు చినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తీలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే జలమండలి జీఎం కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని శేషగిరి హెచ్చరించారు. నేతలు బాగ్యలక్ష్మి, చంద్రకళ, నస్రీన్, సుగుణమ్మ, గుండమ్మ, సరిత, అన్నపూర్ణ, బేగం, నదియా, గ్లోరి బాయ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన బైక్: యువకుడికి గాయాలు

బంజారాహిల్స్: వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని స్కూటరిస్టుకు తీవ్ర గాయాలైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌లోని మహాత్మగాంధీనగర్ బస్తీలో నివసించే బి.సాయినాథ్(22) డెలివరీ బాయ్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్ నెం. 79లోని రామానాయుడు స్టూడియో వైపు వెళ్తుండగా ఎదురుగా ఓ వాటర్ ట్యాంకర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన సాయినాథ్ బైక్ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో బాధితుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ సడన్‌గా బ్రేక్ వేయడంతోనే తన కొడుకు ఈ ప్రమాదానికి గురయ్యాడని బాధితుడి తల్లి అంజమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏపీ 16 టీడబ్ల్యూ 9900 వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 337, 279 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంజారాహిల్స్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... అసోంకు చెందిన సాబిర్ అహ్మద్ మజుందార్(32) జూబ్లీహిల్స్ రోడ్ నెం. 76లో ఓ ఇంటి వద్ద సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన రాత్రి 8.30 గంటల సమయంలో రంజాన్ నమాజ్ ముగించికొని ఉపవాస దీక్షల అనంతరం భోజనం చేసి తన బైక్ (టీఎస్ 10ఈవై 0273)పై రోడ్ నెం 76 మీదుగా వెళ్తుండగా సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ స్కిడ్ అయింది. కిందపడ్డ మజుందార్‌కు తీవ్ర గాయాలు కాగా ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. సడన్ బ్రేక్ వేసి బైక్ స్కిడ్ కావడం వల్లనే ఈ ఘటన జరిగిందని మృతుడు సోదరుడు నూర్ అహ్మద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేద ముస్లింలు సంతోషంగా రంజాన్ జరుపుకోవాలనే కానుకలు



ప్రతాప్‌నగర్‌లో రంజాన్ కానుకలు అందజేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: పవిత్ర రంజాన్ మాసాన్ని పేద ముస్లిం కుటుంబాలు కూడా సంతోషంగా రంజాన్ పండగ జరుపుకోవాలనే మహోన్నతాశయంతో సీఎం కేసీఆర్ ఏటా రంజాన్‌కు ముస్లింలకు కానుకలు అందజేస్తున్నామని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బుధవారం ప్రతాప్‌నగర్ బస్తీలో నివాసం ఉంటున్న పేద ముస్లిం కుటుంబాలకు ఆమె రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అన్ని కులాలకు, అన్ని మతాలకు తెలంగాణ రాష్ట్రంలో సమ ప్రాధాన్యం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సి. రాములు చౌహాన్, బీఆర్‌ఎస్ నేత నల్ల శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా నౌపడలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

ఉత్తరాంధ్రలో కొత్త చరిత్ర

నౌపడ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్

- శ్రీకాకుళం అభివృద్ధికి మూల స్తంభమైన మూలపేట పోర్టుకు శంకుస్థాపన
- అందరికీ ఆమోదయోగ్యమైన విశాఖలో సెప్టెంబర్ నుంచి మకాం

నౌపడ నుంచి సాక్షి ప్రతినిధి: మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, గొట్టా బ్యారేజీ ఎత్తిపోతల పథకం, మహేంద్ర తనయ ఆఫ్ షోర్ ప్రాజెక్టుల ద్వారా రానున్న రోజుల్లో ఉత్తరాంధ్ర ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఏపీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విశాఖ నగరం నుంచి 170 కిలోమీటర్లు, చెన్నై- కోల్‌కతా నేషనల్ హైవేకు కేవలం 14 కిలోమీటర్లు, ప్రధాన రైల్వే మార్గానికి 11 కిలోమీటర్ల దూరంలో 1,250 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణమవుతున్న మూలపేట పోర్టు.. రానున్న రోజుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇక్కడే 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని మూలపేట తీరంలో పోర్టు నిర్మాణానికి, ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్, గొట్టా బ్యారేజ్ నుంచి హిరమండలం రిజర్వాయర్ ఎత్తిపోతల పథకానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. మహేంద్ర తనయ ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండలంలోని నౌపడ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రానికి 974 కిలోమీటర్ల సముద్రతీరం ఉంటే,



సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

అందులో ఏకంగా 193 కిలోమీటర్లు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే ఉందన్నారు. అయినా ఒక పోర్టు కానీ, ఒక ఫిషింగ్ హార్బర్ కానీ, కనీసం ఫిష్ ల్యాండింగ్ సెంటర్ కానీ ఉండి ఉంటే ఈ జిల్లా చెన్నై, ముంబయిగా అభివృద్ధి చెంది ఉండేదని చెప్పారు. ఈ విషయం తెలిసీ కూడా దశాబ్దాలుగా ఎవ్వరూ ఈ దిశగా అడుగులు వేసి, చిత్తశుద్ధి చూపలేదన్నారు. ఈ పరిస్థితిలో జిల్లా ముఖచిత్రం మార్చాలని తాపత్రయపడుతూ, మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు లభించేలా మన జిల్లా ఒక చెన్నై, ఒక ముంబయి మహా నగరం కావాలని.. ఉత్తరాంధ్ర చరిత్ర మారుస్తూ అడుగులు ముందుకు వేస్తున్నామని స్పష్టం చేశారు.

సెప్టెంబర్ నుంచి విశాఖలో కాపురం

'రాష్ట్రంలో అతిపెద్ద నగరం మాత్రమే కాకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నగరం విశాఖపట్నం. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ఈ సెప్టెంబర్ నుంచి మీ బిడ్డ విశాఖలో కాపురం పెడతాడని ఈ సందర్భంగా తెలియజేస్తున్నా. ఉత్తరాంధ్రలోనే కాదు రాష్ట్రంలో ఏ ప్రాంతం తీసుకున్నా, ఏ గ్రామం తీసుకున్నా గతంలో ఎప్పుడూ చూడని విధంగా అభివృద్ధి కనిపిస్తోంది. స్కూళ్లు మారుతున్నాయి. కొత్తగా మెడికల్ కాలేజీలు కనిపిస్తున్నాయి. ఉన్న ఆస్పత్రులన్నీ రూపురేఖలు మారుతూ కనిపిస్తున్నాయి. ఏ పేద, మధ్య తరగతి కుటుంబానికైనా మనసా, వాచా, కర్మణా మంచి చేయాలని మన ప్రభుత్వం తపన పడుతోంది. ప్రతి ఇల్లూ అభివృద్ధి కావాలి. నా అక్కచెల్లెమ్మల ముఖంలో చిరునవ్వు కనపడాలి. 46 నెలల కాలంలో లంచాలు, వివక్షకు తావు లేకుండా మీ బిడ్డ ప్రభుత్వం రూ.2.88 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వేసింది' అని జగన్ పేర్కొన్నారు.

నల్ల 'మార్గం'లో!

- 'మార్గదర్శి' రశీదు డిపాజిట్ల ముసుగులో భారీగా బ్లాక్‌మనీ మార్పిడి
- ఆ నల్లధనాన్నే తమ సంస్థల్లో పెట్టుబడులుగా తరలించిన రామోజీ
- 7 బ్రాంచీల్లో సీఐడీ సోదాలు.. కీలక ఆధారాలు లభ్యం
- మరికొద్ది రోజులు కొనసాగనున్న సోదాలు



విజయవాడలో మార్గదర్శి ఆఫీస్ నుంచి బయటికి వెళ్తున్న సీఐడీ అధికారి

సాక్షి, అమరావతి: భారీగా నల్లధనం మార్పిడికి మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాలు కేంద్ర స్థానంగా మారినట్లు సీఐడీ గుర్తించింది. రశీదుల రూపంలో బ్రాంచి కార్యాలయాల నుంచి ప్రధాన కార్యాలయానికి చేరిన భారీ నిధుల వెనుక మనీ లాండరింగ్ ఉన్నట్లు వెల్లడైంది. రాష్ట్రవ్యాప్తంగా ఏడు చోట్ల మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ అధికారుల బృందం బుధవారం సోదాలు నిర్వహించి పలు కీలక పత్రాలను సేకరించింది. చందాదారుల నిధుల మళ్లింపు, అక్రమ పెట్టుబడులు, అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర అభియోగాలతో ఏ-1గా మార్గదర్శి చిట్‌ఫండ్స్ చైర్మన్ చెరుకూరి రామోజీరావు, ఏ-2గా చెరుకూరి శైలజా కిరణ్, ఏ-3గా బ్రాంచి మేనేజర్లపై కేసులు నమోదైన విషయం విదితమే. ఈ కేసులో ఇటీవల రామోజీరావు, శైలజను విచారించడంతోపాటు హైదరాబాద్‌లోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో సోదాలు చేపట్టి పలు అవకతవకలను గుర్తించారు. ఆ సోదాలకు కొనసాగింపుగా తాజాగా 7 చోట్ల మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. విశాఖ (సీతంపేట), రాజమహేంద్రవరం (శ్యామల థియేటర్ బ్రాంచి), ఏలూరు (నర్సింగరావుపేట బ్రాంచి), విజయవాడ (లబ్బీపేట బ్రాంచి), గుంటూరు (అరండల్ పేట), నరసరావుపేట (సత్తెనపల్లి రోడ్ బ్రాంచి), అనంతపురం (లక్ష్మీనగర్ బ్రాంచి)లోని మార్గదర్శి కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు మొదలైన సోదాలు అర్ధరాత్రి దాటిన తరువాత కూడా కొనసాగుతున్నాయి.

- చట్ట ప్రకారం నిర్వహించాల్సిన 12 రికార్డులకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లు సీఐడీ అధికారుల సోదాల సందర్భంగా గుర్తించినట్లు సమాచారం. ఏటా దాదాపు రూ.600 కోట్ల వరకు నగదు రూపంలో మార్గదర్శి ప్రధాన కార్యాలయానికి అక్రమంగా బదిలీ చేసినట్లు గతంలో గుర్తించారు. ఆ నిధులను బ్రాంచి కార్యాలయాల నుంచి ఏ తేదీల్లో అక్రమంగా తరలించారనే అంశాలపై తాజా సోదాల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ఏటా మార్చి 31న వచ్చినట్లు చూపిస్తున్న దాదాపు రూ.500 కోట్లకు పైగా చెక్కులకు సంబంధించిన వివరాలను సంబంధిత బ్రాంచి కార్యాలయాల రికార్డుల్లో నమోదు చేస్తున్నారా? అనే అంశాన్ని పరిశీలించారు. ఇక రశీదుల రూపంలో డిపాజిట్లు వివిధ బ్రాంచి కార్యాలయాల నుంచి ప్రధాన కార్యాలయానికి వచ్చినట్లు మార్గదర్శి చూపిస్తోంది. అయితే అందుకు సంబంధించిన రికార్డులు బ్రాంచి కార్యాలయాల్లో లేవని వెల్లడైనట్లు తెలుస్తోంది. రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్ల నిధులనే రామోజీరావు తమ కుటుంబ సంస్థల్లోకి మళ్లించినట్లు సీఐడీ ఇప్పటికే గుర్తించింది. ప్రధాన కార్యాలయం, బ్రాంచిల రికార్డులకు ఎక్కడా పొంతన లేదని వెల్లడైంది. తాజా సోదాల్లో కీలక పత్రాలు, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ సోదాలు మరికొద్ది రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

హ్యాపీ బర్త్‌డే అమ్మ

- వైఎస్ విజయమ్మకు సీఎం జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మాతృమూర్తి వైఎస్ విజయమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'హ్యాపీ బర్త్ డే అమ్మ' అంటూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ నంబర్ 1

- 2022-23లో రూ.7.65 లక్షల కోట్ల ఒప్పందాలతో దేశంలోనే అగ్రస్థానం
- దేశంలో పెట్టుబడులపై 'ప్రాజెక్ట్స్ టుడే' సర్వే నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలోనే అత్యధికంగా పెట్టుబడులు ఆకర్షించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. 2022-23లో 306 ప్రాజెక్టులకు సంబంధించి రూ.7,65,030 కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలతో ఏపీ అగ్రస్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్ టుడే తాజా సర్వే వెల్లడించింది. అంతకుముందు ఏడాది ప్రథమ స్థానంలో ఉన్న గుజరాత్‌ను అధిగమించి ఏపీ నంబర్ వన్‌గా నిలిచింది. 2022-23లో టాప్ పది రాష్ట్రాల్లో 7,376 ప్రాజెక్టులకు సంబంధించి రూ.32,85,846 కోట్ల విలువైన ఒప్పందాలు కుదరగా ఏపీ నుంచే 23 శాతానికి పైగా పెట్టుబడుల ఒప్పందాలు జరగడం విశేషం. ఏపీ ఒప్పందాలు కుదుర్చుకున్న వాటిల్లో 57 భారీ ప్రాజెక్టుల విలువ రూ.7,28,667.82 కోట్లుగా ఉంది. ఇందులో ఏడు గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులకు సంబంధించినవి కాగా మరో 18 హైడల్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టులున్నాయి. గుజరాత్ రూ.4,44,420 కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలను సాధించడం ద్వారా రెండో స్థానంలో నిలిచింది. సెమీ కండక్టర్ల తయారీకి సంబంధించి గుజరాత్ మూడు భారీ ప్రాజెక్టులను ఆకర్షించింది. కర్ణాటక రూ.4,32,704 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా మూడో స్థానంలో నిలిచింది. తెలంగాణ రూ.1,58,482 కోట్ల విలువైన 487 ప్రాజెక్టులతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా తర్వాత స్థానాల్లో కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలున్నాయి.

అవినాశ్‌రెడ్డిని విచారించిన సీబీఐ

- వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా విచారణ
- విచారణ మొత్తం వీడియో, ఆడియో రికార్డింగ్
- నేడు మరోమారు విచారణ

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం మరోమారు ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ విచారణకు హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం.. సీబీఐ అధికారులు బుధవారం అవినాశ్‌రెడ్డిని ప్రశ్నించారు. బుధవారం ఉదయం 10.45 గంటల ప్రాంతంలో అవినాశ్‌రెడ్డి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి చేరుకున్నారు. 11 గంటల నుంచి సాయంత్రం 6-45 వరకు విచారణ కొనసాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రశ్నలన్నింటినీ సీబీఐ అధికారులు లిఖిత పూర్వకంగానే ఇచ్చినట్టు తెలిసింది. అన్ని ప్రశ్నలకు అవినాశ్‌రెడ్డి స్పష్టమైన సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. కోర్టు ఆదేశాల మేరకు విచారణ మొత్తాన్ని అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేసినట్టు సమాచారం. సీబీఐ అధికారులు అవినాశ్‌రెడ్డిని గురువారం మరోమారు ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని విచారించిన సీబీఐ

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను బుధవారం మొదటి రోజు కస్టడీలోకి తీసుకొని విచారించారు. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలకు కోర్టు బుధవారం నుంచి 6 రోజులు సీబీఐ కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో సీబీఐ అధికారులు బుధవారం ఉదయం 10-30 గంటలకు ఇద్దరినీ చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం కోఠి లోని సీబీఐ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 4-10 గంటల వరకు 5 గంటలపాటు కొనసాగింది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు హత్యకు ముందు, ఆ తర్వాత జరిగిన పరిణామాల పై వారిద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించి స్టేట్‌మెంట్లు నమోదు చేసినట్టు సమాచారం. గురువారం మరో మారు ఇద్దరినీ కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

22న పీఎస్‌ఎల్‌వీ సీ55 ప్రయోగం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 22న మధ్యాహ్నం 2.19 గంటలకు సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ లోని మొదటి ప్రయోగవేదిక నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ-55 ప్రయోగాన్ని చేపట్టేందుకు సిద్ధం చేస్తోంది. ఇస్రో అంతర్భాగంగా ఉన్న న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ వారి వాణిజ్య ఒప్పందం మేరకు ఈ ప్రయోగాన్ని చేపడుతున్నారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 741 కిలోల బరువు కలిగిన టెలియోస్-02 అనే ఉపగ్రహంతో పాటు లూమిలైట్-4 అనే 16 కేజీల బుల్లి ఉపగ్రహాన్ని రోదశీలోకి పంపించనున్నారు. ఈ ప్రయోగంలో పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌లో నాలుగోదశ (పీఎస్-4)ను ఒక ఎక్స్‌పర్‌మెంటల్ చేయనున్నారు. ఈ రాకెట్‌లో ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంటల్ మాడ్యూల్ (పీవోఈఎం) అమర్చి పంపిస్తున్నారు. అంటే పోలార్ ఆర్బిట్‌లో ఇంకా ఎన్ని రకాల కక్ష్యల్లో ఉపగ్రహాలను ప్రవేశపెట్టవచ్చో పరిశోధన చేయడానికి ఈ ఎక్స్‌పర్‌మెంటల్ ప్రయోగాన్ని చేస్తున్నారు.



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్‌వీ సీ-55 ఉపగ్రహ వాహకనౌక

నగర వార్తలు

ఎంజీఎన్‌సీఆర్‌ఈ చైర్మన్‌గా ప్రొఫెసర్ బీజేరావు



రాయదుర్గం: నగరంలోని మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ (ఎంజీఎన్‌సీఆర్‌ఈ) చైర్మన్‌గా ప్రొఫెసర్ బీజేరావు బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుకు కేంద్ర ప్రభుత్వంలోని విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగించింది. దీంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎంజీఎన్‌సీఆర్‌ఈ సంస్థ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

హజ్‌యాత్ర సేవకులుగా 15 మంది ఎంపిక


సాక్షి, సిటీబ్యూరో: 2023 హజ్ యాత్ర సేవకులుగా 15 మంది ఎంపికయ్యారని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. బుధవారం నాంపల్లి హజ్ హౌస్‌లో హజ్ యాత్రికుల సేవకుల డ్రా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాత్రికుల సేవకులుగా విధులు నిర్వహించడానికి 165 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దరఖాస్తు చేశారని, ఇందులో 111 దర ఖాస్తులు డ్రా కోసం అర్హత పొందాయన్నారు. డ్రా నిర్వహించి 15 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. మరో ఐదుగురిని వెయిటింగ్ లిస్టులో ఉంచామన్నారు.

ఈడీసీసీ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సంతోష్‌కుమార్



సంతోష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఖైరతాబాద్: విద్యుత్ శాఖ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈడీసీసీ) మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా బి.సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బంజారాహిల్స్ సర్కిల్ తరఫున బుధవారం జరిగిన ఎన్నికల్లో ఆ డివిజన్‌కు చెందిన సంతోష్‌కుమార్ ఎన్నికవడం పట్ల 1104 యూనియన్ డివిజన్ అధ్యక్షుడు వర్గిస్ నాయక్ ఆధ్వర్యంలో మింట్ కంపౌండ్‌లోని ఈడీసీసీ కార్యాలయం వద్ద సంబరాలు చేసుకున్నారు. సంతోష్ కుమార్‌కు సహోద్యోగులు పూలమాలలు వేసి నృత్యాలతో సందడి చేశారు.



ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ

యాకుత్‌పురా: రంజాన్ మాసం సందర్భంగా రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం యాకుత్‌పురా బడాబజార్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం రంజాన్ ఉపవాస దీక్షలను విరమించారు. మజ్లిస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి యాసర్ ఆరాఫత్, మాజీ కార్పొరేటర్ షకీల్ మహమూద్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



చాదర్‌ఘాట్: మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి దిగుమతులు అధికంగా రావడంతో ఒక్కసారిగా ధర తగ్గింది. క్వింటాల్‌కు రూ. 20వేల నుండి 18 వేలకు తగ్గింది. రూ. 2వేలు ధర తగ్గటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాంతో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ దామోదర్ మాట్లాడుతూ.. మిర్చి ధర తగ్గటంతో వెంటనే అధికారులను అలర్ట్ చేశామని తెలిపారు. వ్యాపారులతో సంప్రదింపులు జరిపామన్నారు. మిర్చి ఆఖరి సీజన్ కావడంతో దిగుమతులు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. బుధవారం వివిధ జిల్లాల నుండి మార్కెట్‌కు దాదాపు 6వేల బస్తాలు వచ్చాయని తెలిపారు. ఒక్కసారిగా ధర రూ. 2వేలు తగ్గడంతో రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. రైతులు కొన్ని రోజులు మిర్చి నిల్వలను ఆపి తీసుకు రావాలని విజ్ఞప్తి చేసారు.

తెలంగాణలో సాహిత్య వికాసం అద్భుతం



జూలూరు గౌరీశంకర్‌తో సమావేశమైన ప్రసన్నకుమార్

బంజారాహిల్స్: తెలంగాణ ప్రభుత్వం తెలుగు సాహిత్య వికాసానికి చేస్తున్న కృషి మరువలేనిదని తమిళనాడులోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా కవి, రచయిత కావడంతో తెలుగు సాహిత్యానికి ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. బుధవారం నగరంలోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ కార్యాలయంలో తెలంగాణా సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్, నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ సీఎండీ మోటుపల్లి ప్రసన్నకుమార్‌లు కలుసుకుని రాష్ట్రంలో జరుగుతున్న సాహిత్య వికాసం గురించి ముచ్చటించారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... తెలంగాణ సాహిత్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ నుంచి సహకరిస్తామన్నారు.

అమోనియా గ్యాస్ లీకేజీతో ఇద్దరికి స్వల్ప అస్వస్థత



మల్లాపూర్: మల్లాపూర్ పారిశ్రామికవాడలోని రోడ్ నెంబర్‌లో -1లో ఏకశిల కెమికల్స్ లిమిటెడ్ కంపెనీలో మంగళవారం రాత్రి అమోనియా గ్యాస్ పైప్‌ను టైట్ చేస్తుండంగా ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయింది. దీంతో ఘాటైన వాసనతో అందులో పని చేసే వెంకటరమణ కాలనీకి చెందిన బి.అంజిరెడ్డి(58), కెఎల్‌రెడ్డినగర్‌కు చెందిన సూపర్‌వైజర్ నాగభూషణ్ (60) స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. చుట్టు పక్కల వారు కూడా కళ్ల మంటలతో బాధపడ్డారు. దీంతో హుటాహుటిన వారిని ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు యజమాని రామారావుతో కంపెనీ ముందు గొడవకు దిగారు. నాచారం సిఐ నందీశ్వర్, ఐలా కమీషనర్ ఉమామహేశ్వర్ సందర్శించి సంఘటన వివరాలను తెలుసుకున్నారు.

గోల్కొండ కోటకు జీ-20 ప్రతినిధి బృందం

గోల్కొండ: నగరంలో జరుగుతున్న జీ-20 సదస్సు ప్రతినిధులు బుధవారం సాయంత్రం గోల్కొండ కోటను సందర్శించారు. సుమారు 80 మంది సభ్యులు గల ఈ బృందం కోటలో అడుగు పెట్టగానే వావ్ గోల్కొండ అంటూ కోట అందాలను చూసి ఆశ్చర్యపోయారు. కాగా కేంద్ర పురాతత్వ సర్వేక్షణశాఖ ప్రతినిధులు వారికి నుదుట తిలకం దిద్ది స్వాగతం పలికారు. ఇంతటి పటిష్టమైన, అందమైన కట్టడం తాము చూడటం ఇదే మొదటి సారి అని పలువురు విదేశీ ప్రతినిధులు అన్నారు. అనంతరం వారు కోటలో ప్రతి రోజు సాయంత్రం నిర్వహించే లైట్ అండ్ సౌండ్ షోను వీక్షించారు.



గోల్కొండ కోటలో జీ-20 విదేశీ బృందం ప్రతినిధులు

దేశంలో పడిపోతున్న సామాన్యుల జీవన ప్రమాణాలు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అంబర్‌పేట: దేశంలో నిత్యావసరవస్తువుల ధరల పెరుగుదలను అదుపుచేయడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని దీంతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు రోజు రోజుకూ పడిపోతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1100 వందలకు పెరగడం బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఆత్మీయ సమ్మేళనం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధికి బీజేపీ ఆమడ దూరంలో ఉంటూ చౌకబారు ప్రచారాలకు పాల్పడుతోందని విమర్శించారు. మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న కిషన్‌రెడ్డి అంబర్‌పేటకు ఏమి చేశారో తాజాగా ఈ నాలుగేళ్లలో మా పార్టీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఏమి చేశారో బహిరంగంగా చెప్పుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్ దాసోజు శ్రావణ్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన వీరికి స్థానిక బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోతరాజుల నృత్యాలు, మహిళలు బోనాలు ఎత్తుకుని వీరికి అట్టహాసంగా స్వాగతం పలికారు. అనంతరం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాములు ముధిరాజ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, ఇతరులు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు.

బీఎంసీలతో సహజ వనరుల పరిరక్షణ



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్‌బీఏ సెక్రెటరీ డాక్టర్ బి.బాలాజీ, ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీల సహకారంతో సహజ వనరుల పరిరక్షణ సాధ్యమవుతందని ఎన్‌బీఏ(నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ) సెక్రెటరీ డాక్టర్ బి.బాలాజీ పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో తెలంగాణ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు, ఈపీటీఆర్ఐ సహకారంతో 'జీవ వైవిధ్య చట్టం-2002'పై రెండు రోజుల వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపుల్స్ బయోడైవర్సిటీ రిజిస్టర్‌ను నిర్వహించాలని సూచించారు. అవాసాల పరిరక్షణ, భూ జాతుల పరిరక్షణ, జానపద రకాలు, పెంపుడు జంతువులు, సూక్ష్మ జీవులు పరిరక్షణ కోసం బీఎంసీలు డాక్యుమెంటేషన్ చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలంటూ బైక్ యాత్ర

పంజగుట్ట: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి గత 40 రోజులుగా బైక్ యాత్ర చేస్తున్నాడు. యాత్ర నగరానికి చేరుకోవడంతో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. భద్రాచలానికి చెందిన తూతిక ప్రకాష్ గత నెల 10వ తేదీన యాత్ర ప్రారంభించాడు. 40 రోజుల్లో 14 జిల్లాలు, సుమారు 4వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్నాడు. తన బైక్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్, హరీష్‌రావుల ఫొటోలు, బీఆర్‌ఎస్ జెండా ఉంచుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాడు. యాత్ర నగరానికి చేరుకోవడంతో ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని, పెట్రోలు, డిజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.



బైక్ యాత్ర చేస్తున్న ప్రకాష్

సైబర్ టాక్

ఫోన్ పోతే.. ఇలా వెతకండి!



షాపింగ్ నుంచి ఇంటికి వచ్చిన వసుధ తెచ్చిన వస్తువులన్నీ లోపల సర్దేసి, వచ్చి కూచుంది. సడెన్‌గా ఏదో గుర్తుకువచ్చినట్టు అయ్యి ఫోన్ కోసం వెతికింది. చూస్తే, ఎక్కడా కనిపించలేదు. బ్యాగ్, ఇంటి లోపల అంతా చెక్ చేసింది. ఫోన్ కనపడకపోయేసరికి ఒక్కసారిగా మైండ్ బ్లాంక్ అయ్యింది. ఖరీదైన ఫోన్, అందులో వందలాది కాంటాక్ట్ నంబర్లు, ముఖ్యమైన ఫొటోలు.. అనుకునేసరికి కాసేపటి వరకు ఏం చేయాలో అర్థం కాలేదు. తన ముఖ్యమైన డేటా పోతే వచ్చే సమస్యలు తలుచుకుని చెమటలు పట్టేశాయి.

• • •

వసుధ సమస్య చాలామంది ఎదుర్కొనే ఉంటారు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలి? ఫోన్ ట్రాక్ చేయాలన్నా, మన వ్యక్తిగత డేటా సురక్షితంగా ఉండటానికి మార్గమే లేదా? అనుకునేవారికి సరైన సమాధానంగా సిఇఐఆర్ వరదాయినిగా మారింది. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఇఐఆర్)ని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం.

• • •

నకిలీ మొబైల్ ఫోన్‌ల క్రయవిక్రయాలకు అడ్డుకట్టవేయడానికి, మొబైల్ ఫోన్ దొంగతనాన్ని అరికట్టడానికి, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల ద్వారా చట్టబద్ధమైన రక్షణ కలిగించడానికి సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ (సిఇఐఆర్)ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్) ఏర్పాటు చేసింది.

సిఇఐఆర్ పోర్టల్ ప్రయోజనాలు:

https://ceir.gov.in పోర్టల్ పోగొట్టుకున్న లేదా దొంగలించిన మొబైల్ పరికరాలను ట్రాక్ చేయడానికి ఐఎమ్ఇఐ నంబర్‌ను ఉపయోగిస్తుంది. సిఇఐఆర్ ద్వారా మొబైల్ పరికరం బ్లాక్ చేశాక, అది ఏ భారతీయ నెట్‌వర్క్ కంపెనీకి కనెక్ట్ చేయలేరు. ఆ పరికరాన్ని ఇక తిరిగి ఉపయోగించలేనిదిగా మార్చేస్తుంది.

పోర్టల్‌లో మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడానికి..

- ముందుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలి. లేదా కోల్పోయిన డివైజ్ సర్టిఫికెట్ లేదా మీ అక్నాలెడ్జ్ కాపీని తీసుకోవాలి.
- మీ సర్వీస్ ప్రొవైడర్ నుంచి డూప్లికేట్ సిమ్ తీసుకోవాలి.
- సిఇఐఆర్ పోర్టల్‌కు లాగిన్ అయ్యి, కంప్లైంట్ కాపీ, ఐడెంటిటీ (ఆధార్ కార్డ్) ప్రూఫ్‌ని యాడ్ చేయాలి.
  https://www.ceir.gov.in/Request/CeirUserBlockRequestDirect.jsp
- మీ ఫారమ్ సబ్‌మిట్ చేసిన తర్వాత మీ రిక్వెస్ట్ ఐడీ జనరేట్ అవుతుంది.
- మొబైల్ నంబర్‌ను బ్లాక్ చేయడానికి తగిన కారణం ఏంటో తెలియజేయాలి.
- మీ రిజిస్టర్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసి, సబ్‌మిట్ చేయాలి.

ఐఎమ్ఇఐ నంబర్‌ను చెక్ చేయడానికి..

- ముందు పోర్టల్‌కి లాగిన్ అవ్వాలి.
  https://ceir.gov.in/ Device/CeirIMEIVerification.jsp
- మీ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
- మీ మొబైల్‌కి ఓటీపి వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేయాలి.
- 15 అంకెల ఐఎమ్ఇఐ నంబర్‌ను నమోదు చేసి, చెక్ రిక్వెస్ట్ అనే దానిపై క్లిక్ చేయాలి.
- ఐఎమ్ఇఐ నంబర్ ధ్రువీకరణ అవుతుంది.

సిఇఐఆర్ పోర్టల్‌లో మీ రిక్వెస్ట్ స్టేటస్ చెక్ చేయడానికి..

- పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి.
  https://ceir.gov.in/Request/CeirRequestStatus.jsp
- రిక్వెస్ట్ స్టేటస్ ఆప్షన్‌ను చెక్ చేస్తే, తెలిసిపోతుంది.

బ్లాక్ చేస్తే.. పనిచేయదు

బ్లాక్ లిస్ట్ చేసిన మొబైల్ పరికరాలను షేర్ చేయడానికి నెట్‌వర్క్ ఆపరేటర్‌లకు సెంట్రల్ సపోర్ట్ సిస్టమ్‌గా సేవలందిస్తూ, అన్ని మొబైల్ ఆపరేటర్ల ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (ఐఎమ్ఇఐ) డేటాబేస్‌లకు లింక్ చేస్తుంది. సబ్‌స్క్రయిబర్ ఐడెంటిటీ మాడ్యూల్ (సిమ్) కార్డ్ మార్చినప్పటికీ ఒక నెట్‌వర్క్‌లోని బ్లాక్ చేసిన పరికరాలు ఇతర నెట్‌వర్క్‌లలో పనిచేయవని ఇది నిర్ధారిస్తుంది.

పోర్టల్‌లో రికవరీ మొబైల్ ఫోన్‌ని అన్‌బ్లాక్ చేయడానికి..

https://ceir.gov.in/Request/CeirUserUnblockRequestDirect.jsp పోర్టల్‌కు లాగిన్ అవ్వాలి.

- రిక్వెస్ట్ ఐడీని ఎంటర్ చేయాలి.
- మొబైల్ నంబర్‌ను అన్‌బ్లాక్ చేయడానికి కారణాన్ని ఇవ్వాలి.

డివైజ్‌ను గుర్తించాక డేటాను తొలగించడానికి..

- ఆండ్రాయిడ్ డివైజ్ డేటాను లాక్ లేదా ఎరేజ్ చేయడానికి
  https://support.google.com/accounts/answer/6160491?hl=en
- ఐ ఫోన్ అయితే.. iCloud.com లో ఫైండ్ మై ఐఫోన్ అని సెర్చ్ చేసి, డేటా తొలగించాలి.
  https://support.apple.com/en-in/guide/icloud/mmfc0ef36f/icloud

పోయిన మొబైల్ డేటా సురక్షితంగా ఉంచడానికి..

- ఈ పోర్టల్ పూర్తిగా చట్టబద్ధమైనది. ఫోన్ ట్రాక్ చేయడానికి మాత్రమే ఉపయోగిస్తుంది. మీ డేటా, యాప్స్‌ను డీకంపైల్ చేయదు.
  https://reports.exodus-privacy.eu.org/en/
- మీ మొబైల్ నంబర్‌లను నిర్ధారించడానికి, తీసేయడానికి టెలికాం విభాగాం అనుమతిస్తుంది.
  https://tafcop.dgtelecom.gov.in
- ఎస్సెమ్మెస్‌లు, బల్క్ ఎస్సెమ్మెస్‌లు పంపిన వారిని గుర్తించడానికి అనుమతిస్తుంది.
  https://smsheader.trai.gov.in
- ఎస్సెమ్మెస్, వాట్సప్, ఇమెయిల్‌లో వచ్చిన షార్ట్ లింక్స్ మీ వ్యక్తిగత డేటాను డామేజీ చేయవచ్చు. అందుకని, షార్ట్ లింక్స్ పూర్తి యుఆర్ఎల్ వివరాలను https://isitphishing.org/ ద్వారా చెక్‌చేయవచ్చు.
- యాంటీవైరస్, యాంటీ మాల్వేర్, సెక్యూరిటీ యాప్‌లను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసి ఉంటే వాటిని గుర్తించడంలో సహాయపడుతుంది.
- అన్ని అప్లికేషన్లు, సోషల్‌మీడియా, ఇమెయిల్ అకౌంట్స్ కోసం రెండంచెల ప్రామాణీకరణను ఉపయోగిస్తే, డేటా సురక్షితంగా ఉంటుంది.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

• చేతన

అపూర్వ అక్షరయానం

అక్షరం అంటే తిరుగులేని వజ్రాయుధం.

చిత్రం అంటే వంద పదాల ప్రతిబింబం.

దేబస్మిత దాస్‌గుప్తా దగ్గర ఆ రెండు శక్తులు కలగలిసిన 'అక్షర చిత్రం' అనే అపూర్వ శక్తి ఉంది.

గ్రాఫిక్ నవల రచయిత్రిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్మిత తాజాగా 'టెర్మినల్–3' గ్రాఫిక్ నవలతో పలకరించింది...

కోల్‌కత్తాకు చెందిన దేబస్మిత దాస్‌గుప్తాకు చిన్న వయసులోనే కళతో పరిచయం ఏర్పడింది. తండ్రి నాటకరంగ కళాకారుడు. ఆయనతోపాటు నాటకాల రిహార్సల్స్‌కు వెళ్లేది. బలమైన సామాజిక సందేశంతో కూడిన నాటకాలు అవి. అలా స్మితకు సామాజిక స్పృహ చిన్న వయసులోనే ఏర్పడింది.

కొన్ని సంవత్సరాల క్రితం...

స్మిత ఒక సదస్సులో అఫ్గానిస్థాన్‌కు చెందిన ఉమెన్ రైట్స్ ఛాంపియన్ షబానా బసిజి ఉపన్యాసం విన్నది.

తాలిబన్‌ల తొలి పాలనలో షబానా చదువు అటకెక్కే పరిస్థితి వచ్చింది. చాలామంది తండ్రులు రాజీపడి పిల్లల చదువును మాన్పించారు. షబానా తండ్రి మాత్రం 'ససేమిరా' అన్నాడు.

'ఏ పరిస్థితి ఎదుర్కోవడానికైనా సిద్ధం' అంటూ కూతురిని పట్టుదలగా చదివించాడు.

కూతురుపై తండ్రి ప్రేమ, సవాళ్లకు వెనకాడని నైజం స్మితను చలింపజేసింది. ఈ తండ్రి–కూతురు కథకు బొమ్మలు వేసి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తే ప్రపంచం నలుమూలల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది.

'ద్వేషం కంటే ప్రేమ వందల రెట్లు శక్తిమంతమైనది'

'ఎక్కడైతే విద్య ఉంటుందో అక్కడ ఆశ ఉంటుంది. ఆత్మబలం ఉంటుంది'

'మార్పుని పరిశీలించే అబ్జర్వర్‌ని మాత్రమే కాదు. ఛేంజ్‌మేకర్‌ని కూడా'... ఇలాంటి మాటలు ఆకట్టుకుంటాయి.

ఫేస్‌బుక్‌లో వచ్చిన స్పందన ఉత్సాహంతో ఇలాంటి తండ్రీకూతుళ్ల స్టోరీల కోసం వెదికి పట్టుకుంది. వాటికి 'మై ఫాదర్' పేరుతో ఆన్‌లైన్ ఇలస్ట్రేషన్ సిరీస్ మొదలుపెట్టింది.

ఆలోచనలు, హక్కులు, చైతన్యం... మహిళలకు సంబంధించిన సకల కోణాలకు ఈ సిరీస్ వేదికగా నిలిచింది.

సోషల్ మీడియాకు మాత్రమే పరిమితం కాకుండా స్థానిక సంస్థలు, కమ్యూనిటీలతో కలిసి కోల్‌కత్తా, దిల్లీ, ముంబై... మొదలైన నగరాల్లో ఆర్ట్‌క్యాంప్‌లు నిర్వహించింది.

తండ్రి–కూతురు బంధాల బలోపేతం లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ఆర్ట్ క్యాంప్‌లకు మంచి స్పందన లభించింది. బాల్యవివాహల నుంచి వరకట్నం వరకు రకరకాల అంశాలపై చర్చ జరిగింది.

మాస్ కమ్యూనికేషన్ చదువుకున్న స్మిత సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఏషియా–యూరప్ ఫౌండేషన్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేసింది.

'ఆర్ట్స్ పాజిటివ్' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టి ఇలస్ట్రేటెడ్ బేస్డ్ సోషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

అనగనగా ఒకరోజు...

న్యూ దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో 'న్యూ దిల్లీ టు శాన్‌ఫ్రాన్సిస్కో' ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఆలస్యానికి సంబంధించిన ప్రకటన వినిపించింది.

టెర్మినల్–3 వెయిటింగ్ హాల్‌లో కూర్చున్న ఒక తల్లి ఒడిలోని పాప గుక్కపట్టి ఏడుస్తోంది. పాపకు పాలు పట్టడానికి తల్లి విఫలప్రయత్నం చేస్తోంది. హాల్లో కూర్చున్న వారిలో కొందరు పాప ఏడుపు విని అసహనానికి గురవుతున్నారు.

శ్రీనగర్‌కు చెందిన ఆ తల్లి పేరు...ఖ్వాబ్ నజీర్. వయసు పదిహేడు సంవత్సరాలు.


శ్రీనగర్‌లో ఉండే ఖ్వాబ్ నజీర్ దిల్లీ విమానాశ్రయానికి ఎందుకు వచ్చింది? ఆమె ఎందుకు ఆందోళనగా ఉంది? అసలు ఆమె ఎవరు? అనేది తెలుసుకోవాలంటే 'టెర్మినల్–3'కు వెళ్లాల్సిందే.

దేబస్మిత దాస్‌గుప్తా రాసిన తాజా గ్రాఫిక్ నవల... టెర్మినల్–3

కాశ్మీర్ లోయ నేపథ్యంగా సాగే ఈ గ్రాఫిక్ నవల ఖ్వాబ్ నజీర్ పాత్ర ద్వారా ఎన్నో సామాజిక అంశాలపై సూటిగా మాట్లాడకుండానే మాట్లాడుతుంది. ఇక చిత్రాల ద్వారా చలనచిత్రాన్ని చూసిన అనుభూతి కలుగుతుంది.



దేబస్మిత దాస్‌గుప్తా





బాల్టీ గోష్

రంజాన్ స్పెషల్ రెసిపీ

కావలసినవి: మటన్ – అర కేజీ; నూనె– 5 టేబుల్ స్పూన్‌లు; **ఉల్లిపాయలు** – 2 (చిన్న ముక్కలు తరగాలి); **అల్లంవెల్లుల్లి పేస్ట్** – 2 టేబుల్ స్పూన్‌లు; **మిరప్పొడి**– 2 టీ స్పూన్‌లు; **ధనియాల పొడి**– టీ స్పూన్; **ఉప్పు**– టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **యాలకులు** – 3; **లవంగాలు** – 3; **దాల్చిన చెక్క** – అంగుళం ముక్క; **జీలకర్ర** – అర టీ స్పూన్; **బిర్యానీ ఆకు** – 1; **పెరుగు**– 3 టేబుల్ స్పూన్‌లు; **టొమాటో ప్యూరీ**– టేబుల్ స్పూన్ (అవసరమైతేనే); **పచ్చిమిర్చి**– 4; **కొత్తిమీర తరుగు**– 4 టేబుల్ స్పూన్‌లు; **గరం మసాలా పొడి**– అర టీ స్పూన్; **నిమ్మకాయ** – 1.

తయారీ: • మటన్‌ని శుభ్రం చేసి ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించి పక్కన పెట్టుకోవాలి. • మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. అందులోనే అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించి అందులో ముందుగా ఉడికించి సిద్ధంగా ఉంచిన మటన్ (నీటితో సహా) వేయాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, ఉప్పు, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, జీలకర్ర, బిర్యానీ ఆకు వేసి కలిపి కప్పు నీటిని పోసి ఉడికించాలి. • ఇప్పుడు టొమాటో ప్యూరీ సిద్ధం చేసుకోవాలి. రెండు టొమాటోలను వేడి నీటిలో ఉడికించి తొక్క, గింజలు తొలగించి మిక్సీలో గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. అలాగే పెరుగును చిలికి పక్కన పెట్టాలి. • మాంసం ముక్కలకు మసాలాలు బాగా పట్టి, ముక్క మెత్తబడిన తరవాత అందులో పచ్చిమిర్చి, పెరుగు, టొమాటో ప్యూరీ వేసి కలిపి మంట తగ్గించి మరికొంత సేపు ఉడికించాలి. చివరగా కొత్తిమీర వేసి కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. మెల్లగా వేడి తగ్గే కొద్దీ కర్రీ రుచి ఇనుమడిస్తుంది.

ఇది బిర్యానీ, బగారా రైస్, చపాతీ, పుల్కాల్లోకి కూడా మంచి కాంబినేషన్.

• ఎంపవర్‌మెంట్

ఇల్లాలి ఇంటికల నిజం చేసింది ఇలా...

'ఇల్లు కట్టి చూడు' అన్నారు పెద్దలు. అయితే చాలామందికి ఇంటి కల 'కల'కు మాత్రమే పరిమితమైపోతుంది, గృహరుణాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ఎంతోమంది మహిళల సొంత ఇంటి కలను నిజం చేసింది కాజల్ ఇల్మీ...



గ్రామీణ మహిళలతో కాజల్ ఇల్మీ

మధ్యప్రదేశ్‌లోని దేవాస్ గ్రామానికి చెందిన బబిత సిసోదియ, రాజస్థాన్‌లోని గంగానగర్‌కు చెందిన బల్వీందర్ కౌల్ సొంత ఇంటి కల ఎప్పటికప్పుడు దూరం అవుతూనే ఉంది. ఏవో కారణాల వల్ల అందాల్సిన రుణం అందడం లేదు.

'ఇక ఇది అయ్యేది కాదు' అని వారు నిరాశలోకి జారుకునే సమయంలో ఎడ్‌హెరింగ్ టు విజన్ ఆఫ్ ఇన్‌క్లూజన్ ఆఫ్ మాసెస్ (ఏవీఐవోఎం) వేగుచుక్కలా కనిపించింది. 'ఏవీఐవోఎం' అందించిన రుణాలతో తమ సుదీర్ఘ కాల సొంత ఇంటి కలను ఆ ఇద్దరే కాదు ఎన్నో గ్రామాలలో ఎంతోమంది మహిళలు నిజం చేసుకోగలిగారు.

గ్రామీణ ప్రాంతాలు, ఒక మాదిరి పట్టణాలలోని మహిళలకు గృహరుణాలు అందించడానికి కాజల్ ఇల్మీ 'ఏవీఐవోఎం' అనే హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీని ప్రారంభించింది.

చైనా, డెన్మార్క్, యూఎయి, ఒమన్, బహ్రెయిన్, మంగోలియా, హాంకాంగ్‌లాంటి ఎన్నోచోట్ల చదువుకున్న కాజల్ ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచాన్ని చదివింది. గత పన్నెండు సంవత్సరాలుగా మానవ హక్కుల ఉద్యమాలలో చురుగ్గా పాల్గొంటోందామె.

దేశంలోని ప్రసిద్ధ కంపెనీలలో పది సంవత్సరాలకు పైగా పనిచేసిన కాజల్ 'ఏవీఐవోఎం' ఆలోచన చేసినప్పుడు 'చాలా పెద్ద రిస్క్' అన్నారు చాలామంది.

సరియైన డాక్యుమెంటేషన్ లేకపోవడం, తిరుగు చెల్లింపు సామర్థ్యంపై సంశయాల వల్ల హెచ్ఎఫ్‌సీ(హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీ)లు, ప్రభుత్వరంగ సంస్థలు గ్రామీణప్రాంతాల వారికి రుణాలు ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నాయి. దీన్ని పట్టించుకోకుండా 'ఏవీఐవోఎం'కు శ్రీకారం చుట్టి విజయపథంలో నడుస్తోంది కాజల్.

'రన్ బై ఉమెన్ ఫర్ ఉమెన్' నినాదంతో మొదలైన ఈ కంపెనీకి పద్నాలుగు రాష్ట్రాలలో శాఖలు ఉన్నాయి. వీటిని శక్తి శాఖలు అని పిలుస్తారు. ఈ శాఖలలో పనిచేసే 55,000 మంది మహిళలను 'శక్తి'గా వ్యవహరిస్తారు.

ఫ్లెక్సిబుల్ లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ ప్లాన్‌తో 'ఏవీఐవోఎం' రీపేమెంట్ స్ట్రక్చర్‌కు రూపకల్పన చేసింది.

50,000 మంది కస్టమర్‌లలో 30 కేసులలో రీపేమెంట్ అనేది ఆలస్యం అవుతోంది.

శానిటేషన్ లోన్స్‌పై ప్రత్యేకదృష్టి సారించింది కంపెనీ.

'మహిళలకు శానిటేషన్ సౌకర్యం అనేది అత్యవసరం. ఎన్నో బడులలో టాయిలెట్ సదుపాయం లేకపోవడం వల్ల ఆడపిల్లలు చదువు మానేస్తున్నారు' అంటున్న కాజల్ స్థానిక పాఠశాలలో శానిటేషన్ సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తోంది.

కంపెనీ వల్ల పేద, మధ్యతరగతి సొంత ఇంటికల నెరవేరడం ఒక కోణం అయితే, ఎన్నో గ్రామాలలో ఎంతోమంది మహిళలకు ఉపాధి దొరకడం మరో కోణం.

'ఒకప్పుడు నేను మా వాడలో కొద్దిమందికి మాత్రమే తెలుసు. కంపెనీలో ఉద్యోగం వల్ల జరిగిన పెద్ద మార్పు ఏమిటంటే ఇప్పుడు ఊళ్లో ప్రతి ఒక్కరికీ నేను తెలుసు. ఇది ఒక రకంగా గర్వంగా ఉంది' అంటోంది బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌లోని అగర్వాడా గ్రామానికి చెందిన విశాల.

చాలామంది మహిళలు భర్త పేరు లేదా ఇతర కుటుంబ సభ్యుల పేరు మీద రుణాలు తీసుకోవడాన్ని కాజల్ గమనించింది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని తమ పేరు మీదే రుణం తీసుకునేలా, ఆస్తిలో సహ–యజమానిగా ఉండేలా మహిళలను ప్రోత్సహించింది.

'భర్తతో విభేదాల వల్ల ఇల్లు దాటి బయటికొచ్చిన వారు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంటి యాజమాన్య హక్కు తమకు కూడా ఉంటే ఎవరికీ భయపడాల్సిన అవసరం ఉండదు. దీంతోపాటు మహిళలు ఆస్తిలో భాగం అయితే రుణాలు తీసుకోవడం సులువు అవుతోంది' అంటోంది కాజల్.

'మహిళలతో సానుకూల మార్పు సాధ్యపడుతుంది' అంటున్న కాజల్ ఇల్మీ 2023 చివరికల్లా లక్ష టాయిలెట్‌ల నిర్మాణానికి ఫండింగ్ చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించుకుంది. 2026 కల్లా గ్రామీణప్రాంతాలలో అత్యధిక మంది మహిళలకు ఉపాధి కల్పించాలనేది ఆమె రెండో స్వప్నం. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.

బ్యూటిప్



బంగాళాదుంప గుజ్జు, శనగ పిండి, అలొవెరా జెల్ కలిపి మిశ్రమం తయారుచేసుకోవాలి. దీనిని ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని, పదినిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

• విశేషం

సంబల్‌పురీ చీరకట్టి సంబురంగా పరుగెట్టీ

మొన్నటికి మొన్న గ్వాలియర్‌లో...

చీరె ధరించి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొని సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు మహిళామణులు.

తాజాగా...

మాంచెస్టర్ మారథాన్‌లో చీరె ధరించి పాల్గొని 'శభాష్' అని ప్రశంసలు అందుకుంటోంది మధుస్మిత జెన...





మధుస్మిత జెన

చిన్నప్పటి నుంచి మధుస్మితకు పరుగెత్తడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకువచ్చింది.

మాంచెస్టర్‌లో హైస్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న మధుస్మిత జెన నార్త్ వెస్ట్ ఇంగ్లాండ్ ఒడియా కమ్యూనిటీలో క్రియాశీల కార్యకర్త.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మారథాన్‌లు, అల్ట్రా మారథాన్‌లలో పాల్గొంది.

తాజాగా మాంచెస్టర్‌లో 42.5 కి.మీల మారథాన్‌లో పాల్గొంది. ఈసారి మాత్రం అందరూ ఆశ్చర్యపడేలా చేసింది. అభినందనలు అందుకుంది.

ఈసారి ప్రత్యేకత...సంబల్‌పురీ చీర కట్టి మారథాన్‌లో పాల్గొంది మధుస్మిత.

'అంతదూరం చీరతో పరుగెత్తడం సులువేమీ కాదు' అంటున్న మధుస్మిత సంతోషం ప్లస్ సంకల్పబలంతో నాలుగు గంటల యాభైనిమిషాలలో లక్ష్యాన్ని పూర్తి చేసింది.

'చీరతో మారథాన్‌లో పాల్గొనడం అసాధ్యం అనేది చాలామంది నమ్మకం. ఇది తప్పని రుజువు చేయాలనుకున్నాను' అంటుంది 41 సంవత్సరాల మధుస్మిత.

'తనలోని ప్రతిభతో ఎప్పుడూ ఎంతోమందికి స్మిత స్ఫూర్తి ఇస్తుంటుంది. ఆమె విజయానికి గర్విస్తున్నాం' అంటున్నాడు ఒడియా కమ్యూనిటీ మాజీ కార్యదర్శి సుకాంత్ కుమార్ సాహు.

ఒడిశాలోని కుస్పూర్ గ్రామానికి చెందిన మధుస్మితకు తల్లి, అమ్మల ద్వారా చీరెపై ఇష్టం ఏర్పడింది. ఇంగ్లాండ్‌లో ప్రత్యేకమైన సందర్భాలు, వేసవిలో చీర ధరిస్తుంది మధుస్మిత.

నాలుగో సీడ్ జోడీపై బోపన్న ద్వయం గెలుపు



బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (7/4), 3-6, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో నాలుగో సీడ్ మాట్ పావిచ్-నికోలా మెక్టిక్ (క్రొయేషియా) జోడీపై సంచలన విజయం సాధించింది. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం మూడు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది.

'టాప్' ర్యాంక్‌లోనే సూర్యకుమార్ యాదవ్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ తన టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ 906 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. పాకిస్తాన్ బ్యాటర్లు మొహమ్మద్ రిజ్వాన్ (798 పాయింట్లు), బాబర్ ఆజమ్ (769 పాయింట్లు) వరుసగా రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు. విరాట్ కోహ్లి 15వ ర్యాంక్‌లో మార్పు లేదు.

భారత జట్లకు నిరాశ



అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత మహిళల, పురుషుల జట్లకు నిరాశ ఎదురైంది. మహిళల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి, అవ్‌నీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. క్వాలిఫయింగ్‌లో టాప్ ర్యాంక్‌లో నిలిచిన భారత జట్టుకు నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడే అవకాశం లభించింది. మాడిసన్ కాక్స్, డానిలె లుట్జ్, కాసిడి కాక్స్‌లతో కూడిన అమెరికా జట్టు 233-225 పాయింట్ల తేడాతో భారత జట్టును ఓడించింది. ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె, రజత్ చౌహాన్, ప్రథమేశ్ సమాధాన్ జావ్కర్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు రెండో రౌండ్‌లో 234-236 పాయింట్ల తేడాతో చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయింది.

సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీకి భారత జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ సుదిర్మన్ కప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. మే 14 నుంచి 21 వరకు చైనాలోని సుజౌలో ఈ టోర్నీ జరుగుతుంది. గ్రూప్ 'సి'లో మలేసియా, చైనీస్ తైపీ, ఆస్ట్రేలియా జట్లతో భారత జట్టు ఆడుతుంది. పురుషుల, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒక్కో మ్యాచ్ జరుగుతుంది.

భారత జట్టు: ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ (పురుషుల సింగిల్స్), పీవీ సింధు, అనుపమ (మహిళల సింగిల్స్), సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, ఎంఆర్ అర్జున్-ధ్రువ్ కపిల (పురుషుల డబుల్స్), పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (మహిళల డబుల్స్), తనీషా క్రాస్టో-సాయిప్రతీక్ (మిక్స్‌డ్ డబుల్స్).

రాజస్తాన్ బోల్తా

- 10 పరుగులతో నెగ్గిన లక్నో
- రాణించిన మేయర్స్, అవేశ్
- చేతులెత్తేసిన రాయల్స్ బ్యాటర్లు



జైపూర్: మైదానంలో మెరుపులు... గ్యాలరీలో ప్రేక్షకుల అరుపులు కరువైన ఈ ఐపీఎల్ మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. మేయర్స్ (42 బంతుల్లో 51; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. అశ్విన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 144 పరుగులకే పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (35 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బట్లర్ (41 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. అవేశ్ ఖాన్ 3 వికెట్లు, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ 2 వికెట్లు పడగొట్టారు.

మేయర్స్ అర్ధశతకం



మెయిడిన్ ఓవర్‌తో మొదలైన లక్నో ఇన్నింగ్స్‌లో మెరుపులు తక్కువే! కేఎల్ రాహుల్, కైల్ మేయర్స్ ఇద్దరు పవర్ హిట్టర్లు పవర్ ప్లేలో ఉన్నప్పటికీ చేసింది 37 పరుగులే! 8, 9వ ఓవర్లలో ఇద్దరు సిక్స్‌లు, ఫోర్లు బాదడంతో స్కోరు వేగం పుంజుకుంది. కానీ తర్వాత రాజస్తాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 10 ఓవర్లకు పైగానే ఓపెనింగ్ జోడీ ఉన్నా చెప్పుకోదగ్గ స్కోరేం రాలేదు. రాహుల్ (32 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్)ను హోల్డర్ పెవిలియన్ చేర్చడంతో 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. ఇది మంచి ఆరంభమే అయినా... సూపర్ జెయింట్స్ మాత్రం దీన్ని భారీస్కోరుగా మలుచుకోలేకపోయింది. మేయర్స్ 40 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అశ్విన్ ఒకే ఓవర్లో దీపక్ హుడా (2), మేయర్స్ వికెట్లను పడేశాడు. స్టొయినిస్ (16 బంతుల్లో 21; 2 ఫోర్లు), పూరన్ (20 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా మెరిపించలేకపోయారు. సందీప్ శర్మ వేసిన ఆఖరి ఓవర్లో స్టొయినిస్ కీపర్ క్యాచ్‌తో నిష్క్రమించగా, పూరన్, యుధ్‌వీర్ (1) రనౌటయ్యారు.

శుభారంభం వచ్చినా...

రాజస్తాన్ ఇన్నింగ్స్ కూడా లక్నోలాగే సాగింది. దంచికొట్టే ఓపెనర్లు బట్లర్, యశస్వి జైస్వాల్ 11 ఓవర్లకు పైగా క్రీజులో ఉన్నప్పటికీ ప్రేక్షకుల్ని ఊపేసే మెరుపులేమీ కనిపించలేదు. పవర్ ప్లేలో ఓపెనింగ్ జోడీ 47 పరుగులు చేసింది. పిచ్ పరిస్థితుల దృష్ట్యా ఇద్దరు చూసుకొని ఆడారు. సగం ఓవర్లు (10) ముగిసేసరికి 73/0 స్కోరు చేసింది. స్టొయినిస్ 12వ ఓవర్లో జైస్వాల్ డీప్ మిడ్‌వికెట్ మీదుగా భారీ సిక్సర్ కొట్టాడు. కానీ అదే ఓవర్లో అవేశ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 87 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఇంత దాకా బాగానే ఉన్నా... వరుస ఓవర్లలో కీలకమైన సామ్సన్ (2), బట్లర్ వికెట్లను కోల్పోవడంతో రాజస్తాన్‌కు లక్ష్యం కష్టమైంది. 15వ ఓవర్లో జట్టు స్కోరు 100 దాటింది. 30 బంతుల్లో 51 పరుగులు చేయాల్సిన దశలో డాషింగ్ బ్యాటర్ హెట్‌మైర్ (2) భారీషాట్‌కు యత్నించి నిష్క్రమించడంతో ఓటమి ఖాయమైంది. 'ఇంపాక్ట్ ప్లేయర్' పడిక్కల్ (21 బంతుల్లో 26; 4 ఫోర్లు) అడపాదడపా కొట్టిన బౌండరీలు జట్టును గెలిపించలేకపోయాయి.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: రాహుల్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 39; మేయర్స్ (బి) అశ్విన్ 51; బదోని (బి) బౌల్ట్ 1; దీపక్ హుడా (సి) హెట్‌మైర్ (బి) అశ్విన్ 2; స్టొయినిస్ (సి) సామ్సన్ (బి) సందీప్ 21; పూరన్ (రనౌట్) 29; కృనాల్ పాండ్యా (నాటౌట్) 4; యుధ్‌వీర్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 154. **వికెట్ల పతనం:** 1-82, 2-85, 3-99, 4-104, 5-149, 6-153, 7-154. **బౌలింగ్:** బౌల్ట్ 4-1-16-1, సందీప్ శర్మ 4-0-32-1, అశ్విన్ 4-0-23-2, చహల్ 4-0-41-0, హోల్డర్ 4-0-38-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) అవేశ్ (బి) స్టొయినిస్ 44; బట్లర్ (సి) బిష్ణోయ్ (బి) స్టొయినిస్ 40; సంజూ సామ్సన్ (రనౌట్) 2; పడిక్కల్ (సి) పూరన్ (బి) అవేశ్ 26; హెట్‌మైర్ (సి) రాహుల్ (బి) అవేశ్ 2; పరాగ్ (నాటౌట్) 15; ధ్రువ్ జురేల్ (సి) హుడా (బి) అవేశ్ 0; అశ్విన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 144. **వికెట్ల పతనం:** 1-87, 2-93, 3-97, 4-104, 5-141, 6-141. **బౌలింగ్:** నవీనుల్ హఖ్ 4-0-19-0, యుధ్‌వీర్ 2-0-27-0, అవేశ్ ఖాన్ 4-0-25-3, స్టొయినిస్ 4-0-28-2, రవి బిష్ణోయ్ 4-0-25-0, అమిత్ మిశ్రా 2-0-15-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
పంజాబ్	5	3	2	6	-0.109
ముంబై	5	3	2	6	-0.164
కోల్‌కతా	5	2	3	4	0.320
బెంగళూరు	5	2	3	4	-0.318
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	5	0	5	0	-1.488

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × బెంగళూరు (మ. గం. 3:30 నుంచి)
ఢిల్లీ × కోల్‌కతా (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సిరాజ్...'జట్టు' సంగతులు చెప్పు

- అపరిచితుడి మెసేజ్‌పై అప్రమత్తమైన పేసర్
- వెంటనే బోర్డుకు ఫిర్యాదు



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో మళ్లీ ఫిక్సింగ్ కలకలం! అయితే ఈసారి క్రికెట్ బోర్డు తక్షణ చర్యలతో మొగ్గలోనే తుంచేసింది. నిలకడైన ప్రదర్శనతో అగ్రశ్రేణి సీమర్‌గా ఎదుగుతున్న హైదరాబాదీ మొహమ్మద్ సిరాజ్ ఇప్పుడు టీమిండియాలో స్థిరమైన ఆటగాడు. దీంతో హైదరాబాద్‌కే చెందిన ఓ డ్రైవర్ అతని వ్యక్తిగత ఫోన్‌నంబర్ తెలుసుకొని వాట్సాప్ సందేశాలు పంపాడు. జట్టు అంతర్గత సమాచారం ఇస్తే పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తానని మెసేజ్ చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ జరుగుతున్న సమయంలో సిరాజ్‌కు వాట్సాప్ మెసేజ్‌లు చేశాడు. వెంటనే 29 ఏళ్ల సీమర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ పోలీసులు డ్రైవర్ కదలికలపై నిఘా వేసి ఆంధ్రప్రదేశ్‌లో పట్టుకున్నారు. విచారణలో నిందితుడికి ఫిక్సింగ్, ఇతరత్రా నేర చరిత్ర లేదని తేలింది. క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడిన అతను అదే వ్యసనంగా మారి పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయాడు. దీంతో తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, జట్టు సంగతులు చెప్పి సాయం చేయాలని సిరాజ్‌ను సంప్రదించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ప్రస్తుత ఐపీఎల్‌కు సంబంధించిన అంశం కాదని ఏసీయూ అప్రమత్తతతో నిందితుడిని అరెస్టు చేసినట్లు బోర్డు వర్గాలు తెలిపాయి.

'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుదే చెస్ టైటిల్



అస్తానా: కజకిస్తాన్, రెస్ట్ ఆఫ్ ద వరల్డ్ మహిళల జట్ల మధ్య జరిగిన చెస్ టోర్నమెంట్‌లో 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టు పైచేయి సాధించి టైటిల్ దక్కించుకుంది. బుధవారం ముగిసిన టోర్నీలో 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టు బ్లిట్జ్ ఈవెంట్‌లో 38.5-25.5 పాయింట్ల తేడాతో... ర్యాపిడ్ ఈవెంట్‌లో 34.5-29.5 పాయింట్ల తేడాతో కజకిస్తాన్ జట్టును ఓడించింది. భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ద్రోణవల్లి హారిక, తమిళనాడుకు చెందిన మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం) సవితాశ్రీ 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హారిక, సవితాశ్రీలతోపాటు నానా జాగ్‌నిడ్జె (జార్జియా), హూ ఇఫాన్ (చైనా), గునె మమద్‌జాదా (అజర్‌బైజాన్), సోకా గాల్ (హంగేరి), అఫ్రూజా ఖమ్‌దమోవా (ఉజ్బెకిస్తాన్), నుర్గుల్ సలిమోవా (బల్గేరియా) కూడా 'రెస్ట్ ఆఫ్ ద వరల్డ్' జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. కజకిస్తాన్ జట్టు తరఫున దినారా, బిబిసారా, మెరూర్ట్, జన్సాయా అబ్దుమలిక్, జెనియా బలబయేవా, లియా, అలువా నుర్మనోవా, జరీనా పోటీపడ్డారు.

వార్నర్ స్థానం పదిలం



మెల్‌బోర్న్: భారత్‌తో జరిగే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ కోసం.. ఇంగ్లండ్‌లో జరిగే యాషెస్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. 17 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కొంతకాలంగా ఫామ్‌లో లేని స్టార్ ప్లేయర్ డేవిడ్ వార్నర్‌కు చోటు లభించింది. డబ్ల్యూటీసీ ఫైనల్ జూన్ 7 నుంచి 11 వరకు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరుగుతుంది. అనంతరం జూన్ 16 నుంచి బర్మింగ్‌హామ్‌లో ఇంగ్లండ్‌తో జరిగే తొలి టెస్ట్‌తో యాషెస్ సిరీస్ మొదలవుతుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం 15 మందితో తుది జట్టును మే 28న ప్రకటిస్తామని క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది.

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు: కమిన్స్ (కెప్టెన్), బోలండ్, క్యారీ, గ్రీన్, హారిస్, హాజల్‌వుడ్, హెడ్, ఇంగ్లిస్, ఖ్వాజా, లబుషేన్, లయన్, మిచెల్ మార్ష్, మర్ఫీ, రెన్‌షా, స్మిత్, స్టార్క్, వార్నర్.

సినిమా

వెయ్యిమంది ఫైటర్స్‌తో...




దాదాపు వెయ్యిమంది ఫైటర్స్‌తో పోరాడటానికి రెడీ అవుతున్నారట రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న సినిమా 'గేమ్ చేంజర్'. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్నారు. తాజాగా 'గేమ్ చేంజర్' క్లైమాక్స్ చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ రెడీ అవుతున్నట్లు తెలిసింది. హైదరాబాద్ శివార్లలో ఆల్రెడీ ఈ ఫైట్ కోసం సెట్ వర్క్ కూడా పూర్తి చేశారట. ఈ నెల చివరి వారంలో ప్రారంభం కానున్న ఈ క్లైమాక్స్ చిత్రీకరణ వచ్చే నెల తొలి వారం వరకూ జరుగుతుందని సమాచారం. కాగా ఈ ఫైట్ చిత్రీకరణలో దాదాపు వెయ్యిమంది స్టంట్‌మ్యాన్‌లు పాల్గొంటారట. అలాగే 'కేజీఎఫ్' యాక్షన్ కొరియోగ్రాఫర్స్ అన్బు అండ్ అరివు ఈ క్లైమాక్స్ ఫైట్‌ను కొరియోగ్రాఫ్ చేయనున్నట్లు సమాచారం. ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే.

● రామ్‌చరణ్

మళ్లీ వస్తున్న రానా నాయుడు

రానా నాయుడు మళ్లీ వస్తున్నాడు. వెంకటేశ్, రానా లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. అమెరికన్ టీవీ సిరీస్ 'రే డొనోవన్' ఆధారంగా రూపొందిన ఇండియన్ వెర్షన్ 'రానా నాయుడు'కు కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహించారు. ఇందులో సెలబ్రిటీల సమస్యలు తీర్చే వ్యక్తి రానా నాయుడు పాత్రలో రానా, అతని తండ్రి నాగ నాయుడు పాత్రలో వెంకటేశ్ నటించారు. ఈ వెబ్ సిరీస్ తొలి సీజన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో మార్చి 10 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. 'రానా నాయుడు' సెకండ్ సీజన్ త్వరలోనే వీక్షకుల ముందుకు రానుంది. ''సీజన్ 2 కోసం నాయుడూస్ బిజీగా ఉన్నారు. త్వరలోనే 'రానా నాయుడు' సెకండ్ సీజన్ రాబోతోంది'' అని హీరో రానా పేర్కొన్నారు.



● వెంకటేశ్, రానా

ఆదిపురుష్‌లో భాగం కావడం అదృష్టం

– ప్రభాస్



''న్యూయార్క్‌లోని ట్రిబెకా ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'ఆదిపురుష్' చిత్రం వరల్డ్ ప్రీమియర్‌ను ప్రదర్శించనుండటం గర్వంగా ఉంది. మన దేశ నైతికతకు అద్దం పట్టే ఈ సినిమాలో భాగం కావడం నా అదృష్టం'' అన్నారు ప్రభాస్. ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటించిన 'ఆదిపురుష్' చిత్రం జూన్ 16న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. కాగా జూన్ 7 నుంచి 18 వరకు జరిగే ట్రిబెకా ఫెస్టివల్‌లో భాగంగా జూన్ 13న 'ఆదిపురుష్' చిత్రం వరల్డ్ ప్రీమియర్‌ని (త్రీడీ) ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ– ''మన భారతీయ చిత్రాలను ఇతర దేశాల్లో చూడటం, ముఖ్యంగా 'ఆదిపురుష్' ప్రపంచ స్థాయికి చేరుకోవడం ఒక నటుడిగానే కాకుండా భారతీయుడిగా గర్వంగా ఉంది'' అన్నారు. ''ఆదిపురుష్' సినిమా కాదు.. భారతదేశ స్ఫూర్తితో ప్రతిధ్వనించే కథ. మన సంస్కృతిలో బాగా పాతుకుపోయిన కథను ప్రపంచ వేదికపై ప్రదర్శించబోతుండటం హ్యాపీ'' అన్నారు ఓం రౌత్. ''భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం మనందరికీ నిజంగా గర్వకారణం'' అన్నారు నిర్మాత భూషణ్ కుమార్. కృతీ సనన్, సైఫ్ అలీ ఖాన్, సన్నీ సింగ్ నటించిన ఈ చిత్రానికి నిర్మాతలు: భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్, ఓం రౌత్, ప్రసాద సుతారియా, రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్, యూవీ క్రియేషన్స్ ప్రమోద్, వంశీ.

నాకు మళ్లీ మాటలు నేర్పించారు

– సాయిధరమ్ తేజ్

"బైక్ డ్రైవ్ చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మన కుటుంబాల కోసమైనా హెల్మెట్ పెట్టుకోవాలి. నాకు యాక్సిడెంట్ జరిగినప్పుడు హెల్మెట్ కాపాడింది" అని సాయిధరమ్ తేజ్ అన్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు .బి సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. "భారీ యాక్సిడెంట్ తర్వాత విడుదలవుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ పట్ల చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. దర్శకుడు సుకుమార్ స్క్రీన్‌ప్లే ఈ సినిమాను మరో స్థాయికి తీసుకుని వెళ్లింది" అంటూ మరిన్ని విశేషాలను సాయిధరమ్ తేజ్ ఈ విధంగా చెప్పారు.



● 1989–90 మధ్య ఓ గ్రామం అనుమానాస్పద హత్యలతో భయానకంగా మారుతుంది. హత్యలు ఎవరు చేశారు? గ్రామానికి చేతబడి ఎందుకు చేశారన్న వాటిని వెతుకుతూ హీరో చేసే ప్రయాణమే 'విరూపాక్ష' సినిమా. నేను చేతబడిని నమ్మను. ఆంజనేయుడ్ని నమ్ముతాను. ఆయన తోడుంటే మనకు ఏం కాదని నమ్ముతాను. విరూపాక్ష అంటే రూపం లేని కన్ను అని అర్థం. శివుడి పేరు. రూపం లేని వాటితో హీరో చేసే సంఘర్షణ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది.

● యాక్సిడెంట్ తర్వాత నేను సినిమాలు చేస్తానా... లేదా అని చాలామంది సందేహించారు. యాక్సిడెంట్ నాకు చాలా నేర్పింది. మా అమ్మ నన్ను ఈ వయసులో చిన్న పిల్లోడిలా చూసుకుంటూ నా మాటలు తడబడుతున్నా ధైర్యం నింపి ప్రోత్సహించారు. 36 ఏళ్ల వయసులో నాకు మళ్లీ మాటలు నేర్పించారు. ఈ ప్రపంచంలో అమ్మ తర్వాతే ఎవరైనా. ● ఈ సినిమా కోసం వర్క్ షాప్స్ చేసిన సమయంలో నా పరిస్థితి అంత బాగా లేదు. నేను చేయలేని పరిస్థితుల్లో ఉన్నా అడ్జస్ట్ అయ్యారు. మా నిర్మాతలు ఎంతో సపోర్టివ్‌గా నిలిచారు. ● 'విరూపాక్ష'ని 'కాంతార'తో పోల్చలేం. 'కాంతార' ఓ క్లాసిక్. 'విరూపాక్ష' సస్పెన్స్ థ్రిల్లర్‌గా వైవిధ్యంగా ఉంటుంది. దర్శకుడు కార్తీక్ కథ చెబుతున్నప్పుడే కొత్త అనుభూతికి గురయ్యాను. కథలో కొత్త క్యారెక్టర్స్ రావడం.. ట్విస్ట్‌లతో చిత్రం వేగంగా వెళుతుంది. ప్రతి 20 నిమిషాలకు కొత్తదనంతో కథ సాగుతుంది. ● 1989లలో అబ్బాయి–అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో, ఆ సమయంలో గ్రామాల్లో ఎలాంటి పరిస్థితులు ఉండేవో చూపించాం. చేతబడులు, మూఢనమ్మకాల గురించి చెప్పాం. నాకు హర్రర్ సినిమాలంటే భయం. ఆ భయానికి విరుగుడుగా నేను హనుమంతుణ్ణి నమ్ముతాను.

● తెలుగు సినిమా స్థాయిని 'ఆర్ఆర్ఆర్' ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళింది. 'విరూపాక్ష'ని పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ కుదరలేదు. ముందు ఇంట గెలవాలని అనుకుంటున్నాం. తెలుగులో రిలీజ్ చేశాక అన్ని భాషల్లో రిలీజ్ చేస్తాం.

● జీవితం అంటే కష్టాలు వస్తాయి.. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లడమే. యాక్సిడెంట్ తర్వాత మా మామయ్య మెగాస్టార్ చిరంజీవి గారు సిరివెన్నెల గారి పాటలోని స్ఫూర్తి నింపే 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి' అంటూ మెసేజ్ చేశారు. అందరి ఆదరాభిమానాల వల్ల యాక్సిడెంట్ తర్వాత మీ ముందు ఇలా ఉన్నాను. నా జీవితం దాదాపు సవాళ్లతోనే నిండింది. సవాళ్లు లేకుంటే లైఫ్ చప్పగా అనిపిస్తుంది. ● ఇప్పుడు నా మెచ్యూరిటీ పెరిగింది. అందరినీ నవ్విస్తూ, హ్యాపీగా ఉంచాలని అనుకుంటున్నాను. సినిమా సక్సెస్ అయితే అందరం హ్యాపీ. రికార్డ్స్ బద్దలు కొట్టాలనుకోవడం లేదు. ఎందుకంటే ప్రతీ వారం ఓ రికార్డ్ బ్రేక్ అవుతుంటుంది.

సంతోషం.. బాధ



● 'ప్రేమ విమానం' ఫస్ట్ లుక్

సంగీత్ శోభన్, శాన్వీ మేఘన హీరో హీరోయిన్లుగా, అనసూయ భరద్వాజ్, 'వెన్నెల' కిశోర్ లీడ్ రోల్స్‌లో నటించిన వెబ్ ఫిల్మ్ 'ప్రేమ విమానం'. బాల నటులు దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా కీలక పాత్రలు చేశారు. సంతోష్ కటా దర్శకత్వంలో దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్, జీ5లపై అభిషేక్ నామా నిర్మిస్తున్న వెబ్ ఫిల్మ్ ఇది. బుధవారం (ఏప్రిల్ 19) అభిషేక్ నామా బర్త్ డే సందర్భంగా 'ప్రేమ విమానం' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఫ్లైట్ ఎక్కి కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకునే ఓ ప్రేమ జంట, ఎలాగైనా విమానం ఎక్కాలని ప్రయత్నించే ఇద్దరు పిల్లలు.. ఇలా వివిధ వ్యక్తుల ప్రయాణంలో వచ్చే మలుపులు, సంతోషాలు, బాధలు.. వంటి ప్రేక్షకులను మెప్పించే అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి'' అని యూనిట్ పేర్కొంది.

సందేశంతో...

అమర్ దీప్, అశ్వినీ రెడ్డి హీరో హీరోయిన్లుగా శివప్రసాద్ చలువాది దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అభిలాష'. సీహెచ్ శిరీష నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు పృథ్వీ ఈ సినిమా సీడీ, ట్రైలర్‌ను రిలీజ్ చేసి, ''ఓ మంచి పాయింట్‌తో తీసిన ఈ చిత్రం ట్రైలర్ బాగుంది'' అన్నారు. ''వల్గారిటీ లేకుండా విద్యకు ఉన్న ప్రాధాన్యాన్ని సందేశాత్మకంగా ఈ సినిమాలో చూపించాం'' అన్నారు శివ ప్రసాద్. ''బలగం' సినిమా కోవలో ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు నిర్మాత సీహెచ్ శిరీష.



● అమర్ దీప్, అశ్వినీ రెడ్డి

యువత సినీపరిశ్రమకు రావాలి

– సీఐఐ దక్షిణ్ సమ్మిట్‌లో నిర్మాత అల్లు అరవింద్



● కార్తీ, సెల్వమణి, టీజీ త్యాగరాజన్, అల్లు అరవింద్, ఉదయనిధి స్టాలిన్, ప్రేమ్ రక్షిత్

''దక్షిణాది సినిమాలు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం గొప్ప విషయం. యువత సినిమా పరిశ్రమకు రావాలి. 'ఆర్ఆర్ఆర్, 'ది ఎలిఫెంట్ ఆఫ్ విస్పరర్స్' ఆస్కార్ అవార్డులు సాధించడం గర్వకారణం'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. బుధవారం చెన్నైలో జరిగిన సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) దక్షిణ్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఐఐ దక్షిణ్ చైర్మన్, మేనేజింగ్ పార్ట్‌నర్ టీజీ త్యాగరాజన్ నేతృత్వంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సు ప్రారంభోత్సవంలో తమిళనాడు మంత్రులు ఉదయనిధి స్టాలిన్, స్వామినాథన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సీఐఐ దక్షిణ్ కమిటీ సభ్యురాలు సుహాసిని, నిర్మాత అల్లు అరవింద్, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, నటులు కార్తీ, రిషబ్ శెట్టి, నటి మంజు వారియర్, దర్శకుడు వెట్రిమారన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెల్వమణి మాట్లాడుతూ– ''తమిళ చిత్రాల షూటింగ్‌లు తమిళనాడులో అధికంగా జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకూ దక్షిణాదిలో 50 వేల చిత్రాలు రూపొందాయి. అయితే సినిమాలనే నమ్ముకున్న కార్మికులకు ప్రోత్సాహం లేదు. వారి కోసం తమిళనాడు సినీ కార్మికుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'' అన్నారు. మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ – ''తమిళనాడు ప్రభుత్వం, ముఖ్యమంత్రి స్టాలిన్ సినీ పరిశ్రమకు అండగా ఉంటారు. సెల్వమణి తదితరులు పేర్కొన్న అంశాల గురించి చర్చించి, చర్యలు తీసుకుంటాం'' అన్నారు. 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు...' పాట నృత్యదర్శకుడు ప్రేమ్ రక్షిత్, 'ది ఎలిఫెంట్ ఆఫ్ విస్పరర్స్' షార్ట్ ఫిల్మ్ దర్శకురాలు కార్తీకిలను సత్కరించారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
159	41
59,568	17,619

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,175	△	22
డోజోన్స్	33,913	▽	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,899	▽	11
డాక్స్	15,895	△	13
షాంఘై	3,370	▽	23
నికాయ్	28,607	▽	52

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)		
59,921	▽	672
బంగారం (22 క్యారట్)		
59,681	△	669
వెండి (కేజీ)		
73,775	▽	867

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రచారకర్తగా నటి అలియా భట్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన ప్రచారకర్తగా బాలీవుడ్ నటి అలియా భట్‌ను నియమించుకుంది. సంస్థ 30 ఏళ్ల వేడుకల సందర్భంగా అలియాతో జట్టు కట్టినట్లు గ్రూప్ చైర్మన్ ఎం.పీ. అహ్మద్ తెలిపారు. ''అందం, అభినయంతో సినీ ప్రేక్షకుల్ని రంజింపచేస్తున్న అలియా..., సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి సంస్థ ఉత్పత్తులను కస్టమర్లకు మరింత చేరువ చేస్తుంది. మా లక్ష్యాల సాధనకు నటిగా, వ్యక్తిగా ఆమె మరింత బలాన్ని చేకూరుస్తుంది'' అని అహ్మద్ విశ్వాసం వ్యక్తం చేశారు. అనిల్ కపూర్, కరీనా కపూర్, కార్తీ వంటి నటీనటులు బ్రాండ్ ప్రచాకర్తలుగా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కుటుంబంలోకి చేరుతున్నందుకు సంతోషంగా ఉందని అలియా అన్నారు.

లలితా జ్యువెల్లరీ అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: అక్షయ తృతీయ పండుగ సందర్భంగా లలితా జ్యువెల్లరీ ప్రత్యేకమైన ఆఫర్లు ప్రకటించింది. అన్ని బంగారు నగలకు తరుగులో 1% తగ్గింపు ఇస్తుంది. వజ్రాభరణాలకు క్యారెట్‌లో రూ.2000 తగ్గింపు అందిస్తుంది. ఇప్పటికే ప్రారంభమైన ఈ ఆఫర్ ఏప్రిల్ 24 వరకూ కొనసాగుతుంది. కస్టమర్లంతా ఈ అద్భుతమైన ఆఫర్‌ను వినియోగించుకోవాలని కంపెనీ చైర్మన్ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. అందరి ఇళ్లలో బంగారం, వజ్రాలు, వెండి నిండాలని అక్షయ తృతీయ సందర్భంగా కుబేర లక్ష్మీని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	408-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	345-00
విజయవాడ	345-00
రిటైల్ ధర (డజను)	60.00
19-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	350-00
వరంగల్	352-00
రిటైల్ ధర	4.10

టీసీఎస్ నంబర్ 1

- పనిచేయడానికి ఉత్తమ కంపెనీ
- లింక్డ్‌ఇన్ జాబితాలో చోటు



ముంబై: దేశంలో పనిచేయడానికి అత్యుత్తమ కంపెనీగా టీసీఎస్ గుర్తింపు పొందింది. పనిచేయడానికే కాకుండా, కెరీర్‌లో పురోగతికీ టీసీఎస్ మెరుగైన కంపెనీగా లింక్డ్‌ఇన్ 2023 నివేదిక తెలిపింది. టీసీఎస్ తర్వాత అమెజాన్, మోర్గాన్ స్టాన్లీ లింక్డ్‌ఇన్ జాబితాలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. గతేడాది లింక్డ్‌ఇన్ జాబితాలో టెక్ కంపెనీల ఆధిపత్యం ఎక్కువగా ఉండగా, ఈ ఏడాది జాబితాలో మార్పు స్పష్టంగా కనిపించింది. ఆర్థిక సేవల కంపెనీలు, ఆయిల్ అండ్ గ్యాస్, ప్రొఫెషనల్ సేవలు, తయారీ, గేమింగ్ కంపెనీలకూ చోటు దక్కింది. 25 కంపెనీల్లో 10 ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్, ఫిన్‌టెక్ నుంచే ఉన్నాయి. మాక్వేర్ గ్రూప్ 5వ స్థానంలో ఉంటే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 11, మాస్టర్‌కార్డ్ 12, యుబి 14వ స్థానంలో నిలిచాయి. 20వ స్థానంలో డ్రీమ్11, 24వ స్థానంలో గేమ్స్ 24/7 ఉన్నాయి. ఈ జాబితాలో గేమింగ్ కంపెనీలకు చోటు లభించడం మొదటిసారి. ఈ రంగానికి పెరుగుతున్న ప్రజాదరణను ఇది తెలియజేస్తోంది. ఇన్‌స్టంట్ గ్రోసరీ డెలివరీ సంస్థ జెప్టో 16వ స్థానం దక్కించుకుంది.

ఈ తరహా నైపుణ్యాలకు డిమాండ్..

లింక్డ్‌ఇన్ జాబితాలో చోటు సంపాదించుకున్న టెక్నాలజీ కంపెనీలు ఎక్కువగా.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, కంప్యూటర్ సెక్యూరిటీ నైపుణ్యాలున్న మానవ వనరుల కోసం చూస్తున్నాయి. ఫైనాన్షియల్ రంగానికి చెందిన కంపెనీలు కమర్షియల్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, గ్రోత్ స్ట్రాటజీస్ తెలిసిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇండస్ట్రియల్ డిజైన్, గేమ్ డెవలప్‌మెంట్ నిపుణులకూ డిమాండ్ నెలకొంది. ఇంజనీరింగ్, కన్సల్టింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, విక్రయాలు, డిజైన్, ఫైనాన్స్, ఆపరేషన్స్‌పై ఎక్కువగా కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయి. బెంగళూరు కేంద్రంగా పనిచేసే కంపెనీలు, ఆ తర్వాత ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, పుణెకు చెందినవి నిపుణులను నియమించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.

10 వేల కిలోమీటర్ల డిజిటల్ హైవేలు

- 2025 నాటికి ఎన్‌హెచ్‌ఏఐ లక్ష్యం
- హైదరాబాద్-బెంగళూరు కారిడార్ పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ కనెక్టివిటీని విస్తరించే క్రమంలో 'డిజిటల్ హైవే'ల నిర్మాణంపై ప్రభుత్వ రంగ నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) మరింతగా దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా 2024-25 నాటికల్లా 10,000 కిలోమీటర్ల మేర ఆప్టిక్ ఫైబర్ కేబుల్స్ (ఓఎఫ్‌సీ) నెట్‌వర్క్‌పరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయనుంది. ఎన్‌హెచ్‌ఏఐలో భాగమైన నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్) ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం డిజిటల్ హైవే అభివృద్ధికి సంబంధించి పైలట్ ప్రాతిపదికన 512 కిలోమీటర్ల హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌ను, 1,367 కిలోమీటర్ల ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేను ఎంపిక చేసినట్లు పేర్కొంది.

ప్రధానితో యాపిల్ సీఈవో భేటీ

నేడు ఢిల్లీలో స్టోర్ ప్రారంభం



న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ స్టోర్స్ ప్రారంభం కోసం భారత పర్యటనలో ఉన్న కంపెనీ సీఈవో టిమ్ కుక్ బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. విద్య, తయారీ, పర్యావరణం తదితర అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ సానుకూల ప్రభావం చూపాలన్న ప్రధాని ఆకాంక్షే తమ లక్ష్యం కూడా అని ఈ సందర్భంగా ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. భారత్‌లో తమ కార్యకలాపాలు విస్తరించడానికి, మరింత పెట్టుబడులు పెట్టడానికి కట్టుబడి ఉన్నామని ఆయన పేర్కొన్నారు. టిమ్ కుక్‌తో భేటీలో వివిధ అంశాలపై చర్చించినట్లు, భారత్‌లో చోటు చేసుకుంటున్న టెక్నాలజీ ఆధారిత మార్పులను ప్రస్తావించినట్లు ప్రధాని కూడా ట్వీట్ చేశారు. యాపిల్ భారత్‌లో తమ రెండో స్టోర్‌ను నేడు (గురువారం) న్యూఢిల్లీలో ప్రారంభించనుంది. ఈ సందర్భంగా టిమ్ కుక్ స్వయంగా కస్టమర్లను ఆహ్వానించనున్నారు. ఇందుకోసం బుధవారం న్యూఢిల్లీ చేరుకున్న టిమ్ కుక్ లోధి ఆర్ట్ డిస్ట్రిక్ట్‌ను సందర్శించి కళాకారులను కలిశారు. దేశీయంగా తమ తొలి రిటైల్ స్టోర్‌ను (యాపిల్ బీకేసీ) ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలో ఆయన మంగళవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. 2016 తర్వాత కుక్ భారత్‌లో పర్యటించడం ఇదే ప్రథమం.

సిప్ @ రూ.1.56 లక్షల కోట్లు

- 2022-23లో వచ్చిన పెట్టుబడులు
- 25 శాతం వృద్ధి నమోదు
- నెలవారీగా రూ.13వేల కోట్లకుపైనే



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంపిక చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2022-23) సిప్ ద్వారా రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి వచ్చినట్టు 'యాంఫి' గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తోంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో సిప్ పెట్టుబడులు రూ.1.24 లక్షల కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి కనిపించింది. మార్కెట్లలో అస్థిరతలను అధిగమించేందుకు సిప్ మెరుగైన సాధనమని తెలిసిందే. దీనివల్ల మార్కెట్లు పడినప్పుడు, పెరుగుతున్నప్పుడు కూడా పెట్టుబడులు కొనసాగుతాయి కనుక కొనుగోలు సగటుగా మారుతుంది. 2020-21లో సిప్ పెట్టుబడులు రూ.96,080 కోట్లుగా ఉన్నాయి. అంటే ఏటేటా సిప్ పెట్టుబడులు వృద్ధి చెందుతున్నట్టు స్పష్టమవుతోంది. 2016-17లో ఉన్న రూ.43,921 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే మూడు రెట్లు పెరిగాయి. ప్రతి నెలా సిప్ రూపంలో వచ్చే పెట్టుబడులు సైతం మార్చి నెలకు రూ.14,276 కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ గరిష్ట సిప్ పెట్టుబడులు ఇవే. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద సగటున ప్రతి నెలా రూ.13,000 కోట్ల చొప్పున వచ్చాయి. ఇన్వెస్టర్లు దీర్ఘకాల వృద్ధి పట్ల నమ్మకంగా ఉన్నారని, అందుకే ఏకమొత్తంలో కంటే సిప్ రూపంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని కోటక్ మహీంద్రా ఏఎంసీ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ మనీష్ మెహతా తెలిపారు.

''గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తం మీద మార్కెట్లు అస్థిరంగానే ఉన్నాయి. అయినా కానీ, దేశీయ మార్కెట్ పట్ల ఇన్వెస్టర్లు నమ్మకాన్ని ప్రదర్శిస్తున్నారు. పెట్టుబడులకు మ్యూచువల్ ఫండ్స్‌ను ప్రాధాన్య మార్గంగా చూస్తున్నారు''అని ఫయర్స్ రీసెర్చ్ హెడ్ గోపాల్ కావలిరెడ్డి తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం సిప్ పెట్టుబడులు గడిచిన ఆర్థిక సంవత్సరంలో 18 శాతం పెరిగి రూ.6.83 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం సిప్ ఖాతాల సంఖ్య 6.36 కోట్లకు చేరుకుంది.

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

- సూచీలకు మూడోరోజూ నష్టాలు
- 159 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- నిఫ్టీ నష్టం 41 పాయింట్లు



ముంబై: ఐటీ, ఫైనాన్స్, విద్యుత్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు మూడోరోజూ నష్టాలను చవిచూశాయి. ఇప్పటివరకు వెల్లడైన కార్పొరేట్ క్యూ4 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను మెప్పించలేకపోయాయి. అలాగే అంతర్జాతీయ బలహీన సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌ను బలహీనపరిచాయి. ఉదయం సెన్సెక్స్ 19 పాయింట్ల స్వల్ప లాభంతో 59,746 వద్ద, నిఫ్టీ ఏడు పాయింట్లు నష్టపోయి 17,653 వద్ద మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 292 పాయింట్ల పరిధిలో సెన్సెక్స్ 59,453 వద్ద కనిష్టాన్ని, 59,745 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 159 పాయింట్లు నష్టపోయి 59,568 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,580 – 17,666 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 41 పాయింట్లు పతనమై 17,619 వద్ద నిలిచింది. మెటల్, ఫార్మా, రియల్టీ, ఇంధన షేర్లకు చెందిన మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ స్వల్పంగా 0.12 శాతం పెరిగింది. కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు, ఆయా కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధాన వైఖరిపై ఎదురుచూపుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు లాభ, నష్టాల మధ్య ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి(గురువారం)కి ముందు హెచ్‌సీఎల్ టెక్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో రెండున్నర శాతం నష్టపోయి రూ.1,038 వద్ద స్థిరపడింది.
- రియల్టీ సంస్థ ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ షేరు రెండున్నర శాతం లాభపడి రూ.450 వద్ద ముగిసింది. ఆర్థిక సంవత్సరం(2022-23)లో వార్షిక ప్రాతిపదికన రూ. 12,930 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించడంతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది.

మ్యాన్‌కైండ్ @ రూ. 1,026-1,080

- ఈ నెల 25-27 మధ్య ఐపీవో
- రూ. 4,326 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా పబ్లిక్ ఇష్యూలో భాగంగా షేరుకి రూ. 1,026-1,080 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. ఐపీవోలో భాగంగా కంపెనీ మొత్తం 4 కోట్లకుపైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ చేస్తోంది. కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు వీటిని విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 4,326 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ, గాంధీనగర్‌లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ కోర్సులు

గాంధీనగర్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీజీ డిప్లొమా ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ):** ఫోరెన్సిక్, దాని అనుబంధ శాస్త్రాలు.
» **ఎంఎస్సీ: విభాగాలు:** ఫోరెన్సిక్ సైన్స్/ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ/మల్టీమీడియా ఫోరెన్సిక్స్/టాక్సికాలజీ/సైబర్ సెక్యూరిటీ/డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ/న్యూరో సైకాలజీ/క్లినికల్ సైకాలజీ/ఫోరెన్సిక్ సైకాలజీ/నానో టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/హోంల్యాండ్ సెక్యూరిటీ/కెమిస్ట్రీ/ఇన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ.
» **ఎంఏ: విభాగాలు:** మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం/క్రిమినాలజీ/పోలీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్.
» బీఎస్సీ-ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్
» **పీజీ డిప్లొమా: విభాగాలు:** ఫింగర్‌ప్రింట్ సైన్స్/ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్/క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ/క్రైమ్ సీన్ మేనేజ్‌మెంట్/డీఎన్ఏ ఫోరెన్సిక్స్/ఫోరెన్సిక్ జర్నలిజం/ఫోరెన్సిక్ బాలిస్టిక్స్/ హ్యుమానిటేరియన్ ఫోరెన్సిక్స్/డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్/సైబర్ ఫిజికల్ సిస్టమ్/సెమీ కండక్టర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్/సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఇన్వెస్టిగేటివ్/సైబర్ టెక్నాలజీ/ఇన్వెస్టిగేటివ్ సైకాలజీ/సెక్యూరిటీ స్టడీస్/సైబర్ లా/డ్రగ్ అండ్ సబ్‌స్టాన్స్ అబ్యూస్ లాస్/ఇంటర్నెట్ గవర్నెన్స్/ఇండస్ట్రియల్ సేఫ్టీ, హైజీన్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్.
» **ఎంటెక్: విభాగాలు:** సైబర్ సెక్యూరిటీ/ఏఐ అండ్ డీఎస్/సివిల్ ఇంజనీరింగ్/రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్/అప్లైడ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.
» **బీటెక్:** ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్.
» **ఎంబీఏ: విభాగాలు:** ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్/హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్.
» **బీబీఏ-ఎంబీఏ: విభాగాలు:** ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్/ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఇంటెలిజెన్స్.
» **ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, బీఏ-ఎంఏ క్రిమినాలజీ, డిప్లొమా కనైన్ ఫోరెన్సిక్స్, ఎల్‌ఎల్‌ఎం: విభాగాలు:** సైబర్ లా అండ్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్/క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్; -బీఎస్సీ-ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్), ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్), బీబీఏ-ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్), ఎంఫార్మసీ(ఫోరెన్సిక్ ఫార్మసీ/ఫార్మాస్యూటికల్ క్వాలిటీ అస్యూరెన్స్).
» **క్యాంపస్:** గాంధీనగర్, ఢిల్లీ, గోవా, త్రిపుర, భోపాల్,పుణె, గువాహటి,మణిపూర్, ధార్వాడ్.
» **అర్హత:** ప్రోగ్రామ్‌ను అనుసరించి సంబంధిత విభాగంలో 10+2, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లో విద్యార్హత మార్కుల ఆధారంగా సీటు లభిస్తుంది. మిగిలిన కోర్సులకు వర్సిటీ నిర్వహించే నేషనల్ ఫోరెన్సిక్ అడ్మిషన్ టెస్ట్(ఎన్‌ఎఫ్‌ఏటీ)-2023, అకడమిక్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా విద్యార్థులను ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేదీలు:** 01.07.2023, 02.07.2023
» **వెబ్‌సైట్:** www.nfsu.ac.in

ఎన్‌ఎస్‌ఐ, కాన్పూర్‌లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

కాన్పూర్‌లోని నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ 2023-24 అకడమిక్ సెషన్‌కు గాను పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

పీజీ డిప్లొమా కోర్సులు

» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు ఆఫ్ అసోసియేట్‌షిప్(షుగర్ టెక్నాలజీ -రెండున్నరేళ్లు)-66 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు ఆఫ్ అసోసియేట్‌షిప్(షుగర్ టెక్నాలజీ-ఏడాదిన్నర)-40 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు(ఇండస్ట్రియల్ ఫెర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ)-50 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు(షుగర్ కేన్ ప్రొడక్టివిటీ అండ్ మెచ్యూరిటీ మేనేజ్‌మెంట్)-20 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు(ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ప్రాసెస్ కంట్రోల్)-17 సీట్లు.
» పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు(క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్స్)-22 సీట్లు.
» షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికేట్ కోర్సు-17 సీట్లు.
» షుగర్ బాయిలింగ్ సర్టిఫికేట్ కోర్సు-63 సీట్లు
» క్వాలిటీ కంట్రోల్‌లో సర్టిఫికేట్ కోర్సు-30 సీట్లు
» **అర్హత:** కోర్సును అనుసరించి మెట్రిక్యులేషన్, పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.05.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 25.06.2023.
» **వెబ్‌సైట్:** www.nsi.gov.in

ప్రిలిమ్స్‌పై.. పట్టు సాధించేలా!

» మే 28న సివిల్స్ ప్రిలిమినరీ
» రెండు పేపర్లతో 400 మార్కులకు పరీక్ష
» దాదాపు ఆరు లక్షల మంది పోటీ పడే అవకాశం
» 1:12 లేదా 1:13 నిష్పత్తిలో మెయిన్‌కు ఎంపిక
» 21 సర్వీసుల్లో 1105 పోస్టులకు ఎంపిక ప్రక్రియ



సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా మొత్తం 21 సర్వీసులకు యూపీఎస్సీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. మూడంచెల ఈ ఎంపిక ప్రక్రియలో తొలిదశ పరీక్ష ప్రిలిమ్స్‌ను మే 28వ తేదీన నిర్వహించనుంది. అత్యున్నత స్థాయి సర్వీసులైన సివిల్ సర్వీసులకు.. ఫ్రెషర్స్ నుంచి రిపీటర్స్ వరకు లక్షల మంది పోటీ పడుతుంటారు. ఇందుకోసం ఏళ్ల తరబడి కృషి చేస్తుంటారు. పోటీ తీవ్రంగా ఉంటుంది. కాబట్టి పరీక్ష సమీపిస్తున్న నేపథ్యంలో.. సివిల్స్ ప్రిలిమ్స్‌లో రాణించేందుకు నిపుణులు మెలకువలు...

సివిల్ సర్వీసెస్-2023 ద్వారా 21 సర్వీసుల్లో మొత్తం 1105 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. తొలి దశ ప్రిలిమ్స్‌కు దేశవ్యాప్తంగా దాదాపు ఆరు లక్షల మంది పోటీ పడే అవకాశముంది. ప్రిలిమ్స్‌లో రాణిస్తేనే తదుపరి దశ మెయిన్స్‌కు అర్హత లభిస్తుంది. ఒక్కో పోస్ట్‌కు 1:12.5 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. అంటే.. తొలి దశకు ఆరు లక్షల మంది హాజరైతే.. రెండో దశకు అర్హత పొందేది 14వేల మంది మాత్రమే!ఈ జాబితాలో నిలవాలంటే.. ఎంతో అప్రమత్తంగా ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మిగిలింది 40 రోజులే

సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష తేదీ మే 28ని పరిగణనలోకి తీసుకుంటే.. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సమయం 40 రోజులు. ఎంతో విలువైన ఈ సమయాన్ని అభ్యర్థులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. విశ్లేషణాత్మక అధ్యయనం, పునశ్చరణ, సమయ పాలన, ప్రాక్టీస్ వంటి వాటితో నిరంతరం తమ ప్రిపరేషన్‌కు పదును పెట్టుకోవాలి.

సమయ పాలనతో.. సక్సెస్

ప్రిలిమ్స్ అభ్యర్థులు ప్రస్తుతం పేపర్-1 జనరల్ స్టడీస్ సిలబస్‌లోని అన్ని అంశాలను నిత్యం చదివేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ప్రతి రోజు కనీసం ఎనిమిది నుంచి పది గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించాలి. దీంతోపాటు ప్రతి వారం ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న తర్వాత సెల్ఫ్ టెస్టులు, మాక్ టెస్టులు రాయడం కూడా ఉపకరిస్తుంది.

సమకాలీనంపై దృష్టి

ప్రస్తుత సమయంలో అభ్యర్థులు సమకాలీన అంశాలపై అవగాహనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి. అదేవిధంగా సిలబస్‌లో పేర్కొన్న కోర్ టాపిక్స్‌ను కరెంట్ అఫైర్స్‌తో సమ్మిళితం చేసుకుంటూ చదవాలి. ప్రిలిమ్స్‌లో ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి ఈ ఏడాది మే ముందు నుంచి ఏడాది, ఏడాదిన్నర కాలంలోని ముఖ్యమైన కరెంట్ ఈవెంట్స్‌పై దృష్టి పెట్టాలి. వాటిని సంబంధిత సబ్జెక్ట్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. నేపథ్యం,ప్రభావం, ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు అంచనా వంటి కోణాల్లో విశ్లేషించుకోవాలి.

అనుసంధానం చేసుకుంటూ

అభ్యర్థులు ఎకానమీ-పాలిటీ, ఎకానమీ-జాగ్రఫీ, జాగ్రఫీ-ఎకాలజీ; జాగ్రఫీ-సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాలను అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా ప్రిపరేషన్ పరంగా కొంత సమయం కలిసొస్తుంది. ఈ సమయాన్ని తమకు క్లిష్టంగా భావించే ఇతర అంశాలపై దృష్టి పెట్టేందుకు వినియోగించొచ్చు.

ముఖ్యాంశాల పునశ్చరణ

సబ్జెక్ట్ వారీగా ముఖ్యాంశాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి.ఇప్పటికే సిద్ధం చేసుకున్న సొంతనోట్స్ ద్వారా పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. వాటిల్లో ఆయా సబ్జెక్ట్‌ల నుంచి ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు..ఏ అంశాలకు అధిక ప్రాధాన్యం లభిస్తుందో గుర్తించాలి. వాటికి ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి సబ్జెక్ట్‌ను కనీసం రెండు సార్లు పునశ్చరణ చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. వాస్తవానికి ప్రిలిమ్స్ అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకుని ఉంటారు. కాబట్టి ఇక నుంచి పూర్తిగా రివిజన్‌పై దృష్టిపెట్టాలి.

కొత్త అంశాలకు ఇలా

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు క్లిష్టంగా భావించిన అంశాలను తర్వాత చదవచ్చనే ధోరణితో విస్మరిస్తారు. ఇలా వదిలేసిన టాపిక్స్‌కు సంబంధించి ఇప్పుడు కొత్తగా ప్రిపరేషన్ ప్రారంభించడం సరికాదని సబ్జెక్ట్ నిపుణుల అభిప్రాయం. ప్రస్తుత సమయంలో ఇప్పటికే పట్టు సాధించిన అంశాలపై మరింత లోతైన అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కొత్త అంశాలను చదవాల్సి వస్తే.. వాటికి సంబంధించి సినాప్సిస్, కాన్సెప్ట్‌లపై దృష్టిపెట్టాలని పేర్కొంటున్నారు.

గత ప్రశ్న పత్రాల సాధన

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో ప్రిలిమ్స్ అభ్యర్థులకు ఉపకరించే మరో సాధనం.. గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం. ఇప్పటి నుంచి పరీక్ష ముందు రోజు వరకు ప్రతి రోజు ఒక ప్రీవియస్ పేపర్ ప్రాక్టీస్ చేసేలా సమయం కేటాయించుకోవాలి. దీని ద్వారా తమ బలాలు, బలహీనతలపై అవగాహన ఏర్పడుతుంది.

పేపర్-2ను విస్మరించొద్దు

ప్రిలిమ్స్‌లో పేపర్-2ను అర్హత పేపర్‌గానే పేర్కొన్నప్పటికీ.. ఇందులో 33 శాతం మార్కులు సాధిస్తేనే పేపర్-1 మూల్యాంకన చేస్తారు. దాని ఆధారంగానే మెయిన్స్‌కు ఎంపిక చేస్తారు. కాబట్టి పేపర్-2లో అర్హత మార్కులు సాధించేందుకు ప్రధానంగా మ్యాథమెటిక్స్,లాజికల్ రీజనింగ్ స్కిల్స్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

ఇలా గుర్తుంచుకోవచ్చు

విస్తృతంగా ఉండే సిలబస్ అంశాలను గుర్తుపెట్టుకోవడం ఎంతో కష్టమైన పని. కాని వ్యక్తిగత మెమొరీ టిప్స్ ద్వారా ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉంది. పాయింటర్స్, ఫ్లో చార్ట్స్, విజువలైజేషన్ టెక్నిక్స్ వంటి వాటిని అనుసరించాలి. ముఖ్యమైన సంవత్సరాలు, గణాంకాలను గుర్తుంచుకునే క్రమంలో వ్యక్తిగతంగా అన్వయించుకోవడం కూడా మరో ముఖ్యమైన మెమొరీ టిప్‌గా నిలుస్తోంది. ఇలా.. టైమ్ ప్లాన్ నుంచి రివిజన్ వరకు నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేస్తే ప్రిలిమ్స్‌లో విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ప్రిలిమ్స్.. ముఖ్య టాపిక్స్

కరెంట్ అఫైర్స్

• బడ్జెట్, ఆర్థిక సర్వే, అంతర్జాతీయ ఒప్పందాలు. • జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు. • ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విధానాలు. • గత ఏడాది కాలంలో అమల్లోకి వచ్చిన సంక్షేమ పథకాలు. • ప్రభుత్వం చేపట్టిన ముఖ్యమైన ప్రాజెక్ట్‌లు వాటి ఉద్దేశం.

చరిత్ర

• ఆధునిక చరిత్ర • జాతీయోద్యమం. • ప్రాచీన,మధ్యయుగ చరిత్రకు సంబంధించి సాహిత్యం, కళలు, మత ఉద్యమాలు, రాజకీయ-సామాజిక-ఆర్థిక చరిత్ర అంశాలు. •ఆధునిక చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన-పరిపాలన విధానాలు; బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు-ఉద్యమాలు(ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం), సంస్కరణోద్యమాలు.

రాజ్యాంగం

- **రాజ్యాంగం:** రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ సవరణ ప్రక్రియ,పీఠిక,తాజా రాజ్యాంగ సవరణలు -వాటికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణలు.
- **రాజకీయ వ్యవస్థ:** పార్లమెంటరీ వ్యవస్థ, అర్థ సమాఖ్య, రాష్ట్రపతి, గవర్నర్, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్నికల కమిషన్, ఆర్థిక కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్, వాటికి సంబంధించి రాజ్యాంగ ప్రకరణలు.
- **పంచాయతీరాజ్ వ్యవస్థ:** బల్వంత్‌రాయ్, అశోక్ మెహతా, హన్మంతరావ్, జి.వి.కె. రావ్, సింఘ్వీ కమిటీల సిఫార్సులు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం. • **ప్రభుత్వ విధానం:** విధాన రూపకల్పన జరిగే తీరు. విధానాల అమలు, వాటి సమీక్ష. -ఇటీవల ప్రభుత్వం తీసుకున్న ముఖ్య విధాన పర నిర్ణయాలు. • **కేంద్ర-రాష్ట్ర సంబంధాలు:** గత కొద్ది రోజులుగా చర్చనీయాంశంగా మారిన న్యాయ వ్యవస్థ క్రియాశీలత.

ఎకానమీ

• ఆర్థికాభివృద్ధిలో సహజ వనరులు-మూలధన వనరుల పాత్ర. • ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల ప్రగతి(వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం, సేవారంగం). పారిశ్రామిక తీర్మానాలు-వ్యవసాయ విధానం. • బ్యాంకింగ్ రంగం ప్రగతి-సంస్కరణలు-ఇటీవల కాలంలో బ్యాంకింగ్ రంగంలో స్కామ్‌లు, ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావం. •తాజా మానవాభివృద్ధి, ప్రపంచ అభివృద్ధి నివేదికలు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

• గత ఏడాది కాలంలో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు. • ఇటీవల కాలంలో సంభవిస్తున్న వ్యాధులు-కారకాలు. • సైబర్ సెక్యూరిటీ యాక్ట్. • రక్షణ రంగంలో కొత్త మిస్సైల్స్ ప్రయోగాలు. • జాతీయ ముఖ్యమైన వన్యమృగ సంరక్షణ కేంద్రాలు. • పర్యావరణ పరిరక్షణ ఒప్పందాలు, చర్యలు. • వివిధ ఐటీ పాలసీలు.

జాగ్రఫీ

- భౌగోళిక వనరులు, సహజ సంపద.
- పర్యావరణ సమస్యలు-ఎక్కువగా కేంద్రీకృతమైన ప్రాంతాలు, దేశాలు.
- సౌర వ్యవస్థ, భూమి అంతర్ నిర్మాణం, శిలలు, జియలాజికల్ టైం స్కేల్, రుతుపవనాలు, ప్రపంచ పవనాలు, చక్రవాతాలు, ఉష్ణోగ్రత విలోమం, భూకంపాలు, సునామీలు.
- మన దేశ పరిస్థితుల నేపథ్యంలో నగరీకరణ; ఆదివాసులు;రుతుపవనాలు; మాన్‌సూన్ మెకానిజం; నదులు; జలాల పంపిణీ; వివాదాలు.

క్లుప్తంగా...

41 మంది జిల్లా జడ్జీల బదిలీ

సాక్షి, హైదరాబాద్: భారీ సంఖ్యలో జిల్లా, సెషన్స్ న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 41 మంది జిల్లా, సెషన్స్ న్యాయమూర్తులను బదిలీ చేసింది. వీరి బాధ్యతలను ప్రస్తుత కోర్టులో ఎవరికి అప్పగించాలో కూడా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వీరంతా ఈ నెల 26వ తేదీకల్లా బదిలీ అయిన స్థానాల్లో బాధ్యతలను స్వీకరించాలని సూచించింది. ఈలోగా విచారణ పూర్తి చేసిన కేసుల్లో తీర్పులు వెలువరించాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు.

1,008 మంది గర్భిణులకు ఉచిత ప్రసవం

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ పాతబస్తీలో ఆర్థికంగా వెనుకబడిన 1,008 మంది గర్భిణులకు లోపముద్ర చారిటబుల్ ట్రస్ట్ ఉచిత ప్రసవాలు చేయించనుంది. కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే ఢిల్లీలో డాక్టర్ మాధవీలత కొంపెల్ల నేతృత్వంలో పనిచేసే లోపముద్ర చారిటబుల్ ట్రస్ట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా 1,008 మందికి ఉచితంగా ప్రసూతి శస్త్రచికిత్సలు జరపడం మంచి ప్రయత్నమని అభినందించారు. ఆర్థికంగా వెనుకబడిన గర్భిణులకు ప్రసూతికి ముందు.. ప్రసవానంతర సంరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డాక్టర్ మాధవీలత కొంపెల్ల తెలిపారు.

కల్యాణలక్ష్మికి రూ.2 వేల కోట్లు



బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కల్యాణలక్ష్మి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. కొంతకాలంగా ఈ పథకానికి నిధుల విడుదలలో జాప్యం వల్ల చెల్లింపులు సకాలంలో జరగడం లేదు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు సైతం అధికారులను నిలదీస్తున్న ఘటనలున్నాయి. ఈ క్రమంలో లబ్ధిదారులందరికీ ఒకేసారి నిధులు విడుదల చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఒకే దఫా రూ.2 వేల కోట్ల విడుదలకు అనుమతిచ్చింది. ఈమేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా విడుదల చేసిన నిధులతో ఇప్పటివరకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం బకాయిలన్నీ చెల్లించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హలో.. బోంజో.. ఓలా..



సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల..
లోపలికి అడుగుపెట్టగానే..
9వ తరగతి చదువుతున్న మనోజ్ కనిపించాడు
బోంజో అని పలకరించాడు..
అలా రెండడుగులు వేశామో లేదో..
ఓలా అన్నాడు రాంచరణ్..

ఏంటిది.. ఏమంటున్నారు అన్నదేగా మీ డౌట్.. వీళ్లిద్దరూ మనల్ని గుడ్ మార్నింగ్, హలో అని పలకరించారు. కాకపోతే.. ఫ్రెంచ్, స్పానిష్ భాషల్లో.. ఒక్క మనోజ్, రాంచరణే కాదు.. ఆ బడిలో చాలా మంది ఫ్రెంచ్, స్పానిష్ భాషలను నేర్చుకుంటున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తున్నారు.. పోటీ ప్రపంచంలో రాణించేందుకు తమను తాము సంసిద్ధం చేసుకుంటున్నారు.

- వారంలో మూడు క్లాసులు బోధిస్తున్న వర్సిటీ ప్రొఫెసర్లు
- ఈ విద్యా సంవత్సరం 160 మంది విద్యార్థుల ఎంపిక.. వారికి శిక్షణ
- వచ్చే విద్యా సంవత్సరంలోనూ బోధించేందుకు ప్రణాళిక

సిద్దిపేట ప్రభుత్వ పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లిష్, స్పానిష్, ఫ్రెంచ్ భాషల బోధన

మంత్రి హరీశ్ చొరవతో ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలను దత్తత తీసుకున్న ఇఫ్లూ



ఫ్రెంచ్ నేర్పిస్తున్న అధ్యాపకురాలు

సాక్షి, సిద్దిపేట: ఇందిరానగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను హైదరాబాద్‌కు చెందిన ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్) యూనివర్సిటీ దత్తత తీసుకుంది. మంత్రి హరీశ్‌రావు చొరవతో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్ భాషలు నేరిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం 9వ తరగతిలో 160 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారిలో 100మందికి ఇంగ్లిష్, 30 మందికి ఫ్రెంచ్, 30 మందికి స్పానిష్ నేర్పిస్తున్నారు. ఓ యూనివర్సిటీ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని విద్యాబోధన చేయడం ఇదే మొదటిసారి. ఫిబ్రవరి 27న తరగతులను ప్రారంభించారు. ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్ భాషలు నేర్పించారు. వారంలో రెండు రోజులు (గురు, శుక్రవారాలు) ఆన్‌లైన్, ఒకరోజు (శనివారం) ప్రత్యక్షంగా ప్రొఫెసర్లు బోధన చేశారు. ఇలా నాలుగు వారాలపాటు బోధించారు. ఇంగ్లిష్‌లో భాగంగా ఉచ్చారణ, సంభాషణ, గ్రూప్ డిస్కషన్, ప్రజెంటేషన్‌పై అవగాహన కల్పించారు. ఫ్రెంచ్, స్పానిష్ భాషల్లో పలకరించడం, సెల్ఫ్ ఇంట్రడక్షన్, సింపుల్ కన్వర్జేషన్ నేర్పించారు. మార్చి 28న హైదరాబాద్‌లోని ఇఫ్లూ యూనివర్సిటీకి 160 మంది విద్యార్థులను తీసుకెళ్లారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, విద్యాబోధన తీరు ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఇతర దేశాలకు చెందిన విద్యార్థులతో ఇంగ్లిష్, ఫ్రెంచ్, స్పానిష్ భాషల్లో ముచ్చటించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఈ నెల 16న మంత్రి హరీశ్‌రావు, యూనివర్సిటీ వీసీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా ఆయా భాషల బోధనకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి ఏడాదంతా బోధించనున్నారు.

ఒక అడ్వంచర్‌లా అనిపించింది..



నేను స్పానిష్ నేర్చుకుంటున్నా. నాకు ఒక అడ్వంచర్‌లా అనిపిస్తుంది. యూనివర్సిటీకి వెళ్లినప్పుడు అక్కడి స్టూడెంట్‌తో నేను స్వయంగా స్పానిష్‌లో మాట్లాడాను. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే రెండో భాష స్పానిష్ నేర్చుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంకా నేర్చుకోవాలని ఉంది. పూర్తిగా గలగలా స్పానిష్‌లో మాట్లాడాలి. ఉన్నత విద్య కోసం స్పెయిన్‌కు వెళ్లినా నాకు అక్కడి భాషతో ఇక ఇబ్బంది ఉండదు.

-రాంచరణ్, 9వ తరగతి

ఇన్‌ఫార్మల్ టు ఫార్మల్ ఎలా మాట్లాడాలో నేర్చుకున్నాం



ఇంగ్లిష్‌లో ఇన్‌ఫార్మల్ టు ఫార్మల్ ఎలా మాట్లాడాలో నేర్చుకున్నాం. గ్రూప్ డిస్కషన్, ప్రజెంటేషన్ స్కిల్స్ నేర్చుకున్నాం. ఇఫ్లూ వర్సిటీ వారు మాకు ఇంగ్లిష్ నేర్పించడం చాలా లక్కీగా ఫీలవుతున్నాం. ఇతర విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో డబ్బులు పెట్టినా విదేశీ భాషలు నేర్చుకోలేరు అదే మా హరీశ్‌రావు సార్ కృషితో మా స్కూల్‌లోనే వాటిని నేర్చుకుంటున్నాం. -అఫ్జ, ఐమన్, తనీమ్, 9వ తరగతి విద్యార్థులు

ఫ్రెంచ్ నేర్చుకుంటున్నా..



-మనోజ్, 9వ తరగతి

ఫ్రెంచ్ భాషను ఇంట్రస్ట్‌గా నేర్చుకుంటున్నా. ఇఫ్లూ క్యాంపస్‌కు వెళ్లినప్పుడు అక్కడ ఫ్రెంచ్ విద్యార్థులతో మాట్లాడాను. ఫ్రెంచ్ మాట్లాడటంతోపాటు అర్థం చేసుకోగలుగుతున్నా. పదో తరగతిలోనూ ఇంకొంచెం ఫ్రెంచ్ భాషను నేర్చుకోవాలని ఉంది.

కేన్సర్ చికిత్సలో ఏఐదే భవిష్యత్తు

- వ్యాధి నిర్ధారణ, చికిత్సకు కృత్రిమ మేధ ఆధారిత సీటీ స్కాన్, ఎంఆర్‌ఐలు
- 'సాక్షి'తో ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ మోహన వంశీ



సాక్షి, హైదరాబాద్: కేన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్సల్లో కృత్రిమ మేధ (ఏఐ)దే భవిష్యత్తు అని ప్రముఖ ఆంకాలజిస్ట్, ఒమేగా హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ మోహనవంశీ తెలిపారు. అందుకే తాము దేశంలోనే మొట్టమొదటిసారి కృత్రిమ మేధతో పనిచేసే డిజిటల్ పెట్‌స్కాన్, పెట్ ఎంఆర్‌ఐలను అందుబాటులోకి తెచ్చామని 'సాక్షి'తో చెప్పారు. కేన్సర్ ఏ దశలో ఉందన్న విషయాన్ని తెలుసుకొనేందుకు 15 ఏళ్లుగా పెట్ స్కాన్‌ను వాడుతున్నారని.. దీనికి ఎక్కువ సమయం పట్టడంతోపాటు రేడియోధార్మికతా ఎక్కువన్నారు. పైగా మెదడులోని కేన్సర్ కణితులను పెట్‌స్కాన్‌తో గుర్తించలేమని వివరించారు. ఈ సమస్యలన్నింటినీ డిజిటల్ పెట్‌స్కాన్, పెట్ ఎంఆర్‌ఐలతో అధిగమించవచ్చని డాక్టర్ మోహనవంశీ చెప్పారు. సాధారణ పెట్‌స్కాన్‌కు 12–15 నిమిషాల సమయం పడితే డిజిటల్ స్కాన్ 3–4 నిమిషాల్లో పూర్తవుతుందని, రేడియోధార్మికత కూడా తక్కువగా ఉంటుందన్నారు. డిజిటల్ పెట్‌స్కాన్ కారణంగా చిన్నచిన్న కణితులను కూడా అత్యంత కచ్చితత్వంతో గుర్తించవచ్చని, ఉపయోగించే రేడియో ఐసోటోప్ కూడా నాలుగు రెట్లు తక్కువని తెలిపారు. కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే పెట్ ఎంఆర్‌ఐ మెదడులోని కేన్సర్లను కూడా చాలా స్పష్టంగా గుర్తించడంతోపాటు కణితిలో ఏ భాగానికి రక్తప్రసరణ ఆగిపోయిందో తెలుసుకునేందుకూ ఉపయోగపడుతుందని డాక్టర్ మోహనవంశీ తెలిపారు. డిజిటల్ ఎంఆర్‌ఐతో బ్రెస్ట్ కేన్సర్ గుర్తింపు కూడా మెరుగ్గా చేయవచ్చని, చిన్నసైజు కణితులను కూడా చూడటం వీలు కావడం వల్ల చికిత్స కూడా మెరుగవుతుందని వివరించారు.

భార్యకు భరణంగా 2.18 లక్షల 'చిల్లర'



చిల్లర బస్తాలతో కోర్టుకు వచ్చిన రాజీ

సేలం: అభిప్రాయబేధాల కారణంగా విడిపోయిన భార్యకు ఇవ్వాల్సిన భరణాన్ని చిల్లర నాణేలుగా భర్త తీసుకువచ్చిన సంఘటన తమిళనాడులోని సేలం కోర్టులో జరిగింది. సేలం జిల్లా దేవన్నక వుండనూరు కిడయూరు మెట్టూరుకి చెందిన రాజీ (57) ఓ ప్రైవేట్ కంపెనీలో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య శాంతి. వీరు అభిప్రాయభేదాల కారణంగా విడివిడిగా జీవిస్తున్నారు. ఈ పరిస్థితిలో భరణం కోసం శాంతి సంగగిరి 2వ క్రిమినల్ కోర్టులో కేసు వేసింది. కేసును విచారించిన న్యాయమూర్తి..శాంతికి ప్రతి నెలా రూ.73,000 జీవన భృతిగా చెల్లించాలని ఆదేశించారు. కాగా, ఆ మొత్తాన్ని రాజీ సరిగ్గా చెల్లించకపోవడంతో శాంతి సంగగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి..బకాయి మొత్తాన్ని (రూ.2.18 లక్షలు) వెంటనే చెల్లించాలని రాజీని ఆదేశించారు. దీంతో బుధవారం ఉదయం రాజీ తన భార్యకు చెల్లించాల్సిన భరణం సొమ్ము రూ.2.18 లక్షలను రూ.10 నాణేలుగా 11 బస్తాల్లో కోర్టుకు తీసుకువచ్చాడు. కాగా, భార్యకు భరణం సొమ్మును చిల్లర రూపంలో ఇచ్చి ఆమెను భర్త అవమానించాడని కోర్టు సిబ్బంది మండిపడ్డారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.